శుక్రవారం
05-04-2024
విజయవాడ ప్రచురణ
సంపుటి : 72, సంచిక : 284
పేజీలు : 8, వెల: రూ.5.00
Simultaneously published from Vijayawada, Hyderabad, Visakapatnam, Kurnool, Tirupathi, Karimnagar, Khammam

www.visalaandhra.com
విశాలాంధ్ర
స్థాపితం : 1952
VISALAANDHRA Regd No.VJ/042/2021-23
అక్షరాక్షరం అభ్యుదయం

ఉ.కొరియా హైపర్‌సోనిక్ క్షిపణి ప్రయోగం విజయవంతం

సియోల్: ఉత్తరకొరియా హైపర్‌సోనిక్ క్షిపణిని విజయవంతంగా ప్రయోగించింది. ఘన ఇంధనంతో దూసుకెళ్లే మధ్యశ్రేణి హైపర్‌సోనిక్ క్షిపణిని అధ్యక్షుడు కిమ్ జొంగ్ ఉన్ పర్యవేక్షణలో ప్రయోగించినట్లు ఉత్తర కొరియా అధికార వర్గాలు వెల్లడించాయి. ఈ క్షిపణి 01 కిలోమీటర్ల ఎత్తుకు వెళ్లిందని, రాకెట్ లాంచర్ నుంచి విడిపోయి వెయ్యి కిలోమీటర్లు ప్రయాణించిందని తెలిపాయి. అయితే ఉత్తర కొరియా ప్రకటనను దక్షిణ కొరియా ఖండించింది. క్షిపణి 600 కిలోమీటర్లు మాత్రమే ప్రయాణించిందని, దాని సామర్థ్యాన్ని ఎక్కువ చేసే ప్రయత్నాన్ని ఉత్తర కొరియా చేస్తోందని విమర్శించింది. జపాన్, అమెరికా ఉత్తర కొరియా వైఖరిని తీవ్రంగా ఖండించాయి.

కేజ్రీవాల్‌కు ఊరట

- జైలు నుంచి పాలనపై కోర్టులు నిర్ణయించలేవు
- వ్యక్తిగత సమస్యలు కాదు... దేశ ప్రయోజనాలకు ప్రాధాన్యతివ్వండి
- పిటిషనర్‌కు ఢిల్లీ హైకోర్టు సూచన
- కేసు కొట్టివేత

న్యూఢిల్లీ: ప్రజాస్వామ్యాన్ని దాని ప్రకారం పనిచేయనివ్వండి, జైలు నుంచి పాలనపై కోర్టులు నిర్ణయించలేవు. వ్యక్తిగత అంశాలకు కాదు దేశ ప్రయోజనలకు ప్రాధాన్యత ఇవ్వండి అంటూ ఢిల్లీ సీఎం అరవింద్ కేజ్రీవాల్ జైలు నుంచి పరిపాలన సాగించడాన్ని సవాల్ చేస్తూ దాఖలైన పిటిషన్‌ను ఢిల్లీ హైకోర్టు గురువారం కొట్టివేసింది. తాత్కలిక ప్రధాన న్యాయమూర్తి మన్మోహన్ నేతృత్వ ధర్మాసనం ఈ కేసును విచారించింది. కేజ్రీవాల్ తప్పుకోవాలని ఆప్‌పై లెఫ్టినెంట్ గవర్నర్ వీకే సక్సేనా ఒత్తిడి తేవడంపై ఆయనకు సూచనలు చేయలేమని పేర్కొంది. 'ఆయనకు మా మార్గ దర్శకత్వం అక్కర్లేదు. ఆయన చట్టానికి లోబడి ఏం చేయాలనుకుంటే అది చేస్తారు' అని ధర్మాసనం వ్యాఖ్యానించింది. హిందూ సేన దాఖలు చేసిన పిటిషన్‌ను హైకోర్టు గురువారం విచారించింది. తాజా తీర్పుతో దీంతో కేజ్రీవాల్‌కు భారీ ఊరట లభించడమే కాకుండా ఆమ్ ఆద్మీ పార్టీ నేతల ఉత్కంఠకు తెరపడింది. ఢిల్లి మద్యం కేసులో విచారణ జరుపుతున్న ఈడీ... మార్చి 21న కేజ్రీవాల్‌ను అరెస్ట్ చేసింది. అవినీతి ఆరోపణలతో ముఖ్యమంత్రి అరెస్ట్ అయి జైలుకు వెళ్లడంతో ఢిల్లీలో పాలన కొరవడిందని హిందూ సేన జాతీయ అధ్యక్షుడు, సామాజిక కార్యకర్త విష్ణు గుప్తా

- మిగతా 2 లో

కవిత మధ్యంతర బెయిల్‌పై 8న తుది తీర్పు

2లో

సీపీఐకి ఒక లోక్‌సభ... 8 అసెంబ్లీ స్థానాలు

కాంగ్రెస్‌తో కుదిరిన ఒప్పందం: రామకృష్ణ

విశాలాంధ్ర-విజయవాడ: ఇండియా కూటమిలో భాగంగా ఆంధ్రప్రదేశ్‌లో కాంగ్రెస్, సీపీఐ మధ్య సీట్ల ఒప్పందం కుదిరింది. ఈ ఒప్పందం ప్రకారం రాష్ట్రంలో సీపీఐ ఒక లోక్‌సభ, 8 అసెంబ్లీ సీట్లలో పోటీ చేస్తుంది. ఈ విషయాన్ని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ గురువారం రాత్రి వెల్లడించారు. కాంగ్రెస్‌తో తమకు సీట్ల ఒప్పందం కుదిరిందని ఆయన తెలిపారు. ఒక లోక్‌సభ, ఎనిమిది అసెంబ్లీ స్థానాల్లో సీపీఐని బలపర్చటానికి కాంగ్రెస్ అంగీకారం తెలిపిందన్నారు. ఇటీవల హైదరాబాద్‌లో ఏపీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల నివాసంలో రెండు పార్టీల మధ్య తొలివిడత చర్చలు జరిగాయన్నారు. కాంగ్రెస్ నుంచి షర్మిల, సీడబ్ల్యూసీ సభ్యులు రఘువీరారెడ్డి, గిడుగు రుద్రరాజు, పార్టీ కేంద్ర ప్రతినిధి కె.రాజు పాల్గొనగా సీపీఐ నుంచి కె.రామకృష్ణ సహా రాష్ట్ర సహాయ కార్యదర్శి ముప్పాళ్ల నాగేశ్వరావు, కార్యదర్శివర్గ సభ్యుడు జి.ఓబులేసు పాల్గొన్నారు. గుంటూరు పార్లమెంటు నియోజకవర్గంతో పాటు విశాఖపట్నం పశ్చిమ, ఏలూరు, విజయవాడ పశ్చిమ, అనంతపురం, పత్తికొండ, తిరుపతి, రాజంపేట, కమలాపురం అసెంబ్లీ నియోజకవర్గాలు ఉన్నాయని రామకృష్ణ వివరించారు.

కలెక్టర్లు, ఎస్పీల నియామకం

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: ఆంధ్రప్రదేశ్‌లో మూడు జిల్లాల కలెక్టర్లు, ఐదు జిల్లాల ఎస్పీలను నియమించారు. ఎన్నికల ప్రక్రియలో నిర్లక్ష్యంతోపాటు అధికార వైసీపీకి అనుకూలంగా వ్యవహరిస్తున్నారన్న ఆరోపణలపై కొందరు ఎస్పీలు, కలెక్టర్లపై ఇటీవల అందిన ఫిర్యాదులపై ఈసీ బదిలీ వేటు వేసిన విషయం విదితమే. వారి స్థానంలో అధికారులను నియ మిస్తూ ఎన్నికల సంఘం గురువారం ఉత్తర్వులు జారీజేసింది. నూతనంగా నియమితులైన అధికారులంతా వారంతా గురువారం రాత్రి ఎనిమిది గంటల్లోగా చార్జ్ తీసుకోవాలని ఆదేశిం చింది. కృష్ణాజిల్లా కలెక్టర్‌గా డీకే బాలాజీ, అనంతపురం కలెక్టర్‌గా వినోద్‌కుమార్, తిరుపతి కలెక్టర్‌గా ప్రవీణ్‌కుమార్, ప్రకాశం ఎస్పీగా సుమిత్ సునీల్, పల్నాడు ఎస్పీగా బిందు మాధవ్, చిత్తూరు ఎస్పీగా మణికంఠ చందోలు, అనంతపురం ఎస్పీగా అమిత్ బర్దర్, నెల్లూరు ఎస్పీగా అరిఫ్ హాఫీజ్, గుంటూరు ఐజీగా సర్వశ్రేష్ఠ త్రిపాఠి నియమితులయ్యారు.

అవే అవస్థలు



- పెన్షన్ల కోసం పడిగాపులు
- సచివాలయాలకు వృద్ధులు, వికలాంగుల క్యూ

విశాలంధ్ర బ్యూరో-అమరావతి: సామాజిక పెన్షన్ల పంపిణీలో ఇబ్బందులు కొనసాగుతున్నాయి. పెన్షన్ల పంపిణీలో వృద్ధులు, వికలాంగుల అవస్థలు తగ్గడం లేదు. ఎండకు, వడదెబ్బకు వృద్ధులు అల్లాడుతున్నారు. కొన్నిచోట్ల టెంట్లు, తాగునీటి సదుపాయం కల్పించినప్పటికీ ఎండలు తీవ్ర ఇబ్బందులు కలిగిస్తున్నాయి. గురువారం రాష్ట్రవ్యాప్తంగా మండుటెండల్లోనే పెన్షన్ల కోసం గ్రామ, వార్డు సచివాలయాల దగ్గర పడిగాపులు కాశారు. ఉదయం 7 గంటల నుంచి సచివాలయాల్లో పెన్షన్ పంపిణీ ప్రారంభించాలని అన్ని జిల్లాల కలెక్టర్లకు ఆదేశాలు జారీజేశారు. ఆయా గ్రామ, వార్డు సచివాలయాలకు వృద్ధులు, వికలాంగులు, అనారోగ్యం బారిన పడిన వారంతా పెద్దఎత్తున తరలివచ్చారు. మండుటెండలో వారంతా బారులు తీరి, పెన్షన్ కోసం పడిగాపులు కాశారు. తొలిరోజు పెన్షన్ల పంపిణీ అంతంత మాత్రంగానే జరిగింది.మొదటిరోజు ఎండదెబ్బకు కొంతమంది వృద్ధులు సైతం మృతి చెందారు. ఈ సంఘటనలు జరిగినప్పటికీ పెన్షన్లను సక్రమంగా పంపిణీ చేయడంలో ప్రభుత్వ యంత్రాంగం పూర్తిగా విఫలమైందన్న విమర్శలున్నాయి. ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు ఇంటింటా పెన్షన్ల పంపిణీకి వలంటీర్లను దూరం చేయడంతో ఈ పరిస్థితి ఎదురైంది. గ్రామ, వార్డు సచివాలయాల సిబ్బందికి పెన్షన్ల బాధ్యతలు అప్పగించారు. తొలిరోజు చాలా సచివాలయాలకు బ్యాంకుల నుంచి డబ్బు జమ కానందున ఆలస్యంగా పంపిణీ జరిగింది. తొలిరోజు మొత్తం 14,994 గ్రామ, వార్డు సచివాలయాలకుగాను 13,669 సచివాలయాల్లో పెన్షన్ పంపిణీ చేశారు. మొత్తం 25.66 లక్షల మంది లబ్ధిదారులకు పెన్షన్లు అందాయి. అధికంగా అనారోగ్య సమస్యలున్న వృద్ధులు, వికలాంగులు తదితర నాలుగు విభాగాల పెన్షన్‌దారులకు తప్పనిసరిగా ఇంటి వద్దనే అందించాలని నిబంధనలు విధించారు. ఈ విభాగాల పెన్షన్‌దారులు సచివాలయాలకు రావాల్సిన అవసరం లేదని, ఇంటి వద్దకే పెన్షన్ అందించేలా కార్యాచరణ రూపొందించారు. మిగిలిన వారంతా గ్రామ, వార్డు సచివాలయాలకు వచ్చి పెన్షన్లు తీసుకోవాలని సమాచారం అందించారు. దీంతో అందరూ ఒక్కసారిగా సచివాలయాలకు తరలిరావడంతో పెన్షన్ల పంపిణీకి ఆటంకం ఏర్పడింది. ఈనెల 3వ తేదీ నుంచి 6వ తేదీలోగా పెన్షన్లు పంపిణీ చేయాలని ఎన్నికల సంఘం కలెక్టర్లను ఆదేశించింది. ప్రస్తుత పరిస్థితులను చూస్తుంటే... అప్పటిలోగా పూర్తిస్థాయిలో పెన్షన్ల పంపిణీ సాధ్యమయ్యేలా కనిపించడం లేదు. ఇంకా రెండు రోజులు మాత్రమే పెన్షన్ల పంపిణీకి సమయం ఉంది. ఈలోగా పెన్షన్లు పంపిణీ చేయకుంటే వృద్ధులు, వికలాంగులు తీవ్ర ఇబ్బందులకు గురవుతారు.

అవినాశ్ బెయిల్ రద్దు చేయండి

తెలంగాణ హైకోర్టుకు సీబీఐ వినతి

విశాలాంధ్ర బ్యూరో- అమరావతి: వైసీపీ కడప ఎంపీ అభ్యర్థి అవినాశ్‌రెడ్డి ముందస్తు బెయిల్ రద్దు చేస్తేనే... వివేకా హత్య కేసులో సాక్షులను కాపాడగలమని తెలంగాణ ఉన్నత న్యాయస్థానానికి సీబీఐ విజ్ఞప్తి చేసింది. అవినాశ్‌రెడ్డి బెయిల్ రద్దు కోరుతూ వివేకా హత్యకేసులో అప్రూవర్‌గా మారిన దస్తగిరి వేసిన పిటిషన్‌పై తెలంగాణ హైకోర్టులో గురువారం విచారణ జరిగింది. దస్తగిరి పిటిషన్‌పై సీబీఐ కౌంటరు దాఖలు చేసింది. వైఎస్ అవినాశ్‌రెడ్డి ముందస్తు బెయిల్ రద్దు చేయాలని సీబీఐ కోరింది. హైకోర్టు విధించిన బెయిల్ షరతులు ఆయన ఉల్లంఘించారని తెలిపింది. అవినాశ్‌రెడ్డి, ఇతర నిందితులు అత్యంత ప్రభావితం చేసే వ్యక్తులని, నిందితులు ఇప్పటికే అనేకమంది సాక్షులను ప్రభావితం చేశారని కోర్టు దృష్టికి సీబీఐ తీసుకొచ్చింది. వివేకా హత్యకేసులో దస్తగిరి కీలక సాక్షి, అప్రూవర్. అతనితో పాటు కుటుంబ సభ్యులనూ నిందితులు

- మిగతా 2 లో

జగన్‌వి శవరాజకీయాలు

కొవ్వూరు సభలో చంద్రబాబు

విశాలాంధ్ర-కొవ్వూరు: శవ రాజకీయాలకు పెట్టింది పేరు సైకో సీఎం జగన్‌మోహన్ రెడ్డి అంటూ టీడీపీ అధినేత నారా చంద్రబాబు నాయుడు ధ్వజమెత్తారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా ప్రజాగళం పేరిట రాష్ట్రంలో బహిరంగ సభలు నిర్వహిస్తున్న చంద్రబాబు గురువారం తూర్పుగోదావరి జిల్లా కొవ్వూరు పట్టణం విజయ విహార్ సెంటర్లో నిర్వహించిన భారీ బహిరంగ సభలో ప్రసంగించారు. 2014 ఎన్నికలలో తండ్రి మరణాన్ని అడ్డుపెట్టుకొని సానుభూతి పొందాలని చూశారని విమర్శించారు. 2019 ఎన్నికల్లో బాబాయ్ శవాన్ని అడ్డం పెట్టుకుని ఎన్నికల్లో లబ్ధి పొందారని ఆరోపించారు. ఈసారి ఎన్నికల్లో కూడా శవ రాజకీయాలను చేస్తున్నారని దుయ్యబట్టారు. తన తండ్రిని రిలయన్స్ సంస్థ చంపించినదని చెప్పే ఈ పెద్దమనిషి అదే సంస్థకు ఎంపీ పదవి కట్టబెట్టిన ఘనుడు చంద్రబాబు విమర్శించారు. ఈ ఎన్నికలలో మరో శవం కోసం వెతుకుతున్నాడని పేర్కొన్నారు. వైసీపీ డీఎన్ఏ లోనే రక్త చరిత్ర ఉందని ఈ విషయాన్ని ఇప్పుడు జగన్ చెల్లెళ్లే బయట పెట్టారని చెప్పారు. వలంటీర్ల వ్యవస్థకు తాను వ్యతిరేకం కాదని... కాకపోతే వారు ఏ రాజకీయ పార్టీకి వత్తాసుగా ఉండరాదన్నది తన అభిమతం అన్నారు. రాష్ట్ర సంక్షేమం కోసం, పిల్లల భవిష్యత్తు కోసం జగన్‌ను గద్దె దింపడానికి తాను ఎండనక వాననక సభలు నిర్వహిస్తున్నానన్నారు. జగన్ పాలలో ఇసుక, మద్యం, మట్టి మాఫియా చెలరేగి పోయిందన్నారు. నాణ్యతలేని మద్యం వల్ల ఎందరో ఆడబిడ్డల తాళిబొట్లు తెగిపోయాయని... ఆ ఉసురు జగన్ ఊరికే వదలదని ఆగ్రహం వ్యక్తం చేశారు. సూపర్ సిక్స్ పథకంతో ఎన్డీఏ కూటమి ముందుకు వెళుతుందని... రాబోయే రోజుల్లో దళితులకు, పేదలు, మైనార్టీ వర్గాల సంక్షేమం లక్ష్యంగా ముందుకు వెళ్తామన్నారు. మాట్లాడితే జగన్ తాను పేదనని... ప్రతిపక్షాలను పెత్తందారులనడం హాస్యాస్పదంగా ఉందన్నారు. జగన్ కేసుల్లో సీబీఐ, ఈడీ కలిసి రూ.43 వేల కోట్లకు చార్జిషీటు దాఖలు చేశాయన్నారు. దీన్నిబట్టి పేదలు ఎవరో పెత్తందారులు ఎవరు తెలుస్తుందన్నారు. ఎన్డీఏ కూటమి అధికారంలోకి వస్తే ఐదేళ్లలో యువతకు 50 లక్షల ఉద్యోగాలు కల్పిస్తామన్నారు. అదేవిధంగా సంపద సృష్టిస్తామన్నారు. మహిళలకు ఉచిత ఆర్టీసీ ప్రయాణం, 55 ఏళ్లకే పెన్షన్, ఇంట్లో ఎంతమంది పిల్లలు ఉంటే ఒక్కొక్కరికి 15000 చొప్పున తల్లికి వందనం అమలు చేస్తామన్నారు. అధికారంలోకి వచ్చిన నెల నుంచే రూ.4,000 ఫించను అందజేస్తామన్నారు. జగన్ సింబల్ ఫ్యాన్ ముక్కలైందని

- మిగతా 2 లో

మొదటి సంతకం వలంటీర్ వ్యవస్థ పైనే

- నాయుడుపేట సభలో సీఎం జగన్
- మరోసారి వచ్చేది వైసీపీ ప్రభుత్వమేనని ధీమా

విశాలాంధ్ర-నాయుడుపేట: ఏపీలో మరోసారి వచ్చేది వైసీపీ ప్రభుత్వమే అని సీఎం జగన్ జోస్యం చెప్పారు. వైసీపీ ప్రభుత్వం రాగానే తన తొలి సంతకం వలంటీర్ వ్యవస్థపైనే ఉంటుందన్నారు జగన్. 'మేమంతా సిద్ధం' బస్సు యాత్రలో భాగంగా 8వ రోజు గురువారం సాయంత్రం తిరుపతి జిల్లా నాయుడుపేట బైపాస్‌లో నిర్వహించిన బహిరంగ సభలో సీఎం జగన్ మాట్లాడుతూ... టీడీపీ అధినేత చంద్రబాబుపై నిప్పులు చెరిగారు. చంద్రబాబు తన పాలనతో ఒక్క హామీ అయినా నేరవేర్చారా అని సీఎం జగన్ నిలదీశారు. మన ప్రభుత్వంలో అవ్వా తాతల ఇంటికి వెళ్లి పెన్షన్ ఇచ్చే వాళ్లమని, అది తట్టుకోలేకపోయిన చంద్రబాబు తన మనుషులతో అడ్డుకున్నారని సీఎం జగన్ ఆరోపించారు. కుటిల కూటమిని తరిమికొట్టేందుకు అందరూ సిద్ధమయ్యారని జగన్ అన్నారు. మంచిని అడ్డుకుంటున్న దుష్టచతుష్టయంపై యుద్ధానికి సిద్ధం అని ప్రకటించారు. మీరు వేసే ప్రతీ ఓటు మీ తలరాతను మార్చే ఓటు అని జగన్ అన్నారు. ఇవి మీ భవిష్యత్తును నిర్ణయించే ఎన్నికలు అని చెప్పారు. ఈ ఎన్నికలు రెండు భావ జాలాల మధ్య జరుగుతున్న సంఘర్షణ అని వ్యాఖ్యానించారు. ఈ ఎన్నికలు పెత్తందారులు, పేదలకు మధ్య జరుగుతున్న పోరాటం అన్నారు. 'కొంచెం ఓపిక పట్టండి. జూన్ 4న మళ్లీ మీ బిడ్డ ప్రభుత్వం వస్తుంది. నా మొట్టమొదటి సంతకం వలంటీర్ వ్యవస్థపైనే చేస్తాను. మళ్లీ వలంటీర్ వ్యవస్థను తీసుకొచ్చి ప్రతి ఇంటికి కూడా మళ్లీ సేవలు అందించే కార్యక్రమం ప్రారంభిస్తాను. ఇదే చంద్రబాబును అడుగుతున్నా. అయ్యా చంద్రబాబు మీ హయాంలో జన్మభూమి కమిటీలు పెట్టుకున్నారు కదా... పెన్షన్

- మిగతా 2 లో

ఇదీ లోకం!

'కార్పొరేట్' దోపిడి!

- నిబంధనలకు విరుద్ధంగా ఇంటర్ ప్రవేశాలు, బ్రిడ్జి కోర్సులు
- ఐఐటీ, నీట్ పేరుతో ఫీజుల దందా
- స్పందించని ప్రభుత్వం
- లబోదిబోమంటున్న తల్లిదండ్రులు

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: కార్పొరేట్ విద్యా సంస్థలు భారీగా ఫీజుల దోపిడీకి పాల్పడుతున్నాయి. 2024-25 విద్యా సంవత్సరం ప్రారంభం కాకముందే ఇంటర్మీడియట్ బోర్డు నిబంధనలకు విరుద్ధంగా కార్పొరేట్, ప్రైవేట్ విద్యా సంస్థలు ప్రవేశాలు నిర్వహిస్తున్నాయి. వివిధ పేర్లతో ఇంటర్‌తోపాటు ఐఐటీ, మెడికల్ ఇంటిగ్రేటెడ్ కోర్సులను సృష్టించి ఫీజుల దందా నిర్వహిస్తున్నాయి. విద్యార్థులు, తల్లిదండ్రులకు మాయమాటలు చెబుతూ తమ ఆగడాలు కొనసాగిస్తున్నాయి. ఆంధ్రప్రదేశ్‌లో పేరొందిన రెండు, మూడు కార్పొరేట్ విద్యా సంస్థలు తమకు ఎదురులేదనే రీతిలో భారీగా ఇంటర్‌లో ముందస్తు ప్రవేశాలకు తెరదీశాయి. ఆయా సంస్థలకు చెందిన అన్ని బ్రాంచి విద్యార్థులు సాధించిన జేఈఈ, నీట్ ర్యాంకులన్నీ ఒకే బ్రోచర్‌లో పేర్చి, వారి ఘనతను చాటుకునేందుకు ప్రయత్నిస్తున్నాయి. ఇంటర్‌తోపాటు ఐఐటీ, నీట్ శిక్షణ పేరుతో పెద్దఎత్తున ఫీజుల దోపిడీకి పాల్పడుతున్నాయి. ఆలస్యమైతే మా విద్యా సంస్థల్లో సీట్లు ఉండవంటూ హడావుడీ సృష్టిస్తున్నారు. ఇంటర్, ఐఐటీ కోర్సులకు డే స్కాలర్‌కు రూ.లక్ష నుంచి రూ.లక్షా 50వేల వరకు చెబుతున్నారు. దానిపై కొద్దిపాటి బేరమాడితే రూ.10వేలలోపు తగ్గించి ప్రవేశాలు కల్పిస్తున్నారు. ఇంటర్, మెడికల్ కోర్సులకైతే అదనంగా మరో రూ.లక్షా 60వేల వరకు డే స్కాలర్‌కు ఫీజులు నిర్ధారిస్తున్నారు. హాస్టలైతే మరో రూ.లక్షా 50వేలు అదనంగా దండుకుంటున్నారు. ఇంటర్‌తోపాటు జేఈఈ మెయిన్స్, అడ్వాన్స్‌డ్ కోర్సులు లేదా ఇంటర్‌తో పాటు నీట్ కోర్సు చదవాలనుకునే డే స్కాలర్ విద్యార్థికి రెండేళ్లకుగాను రూ.3 లక్షలు దాటుతోంది. హాస్టల్ విద్యార్థులకైతే రూ.6 లక్షలకు చేరుతోంది. ఇంటర్‌తోపాటు ఏపీ ఈఏపీసెట్

- మిగతా 2 లో

వలసదారులకే సీట్లు!

- 'జనసేన'లో సగం కొత్త వారికే కేటాయింపు
- అవనిగడ్డ అభ్యర్థి మండలిపై తీవ్ర వ్యతిరేకత
- రాష్ట్రవ్యాప్తంగా పెరుగుతున్న అసంతృప్తులు

విశాలంధ్ర బ్యూరో-అమరావతి: వలసలకే జనసేనలో సీట్లు కేటాయించడంపై ఆ పార్టీలో నిరసనలు కొనసాగుతున్నాయి. తాజాగా అవనిగడ్డ అసెంబ్లీ సీటును టీడీపీ నుంచి జనసేనలో చేరిన మాజీ మంత్రి మండలి బుద్ధప్రసాద్‌కు కేటాయించడంపై స్థానిక నేతలు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారు. అవనిగడ్డ అసెంబ్లీ కోసం జనసేన నుంచి ముగ్గురు అభ్యర్థులు టికెట్‌ను ఆశించారు. పదేళ్ల నుంచి వారంతా పార్టీ కోసం పనిచేస్తున్నారు. వారిలో ఎవరికీ సీటు ఇవ్వకుండా టీడీపీ నుంచి జనసేనలో చేరిన రెండు రోజుల్లోనే బుద్ధప్రసాద్‌కు సీటు ఇవ్వడంపై

- మిగతా 2 లో

రైల్వేకోడూరు జనసేన అభ్యర్థి మార్పు

అరవ శ్రీధర్‌కు అవకాశం... అవనిగడ్డకు 'మండలి'

2లో

ట్రంప్, బైడెన్ పోటాపోటీ విజయాలు

- మరో 4 రాష్ట్రాల ప్రైమరీల్లో గెలుపు
- ఒపీనియన్ పోల్స్‌లో బైడెన్ వెనుకంజ

వాషింగ్టన్: అమెరికా అధ్యక్ష ఎన్నికల్లో రిపబ్లికన్ పార్టీ తరఫున డొనాల్డ్‌ట్రంప్, డెమొక్రట్ల తరఫున జో బైడెన్ ప్రైమరీ ఎన్నికల్లో వరుస విజయాలు నమోదు చేస్తున్నారు. తాజాగా మరో నాలుగు రాష్ట్రాలు కైవసం చేసుకున్నారు. రోడె ఐలాండ్, కెనెక్టికట్, న్యూయార్క్, విస్కాంసిన్‌లో రసవత్తరంగా పోరు సాగింది. నాలుగు రాష్ట్రాల్లో అధ్యక్ష పీఠానికి పోటీ చేసే అనేక అభ్యర్థులు ఉన్నాగానీ ఇటు ట్రంప్‌కు అటు బైడెన్‌కు సమర్థ ప్రత్యర్థి లేకుండా పోయారు. నాలుగు రాష్ట్రాల్లో జరిగిన ప్రైమరీల్లో ఇద్దరు గెలుపు నమోదు చేశారు. ట్రంప్‌కు 75శాతం ఓట్లు రాగా బైడెన్‌కు 80శాతం ఓట్లు వచ్చాయి. ట్రంప్‌కు 1,860 మంది ప్రతినిధుల మద్దతు ఉంటే బైడెన్ మద్దతుదారుల సంఖ్య3,030కు పెరిగింది. అభ్యర్థికి కనీసం 1,968 మంది మద్దతు ఉండటం అవసరం. 2020 తరహాలోనే వీరిద్దరికి ప్రత్యక్ష పోరు ఏర్పడుతుందన్న అంచనాలు పెరిగాయి. కాగా, ఒపీనియన్ పోల్స్ ప్రకారం బైడెన్ కంటే ట్రంప్‌కు ఎక్కువ ఆదరణ ఉన్నట్లు వెల్లడైంది. ఏడు రాష్ట్రాల్లో సర్వే చేయగా ఆరు రాష్ట్రాల్లో ట్రంప్‌కు ఆధిక్యం లభించనున్నట్లు తెలిసింది. బైడెన్‌పై ఓటర్లలో అసంతృప్తి ఉంది. దేశ ఆర్థిక వ్యవస్థ, ఉపాధి కల్పన వంటి సమస్యల పరిష్కారంలో ఆయన సామర్థ్యంపై సందేహం వ్యక్తం చేసినట్లు వాల్ స్ట్రీట్ జర్నల్ నిర్వహించిన ఒపీనియన్ పోల్ తేల్చింది. పెన్సిల్వేనియా, మిషిగన్, అరిజోనా, జార్జియా, నెవడా, ఉత్తర కరోలినా, విస్కాన్సిన్ రాష్ట్రాల్లో సర్వే నిర్వహించారు. ఒక్క విస్కాన్సిన్‌లో ట్రంప్ కంటే బైడెన్ ముందంజలో ఉన్నారు. అరిజోనాలో మాత్రమే ట్రంప్‌కు ప్రతికూల పరిస్థితి ఉంది. 'రియల్ క్లియర్ పాలిటిక్స్' ప్రకారం బైడెన్, ట్రంప్ మధ్య హోరాహోరీ పోటీ ఉండనుందని తెలిపింది.

జపాన్‌లో భూకంపం

టోక్యో: తైవాన్‌లో శక్తిమంతమైన భూకంపం సంభవించి సుమారు వెయ్యి మందికిపైగా గాయపడిన ఘటన మరువక ముందే జపాన్‌లో భూమి కంపించింది. గురువారం ఉదయం హోన్షు తూర్పు తీరంలో భూకంపం వచ్చినట్లు యూరోపియన్-మెడిటరేనియన్ సిస్మోలాజికల్ సెంటర్ తెలిపింది. రిక్టరు స్కేలుపై భూకంపం తీవ్రత 6.3గా నమోదైనట్లు వెల్లడించింది. భూమికి 32 కిలోమీటర్ల లోతులో భూకంప కేంద్రాన్ని గుర్తించింది. అయితే, ప్రాణ, ఆస్తి నష్టానికి సంబంధించి ఎలాంటి సమాచారం తెలియరాలేదు. రాజధాని టోక్యోలో కూడా ప్రకంపనలు చోటుచేసుకున్నట్లు స్థానిక మీడియా వెల్లడించింది. కాగా, తైవాన్‌లో బుధవారం సంభవించిన తూఫాను ధాటికి10 మంది ప్రాణాలు కోల్పోయారు. వెయ్యి మందికిపైగా గాయపడ్డారు. 50 మందికిపైగా గల్లంతయ్యారు. మరికొందరు శిథిలాల కింద చిక్కుకున్నట్లు తెలుస్తోంది.

ప్రపంచంలోనే అత్యంత వృద్ధుడి కన్నుమూత

కారకస్: వెనిజులాకు చెందిన 114 ఏళ్ల జువాన్ విసెంటీ పెరీజ్ మోరా కన్ను మూశారు. ప్రపంచంలోనే అత్యంత వృద్ధుడిగా ఈయన పేరిట గిన్నిస్ రికార్డు ఉంది. మోరాకు ఆరుగురు కమారులు, ఐదుగురు కుమార్తెలు ఉండగా 41 మంది మనుమలు, మనువరాళ్లు... 18 మంది మునిమనువలు, మనుమరాళ్లు ఉన్నారు. 1909, మే 27న మోరా జన్మించారు. మరణం వరకు ఆయన పొలంలో పనిచేశారు. చిన్నతనం నుంచే ఆయనకు పొలం పని చేయడం అలవాటు. త్వరగా నిద్రపోవడం, రోజూ ఒక పెగ్గు తాగడమే ఆయన దీర్ఘ ఆయుష్షుకు రహస్యమని మోరా చెప్పుకునేవారట!

అక్రమ సంబంధం బయటపడటంతో...

గోరఖ్‌పూర్: భర్త, పిల్లలున్న ఓ మహిళ మరో వ్యక్తితో ప్రేమాయణం నడిపింది. చివరకు అది బయటపడటంతో ఇద్దరితో కలిసి ఉంటానంటూ మొండిపట్టు పట్టింది. అందుకు ఇంట్లోవాళ్లు అంగీకరించకపోవడంతో కరెంట్ స్తంభం ఎక్కి నిరసన చేపట్టింది. ఉత్తరప్రదేశ్‌లోని గోరఖ్‌పూర్‌లో జరిగిన ఈ ఘటన వైరల్‌గా మారింది. వివరాల్లోకి వెళితే... పిప్రాయిచ్ ప్రాంతానికి చెందిన ఓ 34 ఏళ్ల మహిళకు చాలా ఏళ్ల క్రితం ఓ వ్యక్తితో వివాహమైంది. వీరికి ముగ్గురు సంతానం. అయితే, గత ఏడేళ్లుగా ఆ మహిళ పొరుగూరికి చెందిన మరో వ్యక్తితో వివాహేతర సంబంధం పెట్టుకుంది. ఇటీవల భర్తకు ఈ విషయం తెలియడంతో ఆమెను నిలదీశాడు. దీంతో వారి మధ్య గొడవ జరిగింది. ప్రియుడు తమతోనే ఉంటాడని, అలాగైతే ఇంటి ఆర్థిక సమస్యలు కూడా తొలుగుతాయని భర్తను కోరింది. ఇందుకు అతడు అంగీకరించకపోవడంతో ఆత్మహత్య చేసుకుంటానని బెదిరించింది. ఈ క్రమంలోనే గ్రామంలోని విద్యుత్ స్తంభం ఎక్కి నిరసన చేపట్టింది. గమనించిన స్థానికులు వెంటనే విద్యుత్‌శాఖకు ఫోన్ చేయడంతో వారు విద్యుత్ సరఫరా నిలిపివేశారు. అనంతరం పోలీసులు అక్కడకు చేరుకుని బలవంతంగా కిందకు దించాల్సి వచ్చింది. ఇందుకు సంబంధించిన దృశ్యాలు సామాజిక మాధ్యమాల్లో వైరల్ అయ్యాయి.

బీహార్‌లో ఎల్‌జేపీకి ఎదురు దెబ్బ

పాట్నా: బీహార్ ఎన్‌డీఏ కూటమి భాగస్వామి లోక్‌జనశక్తి పార్టీ(ఎల్‌జేపీ)కి పెద్ద ఎదురుదెబ్బ తగిలింది. సార్వత్రిక ఎన్నికలు సమీపిస్తున్న వేళ బీహార్‌లో ఎన్‌డీఏకి తీవ్ర నష్టం వాటిల్లే పరిణామంగా ఇది మారింది. లోక్‌సభ టికెట్లు దక్కకపోవడంతో 22 మంది నాయకులు గురువారం ఆ పార్టీకి రాజీనామా చేశారు. మాజీ మంత్రి రేణు కుష్వాహ, మాజీ ఎమ్మెల్యే, ఎల్‌జేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి సతీశ్ కుమార్, రవీంద్ర సింగ్, అజయ్ కుష్వాహ, సంజయ్ సింగ్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రాజేశ్ డాంగి సహా ప్రముఖ నేతలు ఎల్‌జేపీకి గుడ్‌బై చెప్పారు. వారంతా ఇండియా తెలుపుతున్నట్లు ప్రకటించారు. పార్టీ అధ్యక్షుడు చిరాగ్ పాశ్వాన్ అన్ని లోక్‌సభ టికెట్లను అమ్ముకున్నారని వారు మండిపడ్డారు. పార్టీ కార్యకర్తలకి కాకుండా బయటి వ్యక్తులకు టికెట్లు ఎందుకు ఇచ్చారని మాజీ ఎంపీ రేణు కుష్వాహ ప్రశ్నించారు. బయటి వ్యక్తులకు టికెట్లు ఇవ్వడమంటే పార్టీలో సమర్థవంతులు లేరని అర్థమని, పార్టీలో కూలీలుగా పని చేయడానికి తాము సిద్ధంగా లేమని తేల్చిచెప్పారు. తామంతా ఇండియా కూటమికి మద్దతు తెలుపుతున్నామని సతీశ్ కుమార్ పేర్కొన్నారు. దేశంలో ముఖ్యమైన ఎన్నికలు జరుగుతున్న సమయంలో ఎల్‌జేపీ అధిష్ఠానం బయటి వ్యక్తులకు టికెట్లు కేటాయించడమేమిటని మండిపడ్డారు. చిరాగ్ పాశ్వాన్ బీహార్ ప్రజలకు ద్రోహం చేశారని విమర్శించారు. దేశాన్ని కాపాడాలంటే ఇండియా కూటమికి మద్దతివ్వాలని చెప్పారు. తాము ఇండియా కూటమికి మద్దతు ఇస్తామని స్పష్టం చేశారు. చిరాగ్ టికెట్లు అమ్ముకున్నారని ఎల్‌జేపీ కార్యనిర్వాహక కార్యదర్శి రవీంద్ర సింగ్ ధ్వజమెత్తారు. ఈ ఎన్నికల్లో బీహార్ ప్రజలు సరైన సమాధానమిస్తారని అన్నారు. ఎంపీ టికెట్లు కేటాయించే సమయంలో పార్టీ సీనియర్ నేతలతో చిరాగ్ సంప్రదింపులు జరపలేదని మరికొంతమంది నేతలు ఆరోపించారు.

జగన్‌వి శవరాజకీయాలు

(మొదటిపేజీ తరువాయి)

ఇప్పుడు గొడ్డలిని అతని పార్టీ సింబల్ గా పెట్టుకోవాలంటూ ఎద్దేవా చేశారు. గోదావరి పై ఉన్న వంతెనల దగ్గర ఇసుకను తవ్వేయడంతో గ్రామన్ ఇండియా బ్రిడ్జి కుంగిపోయిన మాట వాస్తవమా కాదా అని ప్రశ్నించారు. అంతకుముందు కొవ్వూరు టీడీపీ అభ్యర్థి ముప్పిడి వెంకటేశ్వరరావు స్థానిక సమస్యలపై మాట్లాడారు. ఈ కార్యక్రమంలో రాజమండ్రి రూరల్ అభ్యర్థి గోరంట్ల బుచ్చయ్య చౌదరి, ఆచంట అభ్యర్థి సత్యనారాయణ, టీడీపీ సీనియర్ నాయకులు పెండ్యాల అచ్చి బాబు, కొవ్వూరు ద్విసభ్య కమిటీ సభ్యులు జొన్నలగడ్డ చౌదరి రామకృష్ణ, కొవ్వూరు జనసేన ఇన్‌ఛార్జి టీవీ రామారావు, బీజేపీ రాజమండ్రి పార్లమెంట్ అధ్యక్షుడు పరిమి రాధ, కొవ్వూరు పట్టణ జనసేన అధ్యక్షుడు దేగల రాము, టీడీపీ పరిశీలకుడు గొర్రెల శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

వలసదారులకే సీట్లు!

(మొదటిపేజీ తరువాయి)

అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికే విజయవాడ పశ్చిమ సీటు కోసం జనసేన నేత పోతిన మహేశ్ ఆశించి భంగపాటుకు గురయ్యారు. ఆ సీటును చివరి దశలో పొత్తులో భాగంగా బీజేపీకి కేటాయించడంతో పోతినకు చుక్కెదురైంది. తనకు సీటు కేటాయించాలని పదేపదే పవన్ కల్యాణ్ చుట్టూ తిరిగినా ఫలితం లేదు. పశ్చిమ నియోజకవర్గంతో ఎలాంటి సంబంధం లేని బీజేపీకి చెందిన మాజీ రాజ్యసభ సభ్యుడు సుజనా చౌదరికి టికెట్ కట్టబెట్టారు. పశ్చిమ సీటు బీజేపీ కేటాయించడంతో టీడీపీ, జనసేన నేతలు అసంతృప్తితో ఉన్నారు. మచిలీపట్నం ఎంపీ సీటును వైసీపీ నుంచి వలస వచ్చిన వల్లభనేని బాలశౌరికి, తిరుపతి అసెంబ్లీ సీటు వైసీపీ ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులుకు కేటాయించారు. ఇలా పొత్తుల్లో భాగంగా జనసేనకు దక్కిన 21 అసెంబ్లీ సీట్లలో కనీసం సగం మంది వరకు వలస నేతలకే టికెట్లు ఇవ్వడంతో ఆ పార్టీలో అసంతృప్తులు పెరిగిపోతున్నాయి. ఉమ్మడి ఉభయ గోదావరి జిల్లాల్లోని కాకినాడ రూరల్, తాడేపల్లిగూడెం, అమలాపురం తదితర నియోజకవర్గాల్లో జనసేన నేతలకు టికెట్లు రాకపోవడంతో పార్టీకి రాజీనామా చేసి వైసీపీలో చేరారు. కృష్ణా, గుంటూరు జిల్లాల్లోని చాలా నియోజకవర్గాల్లో కాపు సామాజికవర్గం పట్టున్న ప్రాంతంలోనూ పొత్తుల్లో భాగంగా జనసేన సీట్లను దక్కించుకోలేక పోయింది. ఉమ్మడి కృష్ణాజిల్లాల్లో 16 అసెంబ్లీ స్థానాలు ఉండగా, కేవలం ఒక్క అవనిగడ్డ అసెంబ్లీ సీటునే జనసేన దక్కించుకుంది. తొలుత ఉమ్మడి కృష్ణాజిల్లాల్లో విజయవాడ పశ్చిమ, పెడన, మచిలీపట్నం, అవనిగడ్డ అసెంబ్లీ స్థానాలు దక్కుతాయని ఆశించగా, కేవలం అవనిగడ్డతోనే సరిపెట్టారు. పార్టీ అధినేత పవన్ కల్యాణ్ తీరును జనసేన శ్రేణులు తప్పుపడుతున్నారు.

అవినాశ్ బెయిల్ రద్దు చేయండి

(మొదటిపేజీ తరువాయి)

బెదిరిస్తున్నట్టు దస్తగిరి చెబుతున్నారు. బెదిరింపులు, ప్రలోభాల నుంచి దస్తగిరి, ఇతర సాక్షులను కాపాడాలంటే అవినాశ్ బెయిల్ రద్దు చేయాలని విన్నవించింది. వాదనలు విన్న హైకోర్టు తదుపరి విచారణను ఏప్రిల్ 19కి వాయిదా వేసింది.

కవిత మధ్యంతర బెయిల్‌పై 8న తుది తీర్పు

న్యూఢిల్లీ: కవిత మధ్యంతర బెయిల్ పిటిషన్‌పై ఢిల్లీలోని రౌస్ అవెన్యూ కోర్టు తీర్పును రిజర్వ్‌లో పెట్టింది. సోమవారం తుది తీర్పు వెలువరించనుంది. అంతకు ముందు కవిత మధ్యంతర బెయిల్ పిటిషన్‌పై వాదనలు జరిగాయి. ఈడీ దాఖలు చేసిన కౌంటర్‌పై రిజాయిండర్‌ను కవిత తరఫు న్యాయవాదులు దాఖలు చేశారు. కుమారుడి పరీక్షల దృష్ట్యా మధ్యంతర బెయిల్ ఇవ్వాలని కవిత పిటిషన్ వేశారు. మధ్యంతర బెయిల్‌పై కవిత తరఫున అభిషేక్ మను సింఘ్వీ వాదనలు వినిపించారు. అయితే బెయిల్ ఇస్తే ఆధారాలు, సాక్ష్యాలను ప్రభావితం చేస్తారని, ఆమెకు వ్యతిరేకంగా చాలా ఆధారాలు ఉన్నాయని ఈడీ వాదించింది. ఢిల్లీ మద్యం కుంభకోణానికి కవితే ప్రణాళిక రచించారన్న ఈడీ, ఆమె తన ఫోన్ డేటాను డిలీట్ చేశారని కోర్టుకు తెలిపింది. దర్యాప్తులో అడిగిన ప్రశ్నలకు కవిత సమాధానం ఇవ్వలేదన్న ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ అధికారులు... ఆమె 10 ఫోన్లు ఇచ్చినా, అన్నీ ఫార్మాట్ చేసే ఇచ్చారని, నోటీసులు ఇచ్చిన తర్వాత 4 ఫోన్లను ఫార్మాట్ చేశారని వివరించారు. ఈ కేసులోని నిందితులు వందల డిజిటల్ డివైజ్‌లను ధ్వంసం చేశారని కోర్టుకు ఈడీ వెల్లడించింది. అప్రూవర్‌గా మారిన వ్యక్తిని తనకు వ్యతిరేకంగా సాక్ష్యం చెప్పవద్దని కవిత బెదిరించారని ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ ఆరోపించింది. మరోవైపు తన కుమారుడి పరీక్షల కారణంగా బెయిల్ ఇవ్వాలన్న కవిత వాదనను ఈడీ వ్యతిరేకించింది. ఆమె చిన్న కుమారుడు ఒంటరి వాడు కాదని, తనకు సోదరుడు, కుటుంబసభ్యులు తోడుగా ఉన్నారని కోర్టుకు వివరించింది. ఆమె కుమారుడి పరీక్షల్లో కొన్ని ఇప్పటికే అయిపోయాయని కోర్టు దృష్టికి తెచ్చింది. వాదనలు విన్న కోర్టు తీర్పును రిజర్వ్ చేసింది. ఈ నెల 8న ఉదయం 10.30 గంటలకు మధ్యంతర బెయిల్ పిటిషన్‌పై తుది ఉత్తర్వులు ఇవ్వనున్నట్లు సీబీఐ ప్రత్యేక కోర్టు న్యాయమూర్తి కావేరి భవేజా తెలిపారు. రెగ్యులర్ బెయిల్ పిటిషన్‌పై ఏప్రిల్20న వాదనలు కొనసాగనున్నాయి.

బోరుబావిలో పడ్డ బాలుడు సురక్షితం

బెంగళూరు: కర్నాటకలోని విజయపుర జిల్లా లచయానా గ్రామంలో బోరుబావిలో పడ్డ చిన్నారిని సురక్షితంగా బయటకు తీసుకొచ్చారు. సుమారు 20 గంటలపాటు సంయుక్త రెస్క్యూ ఆపరేషన్‌తో శ్రమించిన ఎన్‌డీఆర్‌ఎఫ్, ఎస్‌డీఆర్‌ఎఫ్ బృందాలు గురువారం మధ్యాహ్నం ఆ బాలుడిని బయటకు తీసుకొచ్చాయి. ముందుజాగ్రత్తగా చిన్నారిని ఆస్పత్రికి తరలించాయి. లచయానా గ్రామంలోని సతీశ్ ముజగొండ అనే వ్యక్తి తన పొలంలో బోరు బావిని తవ్వించాడు. ఏడాదిన్నర వయసున్న కొడుకు అతడి కొడుకు సాత్విక్ పొలంలో ఆడుకుంటూ బుధవారం సాయంత్రం బోరుబావిలో పడిపోయాడు. దాదాపు 16 అడుగుల లోతున ఆ చిన్నారి పడినట్లు గుర్తించి రెస్క్యూ ఆపరేషన్ మొదలు పెట్టారు అధికారులు. రంగంలోకి దిగిన ఎన్‌డీఆర్‌ఎఫ్, ఎస్‌డీఆర్‌ఎఫ్‌లు గంటల తరబడి శ్రమించాయి. బాలుడు మరింత లోపలికి జారిపోకుండా జాగ్రత్తలు తీసుకుంటూనే పైపుల ద్వారా ఆక్సిజన్‌ను అందిస్తూ వచ్చాయి. అదే సమయంలో గ్రామస్తులంతా సాత్విక్ క్షేమంగా బయటకు రావాలని ప్రత్యేక పూజలు చేశారు. చివరకు బాలుడు క్షేమంగా ప్రాణాలతో బయటపడ్డాడు.

ఎంపీ నవనీత్ కౌర్‌కు సుప్రీంకోర్టులో ఊరట

ముంబై: మహారాష్ట్రలోని అమరావతి నుంచి బీజేపీ ఎంపీ అభ్యర్థిగా పోటీ చేయనున్న 'నవనీత్ కౌర్'కు ఊరట లభించింది. కౌర్ కులధ్రువీకరణపై బాంబే హైకోర్టు ఇచ్చిన తీర్పును సుప్రీంకోర్టు కొట్టివేసింది. కుల ధృవీకరణ పత్రం విషయంలో కమిటీ నివేదికపై హైకోర్టు జోక్యం చేసుకోకూడదని న్యాయమూర్తులు జేకే మహేశ్వరి, సంజయ్ కరోల్‌లతో కూడిన ధర్మాసనం పేర్కొంది. నవనీత్ కౌర్ షెడ్యూల్డ్ కులానికి (ఎస్సీ) సంబంధించిన వారు కాదంటూ గతంలో బాంబే హైకోర్టు తీర్పు ఇచ్చింది. అంతే కాకుండా రూ.2 లక్షల జరిమానా కూడా విధించింది. ఆ తరువాత బాంబే హైకోర్టు ఇచ్చిన తీర్పు సరికాదని నవనీత్ కౌర్ సుప్రీంకోర్టును ఆశ్రయించింది. నేడు ఆమెకు అనుకూలంగా కోర్టు తీర్పునిచ్చింది. నా పుట్టుకపై ప్రశ్నలు వేసిన వారికి సమాధానం దొరికింది. సుప్రీం కోర్టుకు ధన్యవాదాలు. సత్యం ఎప్పుడూ గెలుస్తుంది. ఇది బాబా సాహెబ్ అంబేడ్కర్, ఛత్రపతి శివాజీ మహారాజ్ చూపిన మార్గంలో నడిచే వారి విజయమని నవనీత్ కౌర్ అన్నారు. 2019లో ఎన్‌సీపీ మద్దతుతో అమరావతి ఎంపీగా గెలిచిన నవనీత్ కౌర్... ఇటీవల నాగపూర్‌లో రాష్ట్ర అధ్యక్షుడు చంద్రశేఖర్ బవాన్‌కులే సమక్షంలో బీజేపీలో చేరి అమరావతి నుంచి పోటీ చేస్తున్నారు. నవనీత్ కౌర్ తన భర్త రవి రాణాతో కలిసి గురువారం లోక్‌సభ ఎన్నికలకు నామినేషన్లు దాఖలు చేయడానికి ముందు అమరావతిలోని హనుమాన్‌గర్హి మందిర్‌లో ప్రార్థనలు చేశారు.

మొదటి సంతకం వలంటీర్ వ్యవస్థ పైనే

(మొదటిపేజీ తరువాయి)

కావాలన్నా, రేషన్ కావాలన్నా, సర్టిఫికెట్ కావాలన్నా, చివరికి మరుగుదొడ్లు కావాలన్నా కూడా లంచం ఇస్తే కానీ వివక్ష లేకుండా ఏ ఒక్క పేదవాడికి అప్పట్లో అందే పరిస్థితి ఉండేది కాదు. ఆ రోజు జన్మభూమి కమిటీలు ఏ మాదిరి పని చేశాయో అందరికీ తెలుసు. ఇవాళ వలంటీర్ వ్యవస్థ అన్నది జగన్ ను అభిమానించే ఈ సైన్యం ఎలా పని చేస్తోంది అంటే చంద్రబాబు గుండెల్లో రైళ్లు పరిగెత్తించేలా ఉంది' అని సీఎం జగన్ అన్నారు. మరో 5 వారాల్లో జరగనున్న ఎన్నికలు కేవలం ఎమ్మెల్యేలు, ఎంపీలను ఎన్నుకునేందుకు జరిగేవి కాదన్నారు. మనం వేసే ఈ ఓటుతో మన కుటుంబానికి చెందినవారి తలరాతలు నిర్ణయించే ఈ యుద్ధానికి మీరంతా సిద్ధమేనా అంటూ ప్రసంగించారు. జగనన్నను ఓడించాలని వారు, పేదలను గెలిపించాలని మనం చేయబోతున్న ఈ యుద్ధంలో మరో చారిత్రక విజయాన్నిసొంతం చేసుకునేందుకు మీరంతా సిద్ధమేనా అని ప్రశ్నించారు. వలంటీర్లను ఇంటింటికీ వెళ్లి పింఛన్లు ఇవ్వకుండా ఆపేయించి 31మంది అవ్వాతాతలు మృతి చెందడానికి చంద్రబాబు కారకులయ్యారని ఆరోపించారు. ఆయన్ను హంతకుడు అనలేమా అని ప్రశ్నించారు. చంద్రబాబు పేరు చెబితే గుర్తువచ్చేవి వెన్నుపోట్లు, మోసాలు, కుట్రలు, కుతంత్రాలు.. అందుకే జగన్ కు రాష్ట్రమంతా కోట్ల మంది ఉంటే.. చంద్రబాబుకు మాత్రం నా అనేవాళ్లు పక్క రాష్ట్రంలో ఉన్నారన్నారు. తనకు వారిలాగా కుట్రలు, జిత్తులు, పొత్తులతో పని లేదని, ఇంటి ఇంటికి మంచి చేశాం కాబట్టే మళ్లీ ఒంటరిగా ఆత్మవిశ్వాసంతో ప్రజల ముందుకు వస్తున్నానన్నారు. రాబోయే ఎన్నికల్లో కూడా మీ బిడ్డ అబద్ధాలు చెప్పడు, మోసం చేయడు, చేయలేని వాగ్దానాలతో మేనిఫేస్టో పెట్టడన్నారు. చంద్రబాబు మోసాల, అబద్ధాలతో నిండిన కిచిడి మేనిఫేస్టోతో తాను పోటీ పడాలనుకోవటం లేదని చెప్పారు. 58 నెలల పాలనలో మేనిఫెస్టోలో చెప్పని పనులు కూడా చేశామనానరు. భవిష్యత్తులో ప్రతి ఇంటకి చేయగలిగినంత మంచి చేస్తానన్నారు. మరోసారి వైసీపీని గెలిపించాలని కోరారు.

రూ.98.52 కోట్ల అక్రమ మద్యం పట్టివేత?

మైసూర్: కర్నాటకలో భారీ ఎత్తున అక్రమ మద్యం పట్టుబడినట్లు తెలుస్తోంది. చామరాజనగర్ లోక్‌సభ నియోజకవర్గ పరిధిలోని మైసూర్ జిల్లా నంజనగూడు తాలూకా తాండ్యా ఇండస్ట్రియల్ ఏరియాలోని యునైటెడ్ బ్రూవరీస్ లిమిటెడ్ యూనిట్‌ను ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ బృందం ఆకస్మికంగా సందర్శించింది. ఈ ఆపరేషన్‌లో మైసూర్ డివిజన్ ఎక్సైజ్ జాయింట్ కమిషనర్ కూడా ఉన్నారు. రూ. 98.52 కోట్ల విలువైన మద్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. ప్రస్తుతం లోక్‌సభ ఎన్నికల ప్రచార హోరు జోరుగా సాగుతున్న తరుణంలో ఈ భారీ అక్రమ మద్యం నిల్వలు ఘటన పెద్ద సంచలంగా మారింది. ఇప్పటికే సుమారు 14 వేలకు పైగా బాక్సులు కేరళకు చేరుకున్నాయని, 7,000 బాక్సులు మాత్రమే సోదాల్లో కనుగొన్నారని తెలుస్తోంది.

'కార్పొరేట్' దోపిడి!

(మొదటిపేజీ తరువాయి)

కోర్సులు చదివే వారికి రెండు సంవత్సరాలకు కలిపి దాదాపు డే స్కాలర్‌కు రూ.2 లక్షలపైన, హాస్టల్ విద్యార్థికి రూ.5లక్షల వరకు ఖర్చవుతోంది. తమ పిల్లలను ఇంటర్ కోర్సులు చదివించడం తలకు మించిన భారమవుతోందని తల్లిదండ్రులు వాపోతున్నారు. ఈ ఫీజుల నియంత్రణపై ప్రభుత్వం స్పందించడం లేదని వాపోతున్నారు.

ప్రత్యేక పీఆర్వోలతో ప్రవేశాలు

టెన్త్ పూర్తయిన వారి కోసం వివిధ కార్పొరేట్ కళాశాలల సిబ్బంది ప్రవేశాలను ముమ్మరం చేస్తున్నారు. ఇందుకోసం కార్పొరేట్ విద్యా సంస్థలు ప్రత్యేక పీఆర్వో వ్యవస్థను నెలకొల్పింది. వారతా విద్యార్థుల ఇళ్ల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు. ఒక్క పీఆర్వోలనే కాకుండా, ఆయా కార్పొరేట్ విద్యా సంస్థల్లో పనిచేసే లెక్చరర్లు, నాన్ టీచింగ్ స్టాఫ్‌ను రంగంలోకి దించుతున్నారు. ప్రతి ఒక్కరికీ ప్రవేశాల లక్ష్యం విధించడంతో వారికి దిక్కుతోచడం లేదు. మండుటెండలో సైతం ఆయా విద్యార్థులు టెన్త్ చదివిన స్కూళ్లకు వెళ్లి, వారి జాబితాను తీసుకుని ప్రవేశాల కోసం నానా తంటాలు పడుతున్నారు. పదో తరగతి పరీక్షలు పూర్తయిన కొద్ది రోజులకే విద్యార్థులను జేఈఈ మెయిన్స్, అడ్వాన్స్‌డ్‌తోపాటు నీట్ బ్రిడ్జి కోర్సుల పేరుతో తల్లిదండ్రులపై కార్పొరేట్ సిబ్బంది ఒత్తిడి పెంచుతున్నారు. ఆలస్యం చేస్తే తమ కళాశాలల్లో ప్రాధాన్యతగల సీట్లు ఉండబోవని చెబుతూ, తల్లిదండ్రులను పక్కదారి పట్టిస్తున్నారు. గతంలో సాధించిన ఐఐటీ, మెడికల్ ర్యాంకులను చూసి తల్లిదండ్రులను మభ్యపెడుతున్నారు. దీంతో గత్యంతరం లేక, వారి పిల్లల భవిష్యత్ రీత్యా తల్లిదండ్రులు కొంత ప్రవేశ ఫీజు చెల్లించి, సీట్లను రిజర్వుడు చేసుకుంటున్నారు. ఈ తరహాగా ప్రవేశాలు పొందిన విద్యార్థులకు వేసవిలో ఇంటర్ బ్రిడ్జి కోర్సుల పేరిట తరగతులు ప్రారంభించారు. కొన్ని కళాశాలల్లో ఉచితంగా బ్రిడ్జి కోర్సులను ఉదయం ఎనిమిది గంటల నుంచి మధ్యాహ్నం వరకు నిర్వహిస్తున్నారు. ఇంటర్-ఐఐటీ, ఇంటర్ -మెడికల్ విద్యార్థులను వేర్వేరు సెక్షన్లతో ఆకర్షితమైన ప్యాకేజీలతో ముందుకొస్తున్నాయి. ఇంటర్‌తోపాటు ఏపీ ఈఏపీసెట్ వారికి అదనంగా మరో సెక్షన్లు కేటాయిస్తున్నారు. ఐఐటీ, మెడికల్ కోర్సులకు భారీగా ఫీజులు నిర్ధారిస్తున్నారు. ప్రతిభగల విద్యార్థులను ప్రత్యేక సెక్షన్లుగా విభజించి విద్యార్థుల మధ్య నిబంధనలకు విరుద్ధంగా అవాంతరాలను సృష్టిస్తున్నారు. తక్షణమే ప్రభుత్వం, అధికారులు స్పందించి నిబంధనలకు విరుద్ధంగా పెద్దఎత్తున ఫీజులు వసూలు చేస్తున్న కార్పొరేట్ కళాశాలల యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

రైల్వేకోడూరు జనసేన అభ్యర్థి మార్పు

విశాలాంధ్ర-గుంటూరు: కృష్ణాజిల్లా అవనిగడ్డ అసెంబ్లీ నియోజకవర్గ జనసేన అభ్యర్థిగా మండలి బుద్ధ ప్రసాద్‌ను ఖరారు చేశారు. అలాగే, కడప జిల్లా రైల్వేకోడూరు అసెంబ్లీ నియోజకవర్గ అభ్యర్థిగా అరవ శ్రీధర్‌ను ఎంపిక చేశారు. ఈ అభ్యర్థుల పేర్లను జనసేన అధినేత పవన్ కల్యాణ్ ఖరారు చేసినట్లు పార్టీ రాజకీయ కార్యదర్శి పి.హరిప్రసాద్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. రైల్వేకోడూరు స్థానానికి తొలుత యనమల భాస్కరరావు పేరు ప్రకటించారు. అయితే క్షేత్ర స్థాయి నుంచి వచ్చిన నివేదికలు, జిల్లా నాయకుల అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకున్న తర్వాత అభ్యర్థిని మార్చాలని నిర్ణయించారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా పిఠాపురంలో ఉన్న పవన్ కల్యాణ్‌ను రైల్వేకోడూరు నియోజకవర్గ జనసేన, తెలుగుదేశం పార్టీ నేతలు కలసి పరిస్థితిని వివరించారు. దీంతో రైల్వేకోడూరు జనసేన అభ్యర్థిగా అరవ శ్రీధర్ పేరును పవన్ ఖరారు చేసినట్లు హరిప్రసాద్ వెల్లడించారు. అదేవిధంగా పార్టీ ముఖ్య నాయకులతో చర్చించిన తర్వాత అవనిగడ్డ శాసనసభ స్థానం నుంచి జనసేన అభ్యర్థిగా మండలి బుద్ధప్రసాద్ పేరును ఖరారు చేసినట్లు వివరించారు. పాలకొండ అసెంబ్లీ స్థానానికి సంబంధించిన అభ్యర్థి పేరుపై రెండు రోజుల్లో నిర్ణయాన్ని ప్రకటిస్తారని, దీనిపై పార్టీ నాయకులతో చర్చిస్తున్నట్లు పేర్కొన్నారు.

ముగ్గురు ఆర్‌టీఐ కార్యకర్తలపై అక్రమ కేసులు

భువనేశ్వర్: ముగ్గురు సమాచార హక్కు చట్టం (ఆర్‌టీఐ) కార్యకర్తలపై ఒడిశా పోలీసులు అక్రమంగా కేసులు నమోదు చేశారు. నకిలీ వార్తలు ప్రచారం చేస్తున్నారని ఆరోపిస్తూ ఆర్‌టీఐ కార్యకర్తలు ప్రదీప్ ప్రధాన్, ప్రకాశ్ దాస్, శ్రీకాంత్ పాకల్‌పై ఐపీసీ సెక్షన్ 419, 420, 465, 469, 505 (1)(ఎ)(బి)/34 కింద కేసులు నమోదు చేశారు. ఒడిశా ముఖ్యమంత్రి నవీన్ పట్నాయక్ సన్నిహితుడు, 5టీ (ట్రాన్స్‌ఫర్మేషనల్ ఇన్షియేటివ్స్) చైర్మన్ వీకే పాండియన్ భద్రత కోసం 74 మంది పోలీసు సిబ్బందిని నియమించారని మార్చి 30న భువనేశ్వర్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో ఒడిశా సూచనా అధికార్ అభిజన్ (ఓఎస్‌ఎస్‌ఏ) కన్వీనర్ ప్రదీప్ ప్రధాన్ చెప్పారు. పాండియన్ భద్రత కోసం ఇద్దరు సాయుధ సబ్ ఇన్‌స్పెక్టర్లు, 11 మంది హవల్దార్లు, 53 మంది కానిస్టేబుళ్లు, నలుగురు మహిళా కానిస్టేబుళ్లను రక్షణ వాహనం సహా పోలీస్ శాఖ నియమించిందని తెలిపారు. ఆర్‌టీఐ నుండి ఈ సమాచారం సేకరించినట్లు వెల్లడించారు. భద్రతా సిబ్బంది నియామకంలో హేతుబద్ధత ఉండాలని, రాష్ట్ర ఖజానాపై అనవసర భారం ఉండకూడదని పేర్కొన్నారు. ఆర్‌టీఐ ఇటువంటి సమాచారం ఇవ్వలేదని పేర్కొంటూ పోలీస్ యంత్రాంగం వారిపై కేసులు నమోదు చేయడం గమనార్హం. కేసులపై ఆర్‌టీఐ కార్యకర్తలు స్పందిస్తూ... తమ వాదనలకు కట్టుబడి ఉన్నామని స్పష్టంచేశారు. తాము ఆర్‌టీఐకి పంపిన లేఖ ఉందని, ఆర్‌టీఐ సమాచార షీట్‌లో దరఖాస్తుదారుడికి ఫార్వార్డ్ చేసిన రిఫరెన్స్ నెంబర్ ఉందని, లేఖ కాపీ తీసుకునేదుకు తమ సభ్యులు వ్యక్తిగతంగా హాజరయ్యారని, సంబంధిత అధికారి సమాచారం అందించారని ఏఎస్‌ఏఏ కన్వీనర్ ప్రధాన్ పేర్కొన్నారు.

కేజ్రీవాల్‌కు ఊరట...

(మొదటిపేజీ తరువాయి)

హైకోర్టులో ప్రజా ప్రయోజన వ్యాజ్యాన్ని దాఖలు చేశారు. పిల్‌పై విచారణ జరిపేందుకు ఢిల్లీ హైకోర్టు తిరస్కరించింది. పిల్‌ను కొట్టేసింది. ఇది పూర్తిగా కేజ్రీవాల్ వ్యక్తిగత నిర్ణయంపై ఆధారపడి ఉంటుందని స్పష్టం చేసింది. ఈ అంశంపై రాష్ట్రపతి లేదా గవర్నర్‌ను సంప్రదించాలని పిటిషనర్‌కు సూచించింది. కొన్నిసార్లు వ్యక్తిగత ప్రయోజనం జాతీయ ప్రయోజనాలకు లోబడి ఉండాలే గానీ అది కేజ్రీవాల్ వ్యక్తిగత నిర్ణయమని కోర్టు తెలిపింది. కోర్టులు ఎప్పుడైనా రాష్ట్రపతి పాలన లేక గవర్నర్ పాలన విధించిన సందర్భాలున్నాయా ప్రశ్నించింది. లెఫ్టినెంట్ గవర్నర్ లేదా రాష్ట్రపతి దీనిపై నిర్ణయిస్తారని పిటిషనర్‌కు తెలిపింది. సీఎం అరెస్ట్ వల్ల ప్రభుత్వం పనిచేయడంలేదని ఎలా చెప్పగలమని ప్రశ్నించింది. లెఫ్టినెంట్ గవర్నర్‌కు తాము మార్గదర్శకాలు సూచించాల్సిన అవసరం లేదని వెల్లడించింది. చట్టం ప్రకారం ఏం చేయాలో ఎల్‌జీ చేస్తారని పేర్కొంటూ పిటిషన్‌ను కొట్టివేసింది. దీంతో విష్ణు గుప్తా తన పిల్‌ను ఉపసంహరించుకున్నారు. ఢిల్లీ లెఫ్టినెంట్ గవర్నర్‌ను ఆశ్రయిస్తానని వెల్లడించారు.

మేనిఫెస్టోల్లో అగ్రిగోల్డ్ బాధితులకు భరోసా ఇవ్వాలి

ప్రధాన రాజకీయ పక్షాలకు ముప్పాళ్ల డిమాండ్

విశాలాంధ్ర-తిరుపతి: అగ్రిగోల్డ్ బాధితులకు డిపాజిట్లు చెల్లించే అంశాన్ని ప్రధాన రాజకీయపార్టీలు తమ మేనిఫెస్టోల్లో చేర్చాలని అగ్రిగోల్డ్ అసోసియేషన్ రాష్ట్ర గౌరవ అధ్యక్షులు, సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ముప్పాళ్ల నాగేశ్వరరావు డిమాండ్ చేశారు. తిరుపతి నగరం బైరాగ పట్టెడలోని సీపీఐ కార్యాలయంలో గురువారం అగ్రిగోల్డ్ బాధితుల సమస్యపై రౌండ్ టేబుల్ సమావేశం జరిగింది. అగ్రిగోల్డ్ బాధితుల డిపాజిట్లు చెల్లించే అంశాన్ని అధికార, ప్రతిపక్ష పార్టీలు తమ మేనిఫెస్టోలో చేర్చి నియమిత కాలపరిమితిలో పూర్తి న్యాయం చేయాలని రౌండ్ టేబుల్ సమావేశం డిమాండ్ చేసింది. ఈ సమావేశానికి హాజరైన ముప్పాళ్ల నాగేశ్వరరావు మాట్లాడుతూ... 2017 మార్చి 23న వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ప్రతిపక్ష నేత హోదాలో అగ్రిగోల్డ్ బాధితులు చేపట్టిన ఆమరణదీక్ష శిబిరానికి వచ్చి నిమ్మరసం ఇచ్చి దీక్ష విరమింప చేశారన్నారు. ఈ సందర్భంగా ఆయన తాను అధికారంలోకి వచ్చిన వారం రోజులకే 14లక్షల మంది అగ్రిగోల్డ్ బాధితులకు రూ.1,183కోట్లు చెల్లిస్తానని హామీ ఇచ్చారని గుర్తు చేశారు. అగ్రిగోల్డ్ బాధితుల కుటుంబ సభ్యునిగా బాధ్యత తీసుకుంటానని నాడు చెప్పారన్నారు. మరణించిన వారి కుటుంబాలకు చంద్రబాబునాయుడు రూ.3లక్షల వంతున పరహారం అందచేస్తానని చెప్పారని... అయితే మానవత్వం ఉన్న ప్రభుత్వంగా తాను ఒక్కో కుటుంబానికి రూ.10లక్షల వంతున ఎక్స్ గ్రేషియా పూలల్లో పెట్టి ఇంటికి పంపుతానని నాడు వైఎస్ జగన్ హామీ ఇచ్చారన్నారు. అయితే జగన్ అధికారంలోకి వచ్చాక అరకొరగా రూ.906కోట్లు ఇచ్చి చేతులు దులుపుకోవడం తీవ్ర అన్యాయమని ముప్పాళ్ల అన్నారు. కలెక్టరు కార్యాలయాలు, ప్రభుత్వ బంగళాలు తాకట్టు పెట్టే ఈ ముఖ్యమంత్రికి రూ.వేల కోట్ల అగ్రిగోల్డ్ ఆస్తుల అటాచ్‌మెంటు విషయం తెలియదా అని ఆయన ప్రశ్నించారు. అగ్రిగోల్డ్ ఆస్తులను తాకట్టు పెట్టి ఇంకా మిగిలిన 10లక్షల మందికి రూ.3,080కోట్లు చెల్లించడానికి ఎవరు అడ్డొచ్చారని ముప్పాళ్ల నిలదీశారు. సార్వత్రిక ఎన్నికల వేళ అధికార, ప్రతిపక్ష పార్టీలు తమ మేనిఫెస్టోల్లో అగ్రిగోల్డ్ బాధితులకు కచ్చితమైన హామీ ఇవ్వకపోతే వారు కఠిన నిర్ణయం తీసుకుంటారని ఆయన హెచ్చరించారు. సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ఏ రామానాయుడు మాట్లాడుతూ... కంపెనీకి రూ.వేల కోట్ల ఆస్తులు కూడబెట్టిన ఏజెంట్లు, ఖాతాదారులు ఆత్మహత్యలు, బలవన్మరణాలకు గురవుతుంటే ప్రభుత్వం గుడ్లప్పగించి చూడటం వారి మోసపూరిత విధానానికి నిదర్శనమన్నారు. సీపీఐ జిల్లా కార్యదర్శి పి.మురళి మాట్లాడుతూ...నమ్మించి అగ్రిగోల్డ్ బాధితుల గొంతుకోసిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్ వైఖరి గర్హనీయమన్నారు. అనేక అంశాలను ప్రస్తావిస్తూ... సరికొత్త వాగ్దానాలు చేస్తున్న ప్రధాన పార్టీలు అగ్రిగోల్డ్ బాధితుల సమస్యపై నోరు మెదపక పోవడం బాధాకరమన్నారు. అగ్రిగోల్డ్ అసోసియేషన్ అధ్యక్షుడు బెల్లంకొండ శ్రీనివాస్ రౌండ్ టేబుల్ సమావేశానికి అధ్యక్షత వహించి మాట్లాడుతూ... వైసీపీ, టీడీపీలు కంపెనీ దొంగల పక్షాన ఉంటాయో.... బాధితుల పక్షాన నిలబడతాయో తేల్చుకోవాలన్నారు. ఐదేళ్లుగా రూ.2.70లక్షల కోట్లు ఉచితంగా పంపిణీ చేసినట్లు చెబుతున్న రాష్ట్ర ప్రభుత్వం రూ.వేల కోట్లు ఆస్తులు ఉన్న అగ్రిగోల్డ్ బాధితులకు డిపాజిట్ చెల్లించడంలో ఎందుకు విఫలమైందని ప్రశ్నించారు. ఈ సమావేశంలో సీపీఐ తిరుపతి నగర కార్యదర్శి జిల్లా విశ్వనాథ్, అసోసియేషన్ నాయకులు జయచంద్ర, సుధాకరరెడ్డి, లక్ష్మీనారాయణ, కృష్ణదేవరాజులు, నాగమణి, సుశీల, శశికళ, సిద్దారెడ్డి తదితరులు పాల్గొన్నారు. కాగా మరణించిన అగ్రిగోల్డ్ బాధితుల కుటుంబాలకు పూలల్లో పెట్టి పరిహారం అందచేస్తామని మాట తప్పిన జగన్‌కు పోస్టు ద్వారా వారు పూలు పంపారు. పూలు తనవద్ద లేనందునే జగన్ అగ్రిగోల్డ్ బాధితులకు పరిహారం పంపలేదేమోనన్న ఉద్దేశంతోనే తిరుపతి నుంచి పూలు పంపామని ఈ సందర్భంగా వారు చెప్పారు. ఈ పూలల్లో నైనా జగన్ పరిహారం పంపాలని వారు డిమాండు చేశారు.

పెన్షన్ జాప్యానికి సర్కార్‌దే బాధ్యత

మాజీ మంత్రి దేవినేని ఉమామహేశ్వరరావు

విశాలాంధ్ర బ్యూరో- అమరావతి: రాష్ట్రంలో పెన్షన్ పంపిణీలో జాప్యానికి సర్కార్‌దే బాధ్యతని, రాజకీయ లబ్ధి కోసం అవ్వ తాతలను జగన్ రోడ్డుకీడ్చారని టీడీపీ నేత దేవినేని ఉమామహేశ్వరరావు మండిపడ్డారు. టీడీపీ కేంద్ర కార్యాలయంలో గురువారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఎన్నికల కోడ్ ఉల్లంఘించిన సజ్జలపై క్రిమినల్ కేసు పెట్టాలన్నారు. ప్రభుత్వ సొమ్ము దిగమింగుతూ శవరాజకీయాలకు పాల్పడుతున్నారన్నారు. రక్తకన్నీరు నాగభూషణంను సజ్జల మరిపిస్తున్నారని, కోట్ల రూపాయల ప్రభుత్వ సొమ్మును దిగమింగుతూ... ఏమాత్రం సిగ్గులేకుండా వైసీపీకి వత్తాసు పలుకుతున్నారని ఆరోపించారు. ప్రభుత్వ సలహాదారుడిగా ఉన్న సజ్జలకు ఎన్నికల కోడ్ వర్తించదా అని ప్రశ్నించారు. గతంలో చంద్రబాబు పింఛన్లు ఇవ్వడానికి ముందు జాగ్రత్తతో నిధులు అందుబాటులో ఉంచారన్నారు. పింఛన్లు ఇవ్వడానికి బ్యాంకుల్లో డబ్బులు ఉంచాలని వైసీపీ ప్రభుత్వానికి తెలియదా అని ప్రశ్నించారు. మార్చి 30, 31న రూ.14 వేల కోట్లు వైసీపీ అస్మదీయులకు, వారి కార్యకర్తలకు, వైసీపీ కాంట్రాక్టర్ల కోసం డ్రా చేశారని, ఆర్థికశాఖ కార్యదర్శి రావత్, సీఎం పేషీ అధికారి ధనుంజయ్ రెడ్డి, సెర్ప్ సీఈవో మురళీధర్ రెడ్డి, పంచాయతీరాజ్ సెక్రటరీ శశిభూషణ్, చీఫ్ సెక్రటరీలే ఈ పింఛన్ మరణాలకు కారణమన్నారు. ప్రతిపక్షాలపై బురదచల్లడానికి అధికారులు వైసీపీకి సహకరించారన్నారు. పింఛన్లు ఇంటికి వెళ్లి ఇచ్చే యంత్రాంగం ఉన్నా జగన్ కనుసన్నల్లో ఉన్న ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి, అధికారులు కమిటీ వేసుకుని పెన్షన్‌దారుల మరణాలకు కారణమయ్యారన్నారు. పెనమలూరు నియోజకవర్గంలో వృద్ధురాలు చనిపోయి ఆ కుటుంబం బాధలో ఉంటే మంత్రి జోగి రమేశ్ శవరాజకీయం చేశారని ఆరోపించారు. వలంటీర్ల భవిష్యత్ కోసం చంద్రబాబు ఆలోచిస్తుంటే... ఆ వ్యవస్థను ప్రతిపక్షాలు ఏదో చేశాయని జగన్ అభాండాలు వేస్తున్నారని ఉమా ఆగ్రహం వ్యక్తం చేశారు.

వైసీపీ రాజ్యసభ సభ్యుల ప్రమాణ స్వీకారం

విశాలాంధ్ర బ్యూరో-ఢిల్లీ/అమరావతి: రాజ్యసభ సభ్యులుగా ఆంధ్రప్రదేశ్‌కు చెందిన వైసీపీ ఎంపీలు వైవీ సుబ్బారెడ్డి, గొల్ల బాబూరావు, మేడా రఘునాథ్‌రెడ్డి గురువారం ప్రమాణ స్వీకారం చేశారు. వారి ముగ్గురితో ఉప రాష్ట్రపతి, రాజ్యసభ చైర్మన్ జగదీప్ ధన్కడ్ ప్రమాణ స్వీకారం చేయించారు. ఈ ముగ్గురు ఎంపీల ప్రమాణ స్వీకారంతో రాజ్య సభలో వైసీపీ ఎంపీల సంఖ్య 11కు చేరింది. రాజ్యసభలో ప్రస్తుతం బీజేపీ నుంచి 97, కాంగ్రెస్ 29, టీఎంసీ 13 ఉండగా, దాని తర్వాత స్థానం వైసీపీ ఉంది. ప్రస్తుతం రాజ్యసభలో రాష్ట్రం నుంచి టీడీపీ సభ్యుల సంఖ్య జీరోకు పడిపోయింది. రాజ్యసభలో వైసీపీ నాలుగో అతిపెద్ద పార్టీగా అవతరించింది.

ప్రైవేటు కళాశాలల్లో 'ముందస్తు అడ్మిషన్ల' దోపిడీ

ఆయా విద్యాసంస్థలపై చర్యలకు ఏఐఎస్ఎఫ్ డిమాండ్

విశాలాంధ్ర-విజయవాడ: ఇంటర్‌లో ముందస్తుగా ప్రవేశాల పేరిట కార్పొరేట్ విద్యాసంస్థల దోపిడీ ఇష్టారాజ్యంగా సాగుతోందని ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర కోశాధికారి ఎం.సాయికుమార్ ఆరోపించారు. నిబంధనలకు విరుద్ధంగా ఇంటర్ అడ్మిషన్లు చేపడుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదని విమర్శించారు. నిబంధనలకు విరుద్ధంగా ముందస్తు అడ్మిషన్లు చేపడుతూ లక్షల్లో ఫీజులు వసూలు చేస్తున్న కార్పొరేట్ విద్యాసంస్థలపై ఉక్కుపాదం మోపాలని ఆయన గురువారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. ముందస్తు ప్రవేశాలకు 30-50శాతం వరకు ఫీజు రాయితీ లభిస్తుందని, భవిష్యత్‌లో అదనపు ఫీజు ఉండదని ప్రలోభాలకు గురిచేస్తున్నాయని వ్యాఖ్యానించారు. రాష్ట్రంలోని అన్ని జిల్లాలు, ప్రధాన పట్టణాల్లో పీఆర్‌ఓలను నియమించుకొని పదో తరగతి విద్యార్థుల తల్లిదండ్రులను ఆకర్షించడమే పనిగా వ్యవహరిస్తున్నాయని, ముందస్తు అడ్మిషన్లు అంటూ 60శాతం ఫీజు ముందుగానే వసూలు చేస్తున్నాయని సాయికుమార్ పేర్కొన్నారు. విజయవాడలోని కొన్ని కళాశాలల్లో రెండేళ్ల ప్యాకేజి పేరిట రూ.6లక్షల వరకు వసూలు చేస్తున్నారన్నారు. సీఈసీ, ఎంఈసీ, హెచ్ఈసీ... సివిల్స్ ఫౌండేషన్ పేరుతో కొత్త కోర్సుల నెపంతో రూ.1.65 లక్షల నుంచి రూ.2 లక్షల వరకు వసూలు చేస్తున్నారని ఆరోపించారు. సీఈసీ, ఎంఈసీ గ్రూపులు, సీఏ, ఇతర పేర్లు జోడించి రూ.2 లక్షలకుపైనే విద్యార్థుల నుంచి డిమాండ్ చేస్తున్నారని పేర్కొన్నారు. అనుమతి లేని ప్రాంతాల్లో విద్యాసంస్థల నడుపుతూ... పెద్ద ఫ్లెక్సీలు, కరపత్రాలతో భారీగా ప్రచారం చేస్తున్నా అధికారులు పట్టించుకోవడం లేదని ఆరోపించారు. తక్షణమే ఇలాంటి విద్యా సంస్థలపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

పేపర్‌మిల్లు కార్మికులకు నూతన వేతన ఒప్పందం అమలు చేయాలి

రావుల రవీంద్రనాథ్ డిమాండ్

విశాలాంధ్ర-విజయవాడ: రాజమండ్రిలోని ఆంధ్ర పేపర్ మిల్లు కార్మికులకు నూతన వేతన ఒప్పందం అమలు చేయాలని ఏఐటీయూసీ రాష్ట్ర అధ్యక్షుడు రావులపల్లి రవీంద్రనాథ్ గురువారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. వేతన ఒప్పందం కాలపరిమితి పూర్తయ్యి నాలుగేళ్లయినా నూతన వేతన ఒప్పందం చేయకుండా యాజమాన్యం మొండిగా వ్యవహరించడం తగదన్నారు. కొంతకాలంగా శాశ్వత కార్మికులు, ఒప్పంద కార్మికులు ఐక్యంగా అన్ని యూనియన్ల అధ్వర్యంలో అనేక దఫాలు యాజమాన్యానికి విజ్ఞప్తి చేసినా స్పందించక పోవడంతో పరిశ్రమలో ఉన్న పర్మినెంట్, కాంట్రాక్ట్ కార్మికులు మెరుపు సమ్మెకు దిగారని పేర్కొన్నారు. అయినా యాజమాన్యం స్పందించలేదన్నారు. కార్మిక శాఖ అధికారులు కలెక్టర్ జోక్యంతో యాజమాన్యాన్ని చర్చలకు ఆహ్వానించటం జరిగిందన్నారు. పాత వేతన ఒప్పందం 2020 జూన్ తో ముగిసినప్పటికీ నూతన వేతన ఒప్పందం చేయకుండా యాజమాన్యం నిరంకుశంగా వ్యవహరించడాన్ని రవీంద్రనాథ్ తీవ్రంగా ఖండించారు. చట్టబద్ధంగా కార్మికులు పోరాడుతున్నా యాజమాన్యం నుండి ఎలాంటి స్పందన లేకపోవడం దుర్మార్గం అన్నారు. ఈ ఆందోళన నేపథ్యంలో అధికారులు జోక్యం చేసుకొని చర్చలు జరిపినా యాజమాన్యం వేతనాలు పెంచడానికి ఏమాత్రం సుముఖంగా లేదన్నారు. మిల్లులో ఉన్న 11 రిజిస్టర్ కార్మిక సంఘాలు ఐక్యంగా తమ డిమాండ్లను యాజమాన్యం, కార్మిక శాఖ అధికారులు ముందు పెట్టినా యాజమాన్యం మొండిగా వ్యవహరించడంతో తప్పని పరిస్థితులలో కార్మిక వర్గం ఐక్యంగా ఉద్యమించాల్సి వస్తోందని స్పష్టం చేశారు. తక్షణమే యాజమాన్యం మొండి వైఖరి విడనాడి నూతన వేతన ఒప్పందం కార్మిక సంఘాలతో చేసుకొని అమలు చేయాలని ఏఐటీయూసీ డిమాండ్ చేస్తున్నట్లు రవీంద్రనాథ్ వెల్లడించారు.

కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

మిమ్స్, ఆంధ్రపేపర్ సమ్మెకు సీపీఎం సంపూర్ణ మద్దతు

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: మిమ్స్, ఆంధ్రపేపర్ లిమిటెడ్ కార్మికుల నిరవధిక సమ్మెకు సీపీఎం సంపూర్ణ మద్దతు తెలిపింది. రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే కార్మికుల సమస్యలు పరిష్కరించాలని గురువారం విజయవాడలో జరిగిన ఆ పార్టీ రాష్ట్ర కమిటీ తీర్మానించింది. పార్టీ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు వై.వెంకటేశ్వరరావు అధ్యక్షతన జరిగిన రాష్ట్ర కమిటీ సమావేశంలో పార్టీ పొలిట్‌బ్యూరో సభ్యుడు బీవీ రాఘవులు, రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు హాజరయ్యారు. విజయనగరం జిల్లాలో 300 మంది మిమ్స్ కార్మికులు 64 రోజులు, రాజమండ్రిలోని ఆంధ్రపేపర్ లిమిటెడ్‌లో మూడు రోజుల నుంచి 2,500 మంది కార్మికులు నిర్వహిస్తున్న నిరవధిక సమ్మెకు సీపీఎం సంపూర్ణ మద్దతు తెలిపింది. ఆయా యాజమాన్యాల మొండి వైఖరి వల్లే కార్మికులు నిరవధిక సమ్మెకు దిగారని, ఆంధ్రపేపర్ లిమిటెడ్‌లో నాలుగేళ్ల నుంచి వేతన ఒప్పందాలు చేయకుండా యాజమాన్యం కాలయాపనచేసిందన్నారు. ఆరేళ్ల నుంచి నుంచి ప్రతి సంవత్సరం సుమారు రూ.200 కోట్ల నికర లాభాలు ఆర్జించిందని, గుర్తింపు యూనియన్‌కు ఎన్నికలు జరగకుండా కోర్టులను అడ్డుపెట్టుకొని నాటకాలు ఆడుతోందని తెలిపింది. సీనియర్ కార్మికులను తొలిగించి కొత్త కార్మికులకు చట్టవిరుద్ధంగా తక్కువ జీతాలు చెల్లిస్తున్నదని, కార్మికులపై పనిభారం పెంచిందని వివరించింది. మిమ్స్ యాజమాన్యం కార్మిక సంఘాలు ఉండరాదని, బయట నాయకులను అనుమతించమని చట్ట విరుద్ధంగా వ్యవహరిస్తున్నది. కార్మికులంతా సీఐటీయూ యూనియన్‌లోనే ఉన్నప్పటికీ, సీఐటీయూ బయట నాయకులతో మాట్లాడనని నిరాకరించడం చట్టాన్ని ధిక్కరించడమేనని తెలిపింది. యాజమాన్యంపై చర్యలు చేపట్టకుండా ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం నిరవధిక సమ్మెను నిషేధించిందని, చట్టవిరుద్ధంగా వ్యవహరిస్తున్న యాజమాన్యాల కొమ్ము కాయడం దుర్మార్గమని రాష్ట్ర కమిటీ ఆగ్రహం వ్యక్తం చేసింది. రాష్ట్రప్రభుత్వం తప్పుడు వైఖరిని సీపీఎం తీవ్రంగా ఖండించింది. తక్షణమే మిమ్స్ కార్మికుల సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని డిమాండ్ చేసింది.

చంద్రబాబువి స్వార్థ రాజకీయాలు: సజ్జల

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: చంద్రబాబు స్వార్థం తప్ప మరేమీ చూసుకోలేదని, ఆ స్వార్థంతోనే ఏం చేస్తున్నారో ఆయనకే తెలియడం లేదని వైసీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సజ్జల రామకృష్ణారెడ్డి మండిపడ్డారు. తాడేపల్లి క్యాంపు కార్యాలయంలో గురువారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఉద్యోగాలు ఇవ్వలేదని అన్న వాళ్లే ఈరోజు లక్ష మంది ఉద్యోగులతో పెన్షన్లు పంపిణీ చేయవచ్చని అంటున్నారని అన్నారు. గతంలో ఒకటో తేదీన వలంటీర్ల వ్యవస్థ ద్వారా రాష్ట్రంలో 80 శాతం పెన్షన్ పంపిణీ పూర్తయేదనీ, ఇప్పుడు రెండో రోజుకు 60 శాతం పంపిణీ మాత్రమే జరిగిందని వివరించారు. పెన్షన్లు స్వయంగా వెళ్లి తెచ్చుకోవాల్సి రావడంతో వృద్ధులు, దివ్యాంగులు ఇబ్బందులకు గురవుతున్నారని, దీనిపై ప్రజలు చాలా ఆగ్రహంగా ఉన్నారన్నారు. ఈ విషయం చంద్రబాబుకు తెలిసినందునే తమ ప్రభుత్వంపై ఎదురుదాడికి దిగుతున్నారని తప్పుపట్టారు. ఎన్నికల్లో ఎలాగైనా బయటపడాలన్నదే చంద్రబాబు ఆలోచన అని, ఆయన వస్తే ఎలా ఉంటుందో...'ఇంద్రోజుల్లో రుచి చూపించారని ఎద్దేవాచేశారు. ఇదంతా ప్రజలకు అర్థం చేసుకున్నారని స్పష్టం చేశారు. అధికారుల్లో వందశాతం ప్రభుత్వానికి అనుకూలంగా ఎందుకు ఉంటారని ప్రశ్నించారు. అధికారులను డీమోరలైజ్ చేసేందుకు తప్పుడు ఆరోపణలు చేస్తున్నారని, ప్రధాని సభలో పోలీసుల పాత్ర తక్కువగా ఉంటుందని వివరించారు.

తాగునీటి కోసం చెరువులు నింపుదాం

ప్రకాశం బ్యారేజీ, సాగర్ నుంచి సరఫరా సమీక్షలో సీఎస్ జవహర్‌రెడ్డి

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: వేసవి తాగునీటి అవసరాల కోసం చెరువులను పూర్తిగా నీటితో నింపేందుకు ఈనెల 6వ తేదీన ప్రకాశం బ్యారేజీ నుంచి ఏలూరు, రైవస్ కాల్వల ద్వారా ఎన్టీఆర్, కృష్ణా, ఏలూరు జిల్లాలకు, బకింగ్‌హామ్ కాలువ ద్వారా గుంటూరు, బాపట్ల జిల్లాలకు నీటిని విడుదల చేయనున్నట్లు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి(సీఎస్) డాక్టర్ కేఎస్ జవహర్ రెడ్డి చెప్పారు. నాగార్జున సాగర్ కుడి ప్రధాన కాలువ ద్వారా పల్నాడు, గుంటూరు, బాపట్ల జిల్లాలకు ఈనెల 8 నుంచి 18వ తేదీ వరకూ 10 రోజుల పాటు నీటిని విడుదల చేస్తామన్నారు. రాష్ట్రంలో తాగునీటి సరఫరా పరిస్థితులు, ఉపాధి హామీ పథకం పనులపై గురువారం వెలగపూడి రాష్ట్ర సచివాలయంలో సంబంధిత శాఖల అధికారులతో సీఎస్ సమీక్షించారు. ఈ సందర్భంగా జవహర్‌రెడ్డి మాట్లాడుతూ తాగునీటి చెరువులు నింపేందుకు విడుదల చేసే నీటిని శివారు ప్రాంతాల వరకూ సక్రమంగా పంపాలని, ఆయా సమ్మర్ స్టోరేజీ ట్యాంకులను పూర్తిగా నీటితో నింపేందుకు తగిన చర్యలు తీసుకోవాలని సంబంధిత జిల్లాల కలెక్టర్లు, అధికారులను ఆదేశించారు. చెరువులు నింపడానికి కాలువల ద్వారా విడుదల చేసే నీటిని చేపలు, రొయ్యల చెరువులకు ఉపయోగించరాదని, కాల్వలపై ఇంజన్లు, మోటార్లతో అక్రమంగా నీటిని మళ్లించకుండా కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని స్పష్టంచేశారు. కాలువల వెంబడి గట్టి నిఘా ఏర్పాటు చేసి సకాలంలో చెరువులు నింపాలన్నారు. నీటి ఎద్దడి గల ఆవాసాలకు ట్యాంకుల ద్వారా మంచినీటిని సరఫరా

చేయాలని ఆర్‌డబ్ల్యూఎస్ తదితర విభాగాల అధికారులను సీఎస్ ఆదేశించారు. సీపీడబ్ల్యూఎస్ పథకాలన్నీ సక్రమంగా పనిచేసేలా చూడాలని చెప్పారు. గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో తాగునీటికి ఇబ్బంది రాకూడదన్నారు. మహాత్మాగాంధీ జాతీయ ఉపాధిహామీ పథకం అమలు తీరును సమీక్షిస్తూ ఎండల దృష్ట్యా కూలీలెవరు వడదెబ్బకు గురికాకూడదన్నారు. ఉపాధి హామీ పనులను ఉదయం 10 గంటలలోపు పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. కూలీలు తాగునీటిని వెంట తీసుకువెళ్లాలని సూచించారు. పని ప్రదేశాల్లో కూలీలకు తగిన నీడ ఉండేలా చూడటంతో పాటు అత్యవసర మెడికల్ కిట్లు అందుబాటులో ఉంచాలన్నారు. రాష్ట్ర జలవనరులు, పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ ముఖ్య కార్యదర్శి శశి భూషణ్ కుమార్ మాట్లాడుతూ రాష్ట్రంలో ప్రస్తుతం తాగునీటి పరిస్థితులు, ఉపాధి హామీ పథకం పనులు జరుగుతున్న తీరును సీఎస్‌కు వివరించారు. పంచాయతీరాజ్ శాఖ కమిషనర్ కె.కన్నబాబు, ఆర్‌డబ్ల్యూఎస్ సీఈ గాయత్రి, భూగర్భ జలవనరుల శాఖ డైరెక్టర్ జాన్ సత్యరాజ్ తదితర అధికారులు పాల్గొన్నారు. వర్చువల్‌గా ఆర్థికశాఖ కార్యదర్శి కేవీవీ సత్యనారాయణ, మున్సిపల్ పరిపాలన శాఖ కమిషనర్ శ్రీకేశ్ బాలాజీరావు, జలవనరులు శాఖ అధికారి నారాయణరెడ్డి పాల్గొన్నారు.

టీడీపీ కాళహస్తి అభ్యర్థిపై కత్తితో దాడికి యత్నం

విశాలాంధ్ర-శ్రీకాళహస్తి: తిరుపతి జిల్లా శ్రీకాళహస్తి టీడీపీ అభ్యర్థి బొజ్జల వెంకటసుధీర్ రెడ్డిపై కత్తితో దాడికి యత్నించిన ఘటన చోటు చేసుకుంది. బొజ్జల వెంకటసుధీర్ రెడ్డి గురువారం ఉదయం శ్రీకాళహస్తి పట్టణం ఐదవ వార్డులో ఎన్నికల ప్రచారం నిర్వహిస్తుండగా అక్కడకొచ్చిన మహేష్‌కుమార్ (35) అనే వ్యక్తి బొజ్జల తో సెల్ఫీ ఫోటో తీసుకోవాలని అక్కడున్న టీడీపీ నేతలను కోరాడు. ఇందుకు వారు అంగీకరించారు. బొజ్జలతో సెల్ఫీ తీసుకుంటూ తన జేబులో దాచుకున్న కత్తిని మహేష్ కుమార్ బయటకు తీశాడు. ఇది గమనించిన టీడీపీ కార్యకర్తలు వెంటనే ఆ కత్తిని లాక్కున్నారు. బొజ్జలనూ దాడిచేయకుండా మహేష్ కుమార్ ను అడ్డుకున్నారు. అనంతరం టీడీపీ కార్యకర్తలు అతనిని శ్రీకాళహస్తి రెండవ పట్టణ పోలీసులకు అప్పగించారు. మహేష్ కుమార్‌ను వారు విచారించగా అతనది చంద్రగిరి అని... తిరుమల ఆర్టీసీ డిపోలో మెకానిక్ గా పని చేస్తున్నట్లు తేలింది. ఇతడు చాలా కాలంగా వైసీపీ నేత చెవిరెడ్డి భాస్కరరెడ్డి అనుచరుడుగా ఉన్నట్లు అంగీకరించాడు. మహేష్ కుమార్ తాగుడుకు బానిసై భార్యాపిల్లలను వేధించే వాడని ఈ వేధింపులకు తాళలేక అతడి భార్య మీనాకుమారి కొంతకాలం క్రితం పుట్టిన ఊరు శ్రీకాళహస్తికి రావడంతో మహేష్ కుమార్ కూడా ఇక్కడకు వచ్చేశాడు. భార్య వద్దనే ఉంటూ అతడు విధులకు వెళుతున్నాడు. ఇపుడు విధులకు డుమ్మా కొట్టి... బొజ్జల వెంకటసుధీర్ రెడ్డి వద్దకు కత్తితో వెళ్లి ఆ పార్టీ నేతలకు పట్టుబడ్డాడు. ఈ సంఘటన శ్రీకాళహస్తిలో సంచలనం రేపింది. కత్తితో దాడికి యత్నించిన మహేష్ కుమార్ వైసీపీ కార్యకర్త అని బొజ్జల వెంకటసుధీర్ రెడ్డి మీడియాకు తెలిపారు. వైసీపీ నేతలు ఇలాంటి నీచ రాజకీయాలు చేయడం బాధాకరమని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రజలు ఇది గమనించాలని ఆయన విజ్ఞప్తి చేశారు. మహేష్ కుమార్ ప్రస్తుతం పోలీసుల అదుపులో ఉన్నాడు.

మతోన్మాద, అప్రజాస్వామిక వాదులను ఓడించండి

ఆంధ్రప్రదేశ్ ప్రజానాట్యమండలి పిలుపు

విశాలాంధ్ర-కాకినాడ: ప్రజా చైతన్యం ద్వారా సమాజంలో మార్పుకోసం నిరంతరం ప్రజా సాంస్కృతిక ఉద్యమాన్ని నడిపించాలని... అందులో భాగంగానే సార్వత్రిక ఎన్నికల్లో మతోన్మాదులను ఓటు ద్వారా ఓడించి ప్రజాస్వామ్యాన్ని కాపాడాలని సీపీఐ జిల్లా కార్యదర్శి పీ సత్తిబాబు, ఆంధ్రప్రదేశ్ ప్రజానాట్యమండలి సీనియర్ నాయకులు డాక్టర్ స్టాలిన్ పిలుపునిచ్చారు. గురువారం రామచంద్ర పురంలోని డాక్టర్ చెలికాని రామారావు భవన్‌లో ప్రజానాట్యమండలి నిర్వహిస్తున్న మూడురోజుల ఎన్నికల పాటల వర్క్ షాప్ ముగింపు సభ జరిగింది. ఈ సభకు స్టాలిన్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా సత్తిబాబు మాట్లాడుతూ... బీజేపీ అధికారంలోకి వచ్చిన తర్వాత నియంతృత్వ ధోరణి పెరిపోయిందని, రాజ్యాంగ విరుద్ధ పాలన కొనసాగడం దేశానికి మంచిది కాదని అభిప్రాయపడ్డారు. ప్రజలందరూ ప్రజాస్వామ్యం కోసం పోరాడుతున్న ఇండియా కూటమికి మద్దతు తెలపాలన్నారు. కూటమి గెలుపు కోసం ప్రజానాట్యమండలి తన పాటలతో ప్రజల్ని చైతన్యపరచాలన్నారు. స్టాలిన్ మాట్లాడుతూ పశ్చిమగోదావరి జిల్లాలో 1935లోనే సాంస్కృతిక ఉద్యమం సాగిందని... అప్పట్లో మూఢనమ్మకాలకు వ్యతిరేకంగా ప్రజా చైతన్యం కోసం పనిచేసిందన్నారు. మత దురాహంకారం పెరిగిపోతున్న నేటి తరుణంలో కళాకారులంతా నిబద్ధతతో కూడిన లక్ష్యం కోసం పనిచేయాలన్నారు. సాంస్కృతిక ఉద్యమం నిరంతరం కొనసాగాలని ఆయన ఆకాంక్షించారు. ఆంధ్రప్రదేశ్ ప్రజా నాట్యమండలి రాష్ట్ర అధ్యక్షులు చంద్రనాయక్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చిన్నం పెంచలయ్య మాట్లాడుతూ మూడు రోజులపాటు ఉమ్మడి గోదావరి జిల్లాల కమ్యూనిస్టు పార్టీలు ప్రజానాట్యమండలి కమిటీలు ఎంతో ఉత్సాహంగా శిక్షణ తరగతులు విజయవంతం కావడానికి సంపూర్ణంగా సహకరించాయని తెలిపారు. ప్రతి ఒక్కరికి కృతజ్ఞతలు తెలియజేశారు. మూడు రోజులపాటు శిక్షణ తరగతులలో పాల్గొన్న కళాకారులు, జిల్లాల నాయకత్వం వారి వారి జిల్లాలలో ప్రత్యేకంగా జిల్లాస్థాయి శిక్షణ తరగతులు కూడా నిర్వహించాలని కోరారు. ప్రజానాట్యమండలి పాటలను మరింతగా నేర్చుకొని దళాలుగా ఏర్పడి ఎన్నికల ప్రచారంలో ఇండియా కూటమి విజయానికి అగ్ర భాగాన నిలవాలని వారు కోరారు. మండలి జాతీయ కార్యదర్శి గని, రచయిత దేవరకొండ శ్రీనివాస్‌లను ఉమ్మడి ప్రజానాట్యమండలి బాధ్యులు మహంతి లక్ష్మణరావు కుమార్, శామ్యూల్ ప్రేమానందం అధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. ఈ సమావేశంలో ఆంధ్రప్రదేశ్ ప్రజానాట్యమండలి రాష్ట్ర ఆఫీస్ బేరర్స్ వీ నాగరాజు, ఏ శివయ్య, జే నాగరాజు, వాసు, అనంతలక్ష్మి, ఎస్ శారద, దప్పు సూరి, ముకుంద తదితరులు పాల్గొన్నారు.

లిబరల్ ఆర్ట్స్‌లో విద్యార్థులు పట్టు సాధించాలి

విశాలాంధ్ర-మంగళగిరి: ఉన్నత చదువుల్లో రాణించేందుకు ఇంజినీరింగ్ విద్యార్థులు లిబరల్ ఆర్ట్స్‌లోనూ పట్టు సాధించాలని స్టాన్ఫోర్డ్ యూనివర్సిటీ (యుఎస్ఏ) హ్యూమానిటీస్ స్కూల్ ఆంత్రోపాలజీ హెడ్ ఆచార్య థామస్ హన్సెన్ సూచించారు. ఏపీ ఎస్ఆర్ఎం వర్సిటీలోని ఈశ్వరీ స్కూల్ ఆఫ్ లిబరల్ ఆర్ట్స్ ఆధ్వర్యంలో గురువారం వర్సిటీ ఆడిటోరియంలో 'భారత విద్యావిధానంలో లిబరల్ ఆర్ట్స్ అంతర్గత రూపకల్పన' అన్న అంశంపై విశిష్ట ప్రసంగ కార్యక్రమం జరిగింది. ముఖ్యఅతిథిగా హాజరైన ప్రొఫెసర్ థామస్ హన్సెన్... రీసెర్చ్ స్కాలర్లు, ఇంజినీరింగ్ విద్యార్థులనుద్దేశించి ప్రసంగించారు. తమ చుట్టూ ఉన్న ప్రపంచం గురించి సంపూర్ణ అవగాహన పెంచుకునేందుకు లిబరల్ ఆర్ట్స్ దోహదపడతాయని స్పష్టం చేశారు. వైస్ ఛాన్సలర్ ఆచార్య మనోజ్ కుమార్ అరోరా యూనివర్సిటీ ప్రగతిని వివరించారు. అనంతరం విద్యార్థులు, ప్రొఫెసర్లు అడిగిన పలు ప్రశ్నలకు డాక్టర్ థామస్ సమాధానాలు ఇచ్చారు. ఎంతో విలువైన సూచనలు అందజేసిన థామస్ హన్సెన్‌ను యాజమాన్యం ఘనంగా సత్కరించింది. శాలువా కప్పి జ్ఞాపికను ప్రదానం చేశారు. రిజిస్ట్రార్ డాక్టర్ ఆర్.ప్రేమ్ కుమార్, రీసెర్చ్ డీన్ ప్రొఫెసర్ రంజిత్ థాపా, ఈశ్వరీ స్కూల్ డీన్ డాక్టర్ విష్ణువర్, డాక్టర్ అయేషా హరూన్, డాక్టర్ రజనీ ముజ్రాల్, డాక్టర్ జీఎస్ వినోద్, డాక్టర్ రాజపాండ్య పాల్గొన్నారు.

స్కూళ్ల నుంచే 'ఎస్ఏ2' పంపిణీ: ఏపీటీఎఫ్ డిమాండ్

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: స్కూల్ కాంప్లెక్స్‌ల నుంచి ఎస్ఏ 2 ప్రశ్నాపత్రాలు పంపిణీ చేయాలని ఏపీటీఎఫ్ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు జి.హృదయరాజు, ఎస్.చిరంజీవి గురువారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. 'రాష్ట్ర వ్యాప్తంగా ఈనెల 15 నుంచి 22 వరకు ఒకటి నుంచి తొమ్మిదో తరగతి వరకు ఎస్ఏ-2 పరీక్షలు నిర్వహిస్తున్నారు. ప్రశ్నాపత్రాలను ప్రతి మండల రిసోర్స్ సెంటర్ల (ఎంఆర్‌సీ) నుంచి రోజూ పరీక్షకు గంట ముందు ఆయా పాఠశాలల నుంచి తీసుకెళ్లాలని పాఠశాల విద్య సంచాలకులు ఆదేశించారు. రోజూ ఉపాధ్యాయులు ఎంఆర్‌సీకి వచ్చి ప్రశ్నాపత్రాలు తీసుకువెళ్లడం కష్టంగా ఉంటుంది. కాబట్టి స్కూల్ కాంప్లెక్స్ నుంచి వీటిని అందుబాటులో ఉంచాలి' అని నాయకులు డిమాండ్ చేశారు.

సంపాదకీయం

మోదీ కొత్త ఆయుధం కచ్చతీవు

ఎన్నికల్లో విజయం సాధించడానికి ప్రధానమంత్రి మోదీకి ఎప్పుడూ ఏదో ఒక అంశం కావాలి. 2019లో అది బాలాకోట్ మీద దాడి కావొచ్చు. బీజేపీ ఆత్మకు ఇంపైన హిందుత్వ నినాదంవల్ల మాత్రమే ఓట్లు రాలవని, ఇతర రాజకీయ పరిణామాలు తమకు అనుకూలంగా లేవని తెలుసుకున్న మోదీ గత నెల 31వ తేదీన మాయల మాంత్రికుడు టోపీ లోంచి కుందేలు పిల్లను తీసినట్టు కచ్చతీవు అంశాన్ని తెర మీదకు తీసుకొచ్చారు. కచ్చతీవుకు ఓ చరిత్ర ఉంది. కచ్చతీవును స్వాధీనం చేసుకోవాలని తమిళనాడు బీజేపీ అధ్యక్షుడు అన్నామలై ఒక పితూరీ లేవదీశారు. మోదీ ఆ అంశాన్ని ఎన్నికలలో విజయం సాధించుకోవడానికి ఆయుధంగా మలుచుకున్నారు. అయితే కచ్చతీవు చరిత్ర మోదీ లేవనెత్తినప్పుడో, అన్నామలై మెదడులో మెదిలినప్పుడో ప్రారంభం కాలేదు. కాదు కూడా. మౌలికంగా కచ్చతీవు వివాదాస్పద దీవి. అది రామేశ్వరానికి దక్షిణాన, శ్రీలంక ఉత్తర ప్రాంతంలోని జాఫ్నాకు మధ్యలో పాక్ జలసంధిలో ఓ చిన్న దీవి. కచ్చతీవు పక్కనే మరో చిన్న దీవి ఉంది. దానిని ఇమరావన్ అంటారు. ఆ దీవులు సైనికపరంగా ప్రాముఖ్యం కలిగినవి. భారత, శ్రీలంక దేశాలవారు చేపలు పట్టే వారు తమ వలలు ఆరవేసుకోవడానికి కచ్చతీవును వినియోగించుకుంటారు. కనక అవి భారత్‌కు చెందినవా, శ్రీ లంకకు చెందినవా అన్న వివాదం ఎప్పుడూ ఉంది. కచ్చతీవు ఎంత చిన్న దీవి అంటే అంతా కలిపితే 285 ఎకరాల నేల. పొడవు 1.6 కిలో మీటర్లు ఉంటే వెడల్పు వెయ్యి అడుగులు మాత్రమే. 1921 నాటి అధికారిక పత్రాల ప్రకారం అది వివాదాస్పద ప్రాంతమే. 1971లో భారత-పాకిస్థాన్ యుద్ధం జరిగినప్పుడు పాకిస్థాన్ యుద్ధ విమానాలు శ్రీలంక రాజధాని కొలంబోలో ఇంధనం నింపుకుంటే ఉండేవి. ఇది మనకు ప్రతికూలమైన అంశం. అప్పటి ప్రధానమంత్రి ఇందిరా గాంధీ శ్రీలంక ప్రధాన మంత్రి సిరిమావో బండారు నాయికేను ఒప్పించి పాకిస్థాన్ యుద్ధ విమానాలు కొలంబోలో ఇంధనం నింపుకోకుండా చేయడానికి కచ్చతీవులను శ్రీలంకకు వదిలేశారు. దానికి బదులు చమురు, గ్యాస్ అన్వేషణకు కొంత సముద్ర ప్రాంతాన్ని శ్రీలంక మనకు అప్పగించేటట్టు 1974 లో ఒప్పందం కుదుర్చుకున్నారు. ఈ వాస్తవాన్ని గమనించకుండా ఇందిరాగాంధీ అప్పనంగా కచ్చతీవును శ్రీలంకకు అప్పగించేశారని మోదీ యాగీ చేస్తున్నారు. విదేశాంగ మంత్రి జై శంకర్ రాజును మించిన రాజభక్తి ప్రదర్శిస్తూ మోదీ రాగాలాపనకు శ్రుతి కలుపుతున్నారు. జై శంకర్ ఒకప్పుడు శ్రీలంకలోని మన రాయబార కార్యాలయంలో రాజకీయ వ్యవహారాల అధికారిగా ఉన్నారు. అయినా ఆయనకు తెలిసిన చరిత్రనే విస్మరించి మాట్లాడు తున్నారు. పైగా జై శంకర్ శ్రీలంకలో భారత శాంతి పరిరక్షణ దళం (ఐ.పి.కె.ఎఫ్.) సలహాదారుగా కూడా ఉన్నారు. శాంతి పరిరక్షక దళాలను పంపించి వందలాది మంది తమిళులనే హతమార్చి నందువల్ల మనకు చెడ్డ పేరే మిగిలింది. అన్నీ తెలిసిన జైశంకర్ ఈ అంశంపై రచ్చ చేయడం హాస్యాస్పదమైందే. నింపాదిగా కనిపించే జై శంకర్ కనీసం నలుగురు చూడడానికైనా రాజనీతిజ్ఞతను పాటించలేదు.

అన్నింటికన్నా మించి త్వరలో జరిగే ఎన్నికలలో లబ్ది పొందడానికి మోదీ ఈ అంశాన్ని ఉన్నట్టుండి లేవనెత్తారు. అన్నామలై ఈ అంశానికి సంబంధించిన పత్రాలను సేకరించే పనిలో పడ్డారు. ఈ వివాదానికి మోదీ జాలర్ల సమస్యను కూడా జోడించారు. మన జాలర్లు శ్రీలంకకు కిలో మీటరు దూరం దాకా చొచ్చుకుపోయి చేపలు పడుతుంటారు. వారి మీద మధ్యమధ్యలో శ్రీలంక భద్రతా దళాలు దాడి చేస్తుంటాయి. జాలర్ల సాధన సంపత్తిని స్వాధీనం చేసుకుంటారు. ఈ సమస్య పరిష్కరించే ఉద్దేశమే మోదీ ప్రభుత్వానికి లేదు. జాలర్ల మీద అంత అభిమానమే ఉంటే సముద్రంలో దూర ప్రాతాలకు వెళ్లి చేపలు పట్టడాన్ని ప్రోత్సహించవచ్చు. కావలసిన పడవలు సమకూర్చవచ్చు. కానీ ప్రభుత్వం ఈ మొత్తాన్ని కేటాయించడానికి సిద్ధంగా లేదు. కనీసం బ్యాంకుల ద్వారా రుణాలు ఇప్పించడమూ లేదు. ఉన్నదల్లా జాలర్ల ఓట్లు కొల్లగొట్టడమే. కచ్చతీవు అంశాన్ని మోదీ ఎన్నికల ప్రచారంలో ఉపయోగించుకుంటున్నారు. తమిళనాడులో డి.ఎం.కె. ప్రభుత్వాన్ని రెచ్చగొట్టే ప్రయత్నం చేస్తున్నారు. తమిళనాడులోని అన్ని పార్టీలు కచ్చతీవుల మీద ఆధిపత్యం సంపాదించాలనే కోరతాయి. డి.ఎం.కె. దీనికి అతీతం కాదు. గతంలో కరుణా నిధి, జయలలిత ఇదే పనిచేశారు. దక్షిణాదిలో కాలు మోపడానికి అవకాశమే లేనందువల్ల తమిళుల మద్దతు సంపాదించడానికి మోదీ చేయని ప్రయత్నమే లేదు. ఒక దినపత్రికలో వచ్చిన వార్తను ఉటంకిస్తూ మోదీ ఈ అంశాన్ని లేవనెత్తారు. కాంగ్రెస్ అడ్డంగా ఈ దీవిని శ్రీలంకకు అప్పగించిందని మొత్తం సమాచారం గురించి ప్రస్తావించకుండా అర్ధ సత్యాలతో వివాదాన్ని పెద్దది చేయడమే మోదీ లక్ష్యం. 50 ఏళ్ల కింది కుదిరిన ఒప్పందాన్ని ప్రధాని ప్రస్తావించడం ఓట్ల కోసమే. జనావాసమే లేని కచ్చతీవుల్లో సెయింట్ ఆంథొనీ చర్చి ఫిబ్రవరి, మార్చి నెలల్లో వార్షిక ఉత్సవం నిర్వహిస్తుంది. భారత్-శ్రీలంక దేశాల వారు ఇందులో భాగస్వాములవుతారు. భారత జాలర్ల మీద శ్రీలంక దాడులకు నిరసనగా రామనాథపురంలోని జాలర్లు ఈ సారి ఉత్సవాన్ని బహిష్కరించారు. గత పదేళ్లనుంచి అధికారంలో ఉన్నా మోదీకి కచ్చతీవు అంశం గుర్తుకే రాలేదు. లోకసభ ఎన్నికలకు ముందే ఎందుకు రచ్చ చేస్తున్నారో సులభంగానే అర్థం అవుతుంది. మారిన భారత వైఖరిని నమ్మలేని స్థితిలో శ్రీలంక పడిపోయింది. బీజేపీ చేసిన పనివల్ల శ్రీలంకతో మన సంబంధాలు బెడిసిపోయే ప్రమాదం ఉంది. ఇప్పటికే శ్రీలంక క్రమంగా చైనాకు చేరువ అవుతోంది. మాల్దీవులలో కూడా చైనా ప్రభావం స్పష్టంగా కనిపిస్తోంది. మన సంబంధాలకూ విఘాతం కలిగింది. స్వల్పకాలిక రాజకీయ ప్రయోజనాల కోసం విదేశాంగ విధానంతో ఆటలాడుకుంటే ద్వైపాక్షిక ఒప్పందాలకు ఏ దేశమూ ముందుకు రాని విపత్కర పరిస్థితి ఏర్పడుతుంది. ఇలాంటి నడవడిక వల్ల శ్రీలంకలో సంకుచిత జాతీయవాద శక్తులు బలపడతాయి. పాక్ జలసంధికి పొరుగున ఉన్న దేశాలు శ్రీలంకతో మనకు సత్సంబంధాలు లేకపోతే అనేక దేశాలు ఈ పరిస్థితిని తమకు అనువుగా మలుచుకుంటాయి. ఈ విషయం ప్రభుత్వ నిర్వాహకులకు తెలియదనుకోలేం. కానీ మోదీ దృష్టిలో ఏదైనా ఎన్నికల విజయం తరవాతే. ఎన్నికల్లో లబ్ధి పొందడానికి మోదీ ఏ అంశాన్ని ఆయుధంగా వాడతారో తెలియనప్పుడు ఇతర దేశాల వారు మనతో రహస్యాలు మాట్లాడడానికి నిరాకరించే ప్రమాదం ఉంటుంది. తక్షణ ప్రయోజనాలకోసం విదేశాంగ విధానాన్ని ప్రమాదంలో పడవేస్తున్నారు.

అబద్ధాల మోదీ

రా బావ ఏంటి పళ్లు కొరుకుతూ కోపంతో వస్తున్నావు. ఏముంది బీజేపీ నాటకాలు ఒక్కొక్కటి బైటపడుతున్నాయి. ఒకే దేశం ఒకే ఎన్నిక అంటున్నాడు మోది. మూడోసారి

ప్రధాని అయినాక ఒకే దేశం ఒకే మతం అంటాడు. నువు సహిస్తావా చెప్పు. నిజమే అసెంబ్లీ, పార్లమెంటుకు ఒకేసారి ఎన్నికలు జరిగితే ఖర్చు తగ్గుతుందట. కాని లక్షల కోట్లు ప్రజాధనం దోపిడీకి గురయితే అది కనపడదు. ఎన్నికలకు నిధులు ఇస్తే ఎంత దోపిడీదారులైనా పరవాలేదు. అది నిజమే మరి మనది ప్రపంచంలో అతి పెద్ద ప్రజాస్వామ్య దేశమని, దేశంలో ప్రజాస్వామ్యం కాపాడేది తానేనని మోది డబ్బా వాయించుకుంటాడు. మరి అయిదేళ్ల ప్రజోపయోగ పాలన చేయమని ఎన్నుకున్న తరువాత మూడేళ్లకో నాలుగేళ్లకో ఒకే దేశం, ఒకే ఎన్నికల పేరుతో ఎన్నికలు జరపటం అదేమి ప్రజాస్వామ్యం. అసలు ప్రజలు ఎన్నుకున్న ప్రభుత్వం అప్రజాస్వామికంగా ప్రజా వ్యతిరేకపాలన సాగిస్తుంటే వెంటనే ఆ ప్రభుత్వాన్ని దించి ఎన్నికలు జరపడానికి వీలుగా రీకాల్ పవరు ఓటర్లకు ఉండాలని ప్రజలు కోరుతుంటే అందుకు విరుద్ధంగా ఐదేళ్లు ముగియకపోయినా ఎన్నికలు జరపడం ఎంతోటి ప్రజాస్వామ్యమో మోదీ చెప్పాలి. అంతేకాదు ప్రభుత్వరంగ సంస్థలన్నిటిని ప్రైవేటు పరంచేసి లక్షలాది మంది నిరుద్యోగులను చేస్తూ తనది ప్రజామోద ప్రభుత్వమంటూ అబద్ధాలు చెప్పడానికి మోదీ వెనుకాడడు.

అంతెందుకు బావ నిన్న కాక మొన్న మూడు పార్టీలు కలిసి ఏర్పాటుచేసిన సభలో కాంగ్రెసు, వైసీపీ కుటుంబపాలన చేసేయట.
చంద్రబాబు మాత్రం ప్రజల కోసం ఏం పని చేస్తాడట. గతంలో మోదీని తిట్టని తిట్టు తిట్టకుండ తిట్టిన చంద్రబాబుకు ఇపుడు దైవదూతగా మోదీ కనపడుతున్నాడు. పాపం మోదీకి అయోధ్యలో బాలరాముడి ప్రతిష్ట సమయంలో రామావతారంలో కోటి రామారావులు కనిపించాడని చెప్పడం ఎంత అబద్ధమో ప్రజలకు తెలుసు. ఆ మాటతోనే ఆంధ్రుల మనసు పులకించి పోతుందనుకోవడం మోదీ తలంపు. కాని మాటల మాంత్రికుడని ఆంధ్రులకు బాగా తెలుసు. తిట్టిన నోటితోనే పొగడటం చంద్రబాబుకే చెల్లు. ప్రభుత్వం ఏర్పాటుచేస్తే ఏం చేస్తాడో చెప్పకుండా వైసీపీని, కాంగ్రెసును తిట్టడంతో మోదీ సరిపెట్టాడు. ఒక పక్క జగన్‌ను బాహాటంగా విమర్శిస్తున్న షర్మిల కాంగ్రెస్ నేతగా సభలు నిర్వహిస్తుంటే వైసీపీ, కాంగ్రెసు ఒకటేనని మోదీ అంటే ఆంధ్రులు నమ్ముతారని అనుకుంటే అది మోదీ అవివేకం. అది సరె అసలు ఈ కూటమిలో నాయకులు ఒకర్ని ఒకరు నమ్మనిరీతిలో వ్యవహరిస్తున్నారు. అన్నింటి కంటే విశేషం కమ్యూనిస్టులకు ఓట్లు లేవనుకోవడం. కమ్యూనిస్టు పార్టీల కేడరు చెక్కు చెదరలేదు. ఇతర పార్టీల వలె ఎరచూపితే జెండా మార్చరని పాపం చంద్రబాబుకు, మోదీకి తెలియదేమో. అసలు ఆర్ఎస్ఎస్‌ను జోకొడుతూ ప్రజలకు అబద్ధాలు వల్లెవేస్తూ సమాజాన్ని మోసం చేస్తున్నాడు మోదీ. అది సరె ఎన్నాళ్లు ఇలా మోసం చేయగలడు. భలేవాడివయ్యా ప్రజల్ని ప్రశ్నించకుండ, ఆలోచించకుండ నాయకులు చెప్పింది చేస్తున్నంతకాలం మోసగాళ్లకు కొదువ ఉండదు. కాని ఈ మధ్యే డబ్బు ఎరచూపినా ఓటు ఎవరికి వెయ్యాలో ప్రజలు ఆలోచిస్తున్నారు. అసలు ఈ మోసగాళ్లను పక్కన పెట్టాలంటే ప్రజల్ని వివేకవంతులుగా మార్చాలి. పల్లెల్లోకి వెళ్లి వాళ్ల జీవనవిధానం గమనించి వారి సమస్యలు తెలుసుకుని వాటి శాశ్వత పరిష్కారం ఎలాగో వారికి వివరించాలి. ఎటువంటి ప్రభుత్వం అవసరమో వారు గుర్తించేలా చేయాలి. ఏ పార్టీ డబ్బుతో ఎరచూపినా వారు అపుడే సరైన నిర్ణయం తీసుకోగలరు. అసలు అభివృద్ధి అంటే డబ్బు పంచడం కాదని స్వయం ఉపాధితో తమ బతుకు తాము బతకడం అని తెలుసుకుంటారు.

సామాన్యుని జీవన ప్రమాణం పెరగడమే సరైన అభివృద్ధి. స్వయం ఉపాధితో మనగలడంతోనే అభివృద్ధి సాధ్యమని గ్రహించాలి. అంతేగాని కేవలం నున్నటి రోడ్లువేసి ఫ్లైఓవర్లు నిర్మించి యిదే అభివృద్ధి అంటే కడుపు కాలేవాడు ఎలా ఒప్పుకుంటాడు. నిజమే బావ రాష్ట్రం విడగొట్టి కట్టుబట్టలతో పంపారని జోలిపట్టిన చంద్రబాబు ప్రభుత్వ స్థలాలలో కాకుండా కోట్లు పెట్టి వేల ఎకరాలు కొని ప్రపంచంలో ఎక్కడాలేని రాజధాని నిర్మిస్తామని అదే అభివృద్ధి అంటే కడుపు కాలేవాడు ఒప్పుకుంటాడా? నిజమే సామాన్యుల సమస్యల పరిష్కారం అభివృద్ధికాని, బాబు అన్నట్లు రోడ్లు, ఫ్లైఓవర్లు, అధునాతన రాజధాని మాత్రమే అభివృద్ధికాదు. ఇప్పటికైనా సామాన్యుల సమస్యల పరిష్కారం వైపు దృష్టి సారించాలి.

అవ్వా తాతల పెన్షన్ కష్టాలకు కారకులెవరు?

ఎం.సి.వెంకటేశ్వర్లు

అవ్వా తాతల పెన్షన్‌లకు కష్టాలను కొని తెచ్చినది టీడీపీ అని వైసీపీ, కాదు మీరేనని టీడీపీ వీధులకెక్కి కాట్లాడుకోవడం తెలుగు ప్రజలకు పట్టిన దుర్గతి. వయసుడిగి పనిభారం మోయలేక విశ్రాంతి జీవితం గడుపుతున్న వృద్ధులు, వయోవృద్ధులు ఎన్నికలవేళ రాజకీయ పావులుగ మారడానికి అధికార, ప్రతిపక్షపార్టీలు కారకులైనా ప్రధాన నిందను అధికారపార్టీ మోయకతప్పదు.

వాస్తవానికి అసలు కారకులు ఎవరన్నది ప్రధాన చర్చనీయాంశం. వలంటీర్లను పించను, తదితర డబ్బు పంపిణీకి పంపరాదని ఎన్నికల కమిషన్ తాఖీదు లివ్వడమే అసలు సమస్య. వలంటీర్లను నగదు పంపిణీకి, ఎన్నికల బాధ్యతలకు నియమించరాదని తెలుగుదేశం పార్టీతోపాటు ప్రతిపక్ష రాజకీయ పార్టీలు ఫిర్యాదు చేసినందున అవ్వా, తాతలకు ఈ సమస్య వచ్చి పడిందని వైసీపీ ఆరోపణ. కాదు వలంటీర్లను ఎన్నికల్లో వైసీపీ ప్రచారదళంగా ఉపయోగపడుతుందని ఎన్నికల ప్రక్రియకు దూరంగా ఉంచాలని చెప్పామని, కాని పించన్ల నగదు పంపిణీ చేయవలసిన బాధ్యత ప్రభుత్వానిదని టీడీపీ నాయకుల వాదన. సాంకేతికపరంగా చూసినప్పుడు రెండు వాదనల్లోను నిజం లేకపోలేదు.

అయినా వలంటీర్ల నియామకం మొదటినుండి వివాదాస్పదం. పాలకపార్టీలు తమ స్వార్థ రాజకీయాలకు కొన్ని నిర్ణయాలు చేసినా అవి ప్రజలకు చేరువకాగలవు. గతంలో ఎన్‌టీఆర్ తీసుకున్న మండలవ్యవస్థ ఏర్పాటును ప్రతిపక్ష పార్టీలు విమర్శించినా తరువాత అవే పార్టీలు, ప్రజలు హర్షించారు. కాని దీనిలో రాజకీయ తంత్రం ఏమీలేదు. ఆ తరువాత ఆంధ్రలో మునసబు, కరణాలను తెలంగాణలో పటేల్, పట్వారీలను రద్దుచేస్తూ ఒక చట్టం చేశారు. అలాగే భూమిశిస్తును రద్దు చేశారు. ఈ రెండు చట్టాలు టీడీపీకి ప్రత్యేకంగా ఎన్.టి.రామారావు ప్రతిష్టను పెంచాయనుటలో సందేహంలేదు. కాని అందరు హర్షించలేకపోవచ్చు. మునసబు, కరణాల వ్యవస్థను రద్దు చేయటాన్ని ప్రారంభంలో ప్రజలు స్వాగతించినా, ఆచరణలో ప్రజల నుండి నిరసనను ఎదుర్కోక తప్పలేదు. తరువాత ఆ స్థానాలలో నియమించిన ప్రభుత్వ ఉద్యోగులకు భూ రికార్డులపై అవగాహన లేకపోవడం, వారికి తగిన సాంకేతిక శిక్షణ ఇవ్వకుండా టీడీపీ ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకోవడం ప్రజలను తీవ్ర ఇబ్బందులకు గురిచేసింది. ఈ నాటికి భూ వివాదాలకు కొదువలేదు.

ఈనాడు జగన్ ప్రభుత్వం ఏర్పాటుచేసిన వ్యవస్థ ఆనాడు టీడీపీ తీసుకువచ్చిన సంస్కరణలకు భిన్నమైనది. అత్యంత ప్రమాదకరమైనవి. గాంధీ కలలుగన్న గ్రామ రాజ్యానికి భిన్నమైనవి. వలంటీర్ వ్యవస్థను, సచివాలయ వ్యవస్థను వైసీపీ పంచమాంగదళంగా ముఖ్యమంత్రి తీర్చిదిద్దడాన్ని టీడీపీ ఆరోపించడంలో నిజం లేకపోలేదు. సంస్కరణలనేవి రాష్ట్రంలోనైనా, కేంద్రంలోనైనా తీసుకురావలసిన అవసరం ఉంది. స్వాతంత్ర్యం వచ్చి 70సంవత్సరాలకు పైబడినా సంస్కరణలు లేకపోతే ఆ సమాజం, రాజకీయ వ్యవస్థ బండబారిపోతుంది. ప్రజాస్వామ్యం కనుమరుగై నియంతృత్వపాలనకు దారి తీస్తుంది. ఈ 70 సంవత్సరాలలో జనాభా పెరగడం, వారి అవసరాలు, ఆలోచనలు, జీవనసరళి మారుతున్న దశలో వాటికనుగుణమైన, ప్రజల అవసరాలు తీర్చగలిగిన సంస్కరణలు కావాలి. అవి ప్రజలకు, సమాజానికి మేలు చేస్తాయి. రాష్ట్రాలు, దేశాభివృద్ధికి బాటలు వేస్తాయి.

కాని జగన్ ప్రభుత్వం ఏర్పాటు చేసిన వలంటీర్, సచివాలయ వ్యవస్థలు అందుకు భిన్నంగా ఫలితాలను ఇస్తున్నాయన్నది నిర్వివాదాంశం. వలంటీర్‌లు కేవలం 5 సంవత్సరాల నుండి పనిచేస్తున్నారు. వారికి ప్రభుత్వ నిబంధనల ప్రకారం సర్వీస్ రూల్స్ అమలు పరుస్తున్నారా? లేదు. వారు ప్రభుత్వ యంత్రాంగంలో భాగమా? ప్రశ్నార్థకమే. వలంటీర్లు మేం చెప్పినట్లే వినాలి. వలంటీర్లే నా సైన్యం అని ముఖ్యమంత్రి ప్రకటించిన తరువాత ప్రతిపక్ష పార్టీలు ఏ విధంగా ఆలోచిస్తాయి? అవి మంచివా, చెడువా అన్నది వేరే విషయం. గల్లీ నుండి తాడేపల్లి ప్యాలెస్ వరకు వైసీపీ నాయకులు బరితెగించి వలంటీర్లకు తాయిలాలిచ్చి, అజమాయిషీ చేస్తుంటే ఎన్నికల్లో పాల్గొనే ఏ రాజకీయ పార్టీ అయినా ఎన్నికల కమిషన్‌కు ఫిర్యాదు చేయకుండా ఉంటుందా? వారు నిజంగా ప్రభుత్వ ఉద్యోగులుగా ఉండాలని భావిస్తే వైసీపీ నాయకులతోపాటు ఎన్నికల ప్రచారంలో పాల్గొంటారు. వలంటీర్లను ఎన్నికల విధులకు దూరంగా ఉండమని ఎన్నికల కమిషన్ ఆదేశించినప్పుడే రాజకీయ పార్టీల ప్రచారానికి దూరంగా ఉండవలసిన బాధ్యత వారికుంది. వలంటీర్ల శ్రేయస్సు కోరినట్లయితే వైసీపీ నాయకులు స్వచ్ఛందంగా వారిని ప్రచారానికి దూరంగా ఉంచితే విజ్ఞతగా ఉండేది. పోలీసు అధికారులు, ప్రభుత్వ యంత్రాంగం తమ చెప్పుచేతల్లో ఉంటే తమను ఎవరూ ఏమీ చేయలేరన్న అహంభావాన్ని ప్రదర్శిస్తే జరిగేదేమిటో, జరగబోయేదేమిటో ఇటీవల వస్తున్న వార్తలే స్పష్టంచేస్తున్నాయి.

ఎన్నికలనేవి ప్రజాస్వామ్యానికి ప్రథమ సోపానం. అవి నిష్పక్షపాతంగా జరిగితే ప్రజలు శక్తిమంతంగా తయారవుతారు. వ్యక్తి స్వాతంత్ర్యం, భావ ప్రకటనా స్వేచ్ఛ ఉంటాయి. సామాజిక, రాజకీయ, ఆర్థిక వ్యవస్థలు కొంతమేర పురోగమనంలో ఉంటాయి. నోటుకు ఓటు, కండబలం ఎన్నికల్లో ప్రధాన సాధనంగా ఉన్నంతకాలం ప్రజాస్వామ్యానికి అంగవైకల్యం దాపురిస్తుంది. దేశాభివృద్ధి, రాష్ట్రాభివృద్ధి తిరోగమనం బాట పడతాయి. దానికి మన రాష్ట్రమే నిదర్శనం. అందువలన నేటి ఎన్నికల కమిషన్ తీసుకున్న నిర్ణయానికి నేటి వైసీపీ పాలకులే తప్ప, దానికి ప్రతిపక్ష రాజకీయ పార్టీలపై నిందలు వేయడం దుర్మార్గం. దీనికి అనుగుణంగా వైసీపీ ఐటీ బృందాలు సోషల్ మీడియాలో వాయిస్ మెసేజ్‌లు పెట్టి ప్రజల ఆలోచనలను కలుషితం చేస్తున్నాయి. అయినా ప్రజలు నమ్ముతారనుకోవడం భ్రమ మాత్రమే.

ప్రభుత్వ ఉన్నతాధికారులు కూడా అవ్వా, తాతల పెన్షన్‌లను రాజకీయంచేసి పాలకపార్టీకి లాభం చేకూర్చే పనిలో ఉన్నారు. సచివాలయం, పంచాయితీ సిబ్బంది తగిన సంఖ్యలో ఉన్నా గ్రామాలకు అధికారులనుపంపి పంపిణీ చేయించడానికి ఉన్నతాధికారులు ప్రయత్నించకపోవడం స్వామిభక్తి ప్రదర్శిస్తున్నారు. అనేక చోట్ల సచివాలయాలకు వెళ్లిన వృద్ధులు డబ్బులు లేక వెనుదిరగడం, గంటల తరబడి వేచి ఉండడం జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వ వైఫల్యమని ఎవరైనా నిందించవలసిన పనిలేదు. తనకుతానే నిందించుకోవాలి. ప్రస్తుత దుస్థితికి కారణం నూటికి నూరుపాళ్లు జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం అనడంలో ఎలాంటి సందేహంలేదు.

సెల్ : 8121223457

తీవ్ర నీటి కొరత

నీరు జీవనాధారం. జలం జీవజాతికి ప్రాణాధారం. మానవాళితో పాటు సకల వృక్ష జంతుజాలాలు జలం కోసమే క్షణక్షణం పరితపిస్తుంటాయి. అలాంటి అతి ముఖ్యమైన సహజ జల వనరులు కాలక్రమంలో తరుగుతూనే ఉన్నాయి. ముఖ్యంగా గత కొన్నేళ్లుగా భారతం తీవ్రమైన నీటి ఒత్తిడి లేదా కొరతను ఎదుర్కొంటున్నది. ప్రస్తుతం బెంగుళూరు పట్టణవాసులు నీటి బొట్టు కోసం తహతహలాడడం నిస్సహాయంగా చూస్తూనే ఉన్నాం. ఐరాస - యూనిసెఫ్ నివేదిక ప్రకారం 97 మిలియన్ల భారతీయులకు సురక్షిత తాగునీరు అందడం లేదని పేర్కొంది. గ్రామీణ భారతంలో నిత్య గుక్కెడు నీటి కోసం జగడాలు, వీధివీధిన మహిళల సిగపట్లు జరుగుతూనే ఉన్నాయి. నీతి ఆయోగ్ సమర్పించిన "కంపోజిట్ వాటర్ మేనేజ్‌మెంట్ ఇండెక్స్" ప్రకారం నేడు 600 మిలియన్ల భారతీయులు అతి తీవ్ర నీటి కొరతను అనుభవిస్తున్నారు. ప్రతి ఏడు సగటున 2 లక్షల అభాగ్యులు నీటి కొరత కారణంగా మరణిస్తున్నారని, 75 శాతం కుటుంబాలకు తాగు నీటి సరఫరా తమ గృహాల్లో ప్రత్యక్షంగా లేదని, 70 శాతం జనాలు కలుషిత తాగునీరు వాడుతున్నారని తెలుస్తున్నది. తీవ్ర నీటి ఒత్తిడి సంక్షోభం మూలంగా ఏడాదికి 150 మిలియన్ల మహిళల పని దినాలు, 10 బిలియన్ల ప్రజలు బిందె నీటి కోసం సుదూర తీరాలు ప్రయాణ ప్రయాస పడుతున్నారు. సెంట్రల్ వాటర్ కమిషన్ (సిడబ్ల్యూసి) అంచనాల ప్రకారం 2025 నాటికి దేశ ప్రజలకు 1,447 ఏడాదికి బిసిఎం (బిలియన్ క్యూబిక్ మీటర్లు) అవసరం అవుతుందని, అందుకు భిన్నంగా 1,123 బిసిఎం మాత్రమే అందుబాటులో ఉందని తెలుస్తున్నది. నీటి డిమాండ్, సరఫరాల మధ్య చాలా అంతరం ఉందనే భయంకర వాస్తవం ప్రజలను భయకంపితులను చేస్తున్నట్లు స్పష్టం అవుతున్నది. 2001లో తలసరి నీటి లభ్యత 1,816 క్యూబిక్ మీటర్లు (సిఎం) ఉండగా, 2011 నాటికి 1,544 సిఎం వరకు పడిపోవడం, 2050 నాటికి 1,140 సిఎం వరకు దిగజారడం జరగవచ్చని అంచనా వేస్తున్నారు. సిడబ్ల్యూసి వివరాల ప్రకారం అందుబాటులో ఉన్న ఉపరితల/భూగర్భ జలాలు 85 శాతం వరకు వ్యవసాయానికి వినియోగపడుతున్నదని, రోజురోజుకు భూగర్భ జలాలు అడుగంటుతున్నాయని తెలుస్తున్నది.

నేటి డిజిటల్ శాస్త్ర సాంకేతిక విప్లవంలో సాగునీటిని డ్రిప్/స్ప్రింక్లర్ లాంటి మైక్రో ఇరిగేషన్ పద్ధతులు పాటించాల్సిన అగత్యం ఏర్పడుతున్నదని ప్రభుత్వాలు, ప్రజలు గమనించాలి. తమిళనాడు రాష్ట్ర రైతులు మైక్రో ఇరిగేషన్ పద్ధతులు పాటిస్తూ 50 శాతం వరకు సాగు నీటిని, విద్యుత్తును ఆదా చేస్తూనే దిగుబడులను కూడా గణనీయంగా పెంచుకున్నారని తెలుసుకోవాలి. మహారాష్ట్ర, గుజరాత్, ఆంధ్రప్రదేశ్, కర్నాటక, తెలంగాణ లాంటి రాష్ట్రాల్లో మైక్రో ఇరిగేషన్ పద్ధతులు బహుళ ఆచరణలో ఉన్నందున నీటి కొరత సమస్య తక్కువగా ఉన్నది. 'మైనర్ ఇరిగేషన్ సెన్సెస్' ప్రకారం భారతదేశ వ్యాప్తంగా 6.42 లక్షల వాటర్ బాడీలు (చెరువులు/సరస్సులు/కుంటలు) ఉన్నాయని, ఇటీవల విడుదలైన 'ఫస్ట్ సెన్సెస్ ఆఫ్ వాటర్ బాడీస్' ప్రకారం 38, 486 వాటర్ బాడీలు దురాక్రమణలకు గురి అయ్యాయని తెలుస్తున్నది. నిర్వహణలో నిర్లక్ష్యం, చెరువులు పూడికతో నీటి నిల్వ సామర్థ్యాన్ని కోల్పోవడం, వాతావరణ ప్రతికూల మార్పులతో వర్షపాతంలో హెచ్చు తగ్గులు జరుగుతూనే ఉన్నది. ఈ విషమ పరిస్థితుల్లో నేటి ప్రభుత్వాలు, సంస్థలు, పౌర సమాజం తక్షణమే నీటి వనరులను రిపేర్(మరమత్తులు) చేయడం, రిస్టోర్ (పునరుద్ధరణ) చేయడం, రినొవేట్ (బాగు చేయడం) చేయడానికి చర్యలు తీసుకోవాలి.

బుర్ర మధుసూదన్‌రెడ్డి
9949700037

పదేళ్లలో విఫలమైన ఆర్థిక విధానాలు

కృష్ణ ఝా

గత పదేళ్లకాలంలో బీజేపీ నాయకుడు నరేంద్ర మోదీ ప్రభుత్వ పాలనాకాలంలో ఆయన అనుసరించిన ఆర్థిక విధానాలు పూర్తిగా విఫలమయ్యాయి. ఏదోవిధంగా చిన్న, చితక పనులు చేసుకొని బతకడానికి అలవాటు పడవలసిందే. ఈ నేరాన్ని ఎవరు అంగీకరిస్తారు? పౌర సమాజమంతా ఎలా బతకాలో తెలుసుకోవలసి ఉంటుంది. కరువు పరిస్థితిలో మనం జీవించవలసిందే. అన్ని వస్తువుల ధరలు ఊహించలేని స్థాయిలో పెరిగిపోతున్నాయి. ఇదే సమయంలో ఉద్యోగాలు లేవు. జీవితమే భరించలేని స్థాయికి చేరుతుంది. ఉద్యోగాలు, ఉపాధిలేక యువత ఆత్మహత్యలు పెరుగుతున్నాయి. నిరుద్యోగం అసాధారణంగా పెరిగి గరిష్టస్థాయికి చేరింది. భవిష్యత్‌లో మనం మాంద్యోల్బణాన్ని చవిచూడవలసిరావచ్చు.

1930లలో ఏర్పడిన మహామాంద్యం తరువాత మొదటిసారిగా నిరుద్యోగం మనల్ని భయపెడుతోంది. ఎన్నికల ప్రచారంలో మాత్రం గొప్పగొప్ప వాగ్దానాలు చేసి ప్రజలను సంతృప్తి పరిచి గెలుపొంది ప్రభుత్వాలు ఏర్పాటుచేసి నిరంకుశపాలన సాగిస్తూ, ప్రజలకు మేలుచేయకపోగా అనేక విషయాలలో వేధిస్తున్నారు. ఉద్యోగాలు సృష్టించని అభివృద్ధి జరుగుతున్నా అది సంపన్నులకే పరిమితమవుతోంది. 2023-2024 మొదటి మూడునెలల్లో 8.4శాతం జీడీపీ నమోదైందని ఆర్థికశాఖ ప్రకటించింది. ఆ తర్వాత జరిపిన సర్వేనివేదిక అంచనా ఏ మాత్రం ఆశాజనకంగా లేదు. అనేక ప్రశ్నలు వస్తున్నాయి. లోకనీతి సిఎస్‌డిఎస్ యువతపైన జరిపిన సర్వేప్రకారం, 80శాతం మందికి ఉద్యోగాలు లభించడం లేదని చెప్పారు. అభివృద్ధి జరిగిందని చెప్పినా ఉద్యోగాలులేవు. అభివృద్ధికి, ఉద్యోగాలలేమికి సంబంధమేలేని స్థితి వచ్చింది. జీవితంలోకి వస్తున్న ప్రారంభదశలో మన జనాభాలో 63శాతం అధిక సామర్థ్యంతో పనిచేయగలరు. వివిధరంగాలలో ఉత్పత్తిలో పాల్గొనే కీలకమైన దశ ఇది. ఉద్యోగాలు లేకుండా ఆర్థికవృద్ధి సాధ్యం కాదు. ఉద్యోగాలు కావాలని కోరుకోకుండా నేటి యువత ఉద్యోగాలు సృష్టించడానికి ప్రాధాన్యత ఇవ్వాలని మన

ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ పదేపదే సూచిస్తున్నారు. యువత ఉద్యోగాలు సృష్టించే కలలు కనాలని ఆయన అంటున్నారు. అయితే ప్రధానమంత్రి సూచన అనుసరించడానికి నేటి పరిస్థితులు అనుకూలంగా ఉన్నాయా? పని కల్పించడానికి బాధ్యతను తీసుకునే పరిస్థితి దేశంలో నెలకొని ఉందా? పెట్టుబడులు పెట్టడానికి తిరిగి ఆ పెట్టుబడి లాభాలు పొందే పరిస్థితులను ప్రభుత్వం సృష్టిస్తుందా?

నేటి దుర్భర పరిస్థితులకు కేంద్రప్రభుత్వానిదే బాధ్యత అని మెజారిటీ భారతదేశ ప్రజలు భావిస్తున్నారు. విధ్వంసానికి దారితీసే పరిస్థితులున్నాయని సర్వేలో పాల్గొన్న అత్యధికులు చెప్పారు. నేటి విషాద పరిస్థితికి కేంద్ర ప్రభుత్వానిదే బాధ్యత అని సర్వేలో పాల్గొన్న ప్రతి ఆరుగురిలో ఒకరు చెప్పారు. ప్రభుత్వం ఆర్థికరంగంలో పూర్తిగా విఫలం చెందిందని ఉద్యోగ అవకాశాలను ఏ మాత్రం సృష్టించలేదని అన్నారు. నిరుద్యోగ పరిస్థితుల గురించి మాట్లాడకుండా కేవలం ఓట్ల కోసమే ప్రచారం చేస్తుంటారు. 2023 చివరి త్రైమాసికంలో పట్టణప్రాంత ఉద్యోగ అవకాశాలు 6.5శాతానికి పడిపోయాయి. ఐఎల్ఓ నివేదిక ప్రకారం, దేశంలోని యువత ప్రత్యేకించి చదువుకున్నవారిలో ఎక్కువమంది ఉద్యోగాలు లేనివారే కనిపిస్తారు. ఆర్థికరంగంలో పరిస్థితి నిరాశజనకంగా ఉన్నది. గ్రాడ్యుయేషన్ పూర్తిచేసిన యువతలో ఉద్యోగాలు లేని యువత 29.1శాతం ఉన్నది. చదువులేని వారిలో నిరుద్యోగం రేటు 3.4శాతానికంటే ఎక్కువగాఉంది. ఉన్నతవిద్య చదువుకున్నవారిలో నిరుద్యోగం 18.4శాతం ఉన్నది. మన దేశంలో చదువుకున్న యువత నిరుద్యోగులుగానే ఉండే స్థితి ముందుముందు మరింత పెరగనుంది. ప్రత్యేకించి మహిళల్లో నిరుద్యోగం రేటు ఎక్కువగా ఉన్నది. గ్రామీణ ప్రాంతాల్లో వ్యవసాయ రంగంలో పనిచేసే శ్రామికుల సంఖ్య పెరిగింది. జనాభా పెరుగుదల రేటుకు అనుగుణంగా ఉద్యోగాల సృష్టిలేదు. అందువల్ల నిరుద్యోగుల రేటు పెరుగుతోంది.

కార్మిక మార్కెట్‌లో అసమానతలు ఎక్కువగా ఉన్నందున ఆర్థిక పరిస్థితి మెరుగ్గా లేదు. నైపుణ్యాలను పెంచడం ఎంతైనా అవసరం. అదే సమయంలో క్రియాశీలంగాఉన్న కార్మిక మార్కెట్‌కు అనుగుణంగా విధానాలను రూపొందిచాలి. గ్రామీణ ప్రాంతాలనుంచి వ్యవసాయ కార్మికులు పట్టణ ప్రాంతాలకు వలసవెళ్లడంతో పట్టణప్రాంతంలో నిరుద్యోగిత పెరుగుతోంది. భారతదేశంలో మార్కెట్ ఆర్థిక వ్యవస్థ ప్రజలు ఇతర ప్రాంతాలకు మేలైన అవకాశాలను అందిపుచ్చుకునేందుకు తప్పనిసరిగా వెళతారు. ఒకవైపు ఆహార ధాన్యాల ఉత్పత్తి దేశంలో ఎక్కువగా ఉందని ప్రభుత్వం ప్రకటిస్తోంది. మరి ఇలాంటి పరిస్థితిలో ప్రజలకు తగినంత ఆహారం ఎందుకు లభించడంలేదు? అలాగే వ్యవసాయరంగం తీవ్ర ముప్పును ఎదుర్కొంటోంది. రాజ్యాంగంలోని ఏడవ షెడ్యూల్ ప్రకారం, భూమి రాష్ట్ర ప్రభుత్వ పరిధిలో ఉంటుంది. రాష్ట్ర ప్రభుత్వాలే వ్యవసాయరంగం అభివృద్ధి చెందేందుకు ప్రణాళిక అమలుచేయాలి. ఇదే సమయంలో అన్ని రాష్ట్రాలకు కేంద్ర ప్రభుత్వం ఆర్థిక సహాయాన్ని అందించాలి. అయితే ప్రస్తుతం కేంద్రం తన స్వప్రయోజనాలకోసం భూమిని స్వాధీనం చేసుకుంటోంది.

1951 నుంచి పార్టీల బలాబలాలు

1951

పార్టీ	పోటీచేసిన సీట్లు	గెలిచిన సీట్లు	ఓట్ల శాతం
కాంగ్రెస్	479	364	44.99
బీజేఎస్	94	3	3.06
సీపీఐ	49	16	3.29
కేఎంపీపీ	145	9	5.79
ఎస్‌పీ (సోషలిస్టు పార్టీ)	254	12	10.5

1957

పార్టీ	పోటీచేసిన సీట్లు	గెలిచిన సీట్లు	ఓట్ల శాతం
కాంగ్రెస్	490	371	47.78
బీజేఎస్	130	4	5.97
సీపీఐ	110	27	8.29
పీఎస్‌పీ	189	19	10.41
ఇతరులు	119	31	7.60

1962

పార్టీ	పోటీచేసిన సీట్లు	గెలిచిన సీట్లు	ఓట్ల శాతం
కాంగ్రెస్	488	361	44.72
బీజేఎస్	196	14	6.44
సీపీఐ	137	29	9.94
పీఎస్‌పీ	168	12	6.81
ఎస్‌డబ్ల్యూపీ	173	18	7.89

1967

పార్టీ	పోటీచేసిన సీట్లు	గెలిచిన సీట్లు	ఓట్ల శాతం
కాంగ్రెస్	516	283	40.78
బీజేఎస్	249	35	9.31
సీపీఐ	109	23	5.11
సీపీఎం	59	19	4.28
ఎస్‌డబ్ల్యూపీ	178	44	8.67

1971

పార్టీ	పోటీచేసిన సీట్లు	గెలిచిన సీట్లు	ఓట్ల శాతం
కాంగ్రెస్	441	352	40.78
బీజేఎస్	157	22	7.35
సీపీఐ	87	23	4.73
సీపీఎం	85	25	5.12
ఎస్‌డబ్ల్యూపీ	59	8	3.07

1977

పార్టీ	పోటీచేసిన సీట్లు	గెలిచిన సీట్లు	ఓట్ల శాతం
కాంగ్రెస్	492	154	34.52
బీఎల్‌డీ	405	295	41.32
సీపీఐ	91	7	2.82
సీపీఎం	53	22	4.29
ఎన్‌సీఓ	19	3	1.72

1980

పార్టీ	పోటీచేసిన సీట్లు	గెలిచిన సీట్లు	ఓట్ల శాతం
కాంగ్రెస్ (ఐ)	492	353	42.69
కాంగ్రెస్ (యూ)	212	13	5.28
సీపీఐ	47	10	2.49
సీపీఎం	64	37	6.24
జెఎన్‌పీ	433	31	18.97
జెఎన్‌పీ (ఎస్)	293	41	9.39

1984

పార్టీ	పోటీచేసిన సీట్లు	గెలిచిన సీట్లు	ఓట్ల శాతం
కాంగ్రెస్	491	404	49.10
బీజేపీ	224	2	7.74
సీపీఐ	61	6	2.71
సీపీఎం	59	22	5.87
జెఎన్‌పీ	207	10	6.89

1989

పార్టీ	పోటీచేసిన సీట్లు	గెలిచిన సీట్లు	ఓట్ల శాతం
కాంగ్రెస్	510	197	39.33
బీజేపీ	225	85	11.36
సీపీఐ	50	12	2.57
సీపీఎం	64	33	6.55
జేడీ	244	143	17.79
జెఎన్‌పీ	155	0	1.01

1991

పార్టీ	పోటీచేసిన సీట్లు	గెలిచిన సీట్లు	ఓట్ల శాతం
కాంగ్రెస్	487	232	36.26
బీజేపీ	468	120	20.11
సీపీఐ	42	14	2.49
సీపీఎం	60	35	6.16
జేడీ	308	59	11.84
జేపీ	349	5	3.37

1996

పార్టీ	పోటీచేసిన సీట్లు	గెలిచిన సీట్లు	ఓట్ల శాతం
కాంగ్రెస్	529	140	28.80
బీజేపీ	471	161	20.29
సీపీఐ	43	12	1.97
సీపీఎం	75	32	6.12
జేడీ	196	46	8.08
జేపీ	101	0	0.19

1998

పార్టీ	పోటీచేసిన సీట్లు	గెలిచిన సీట్లు	ఓట్ల శాతం
కాంగ్రెస్	477	141	25.82
బీజేపీ	388	182	25.59
సీపీఐ	58	9	1.75
సీపీఎం	71	32	5.16
ఎస్‌పీ	57	12	1.76
బీఎస్‌పీ	251	5	4.67

1999

పార్టీ	పోటీచేసిన సీట్లు	గెలిచిన సీట్లు	ఓట్ల శాతం
కాంగ్రెస్	453	114	28.30
బీజేపీ	339	182	23.75
సీపీఐ	54	4	1.48
సీపీఎం	72	33	5.40
బీఎస్‌పీ	225	14	4.16
జేడీ (యూ)	60	21	3.10

2004

పార్టీ	పోటీచేసిన సీట్లు	గెలిచిన సీట్లు	ఓట్ల శాతం
కాంగ్రెస్	417	145	26.53
బీజేపీ	364	138	22.16
సీపీఐ	34	10	1.41
సీపీఎం	69	43	5.66
బీఎస్‌పీ	435	19	5.33
ఎన్‌సీపీ	32	9	1.80

2009

పార్టీ	పోటీచేసిన సీట్లు	గెలిచిన సీట్లు	ఓట్ల శాతం
కాంగ్రెస్	440	206	28.55
బీజేపీ	433	116	18.80
సీపీఐ	56	4	1.43
సీపీఎం	82	16	5.33
బీఎస్‌పీ	500	21	6.17
ఎన్‌సీపీ	68	9	2.04

2014

పార్టీ	పోటీచేసిన సీట్లు	గెలిచిన సీట్లు	ఓట్ల శాతం
కాంగ్రెస్	464	44	19.52
బీజేపీ	428	282	31.34
సీపీఐ	67	1	0.79
సీపీఎం	93	9	3.28
బీఎస్‌పీ	503	0	4.19
ఎన్‌సీపీ	36	6	1.58

2019

పార్టీ	పోటీచేసిన సీట్లు	గెలిచిన సీట్లు	ఓట్ల శాతం
కాంగ్రెస్	421	52	19.67
బీజేపీ	436	303	37.7
సీపీఐ	49	2	0.59
సీపీఎం	69	3	1.77
ఏఐటీసీ	62	22	4.01
బీఎస్‌పీ	383	10	3.66
ఎన్‌సీపీ	34	5	1.4

కాంగ్రెస్‌కు బీజేపీ అంటే భయం

పార్టీ జెండాలు ఎందుకు ప్రదర్శించలేదు: విజయన్

తిరువనంతపురం: కాంగ్రెస్‌పై కేరళ ముఖ్యమంత్రి పినరయి విజయన్ మండిపడ్డారు. నామినేషన్ సమయంలో రాహుల్ గాంధీ రోడ్‌షోలో కాంగ్రెస్ జెండాలు ఎందుకు ప్రదర్శించలేదని, బీజేపీకి కాంగ్రెస్ భయపడిందా అని విజయన్ ప్రశ్నించారు. కాంగ్రెస్ తన జెండాను ప్రదర్శించడానికి కూడా భయపడే స్థితికి దిగజారిందని విజయన్ ఆరోపించారు. 2024 లోక్‌సభ ఎన్నికలకు సంబంధించి తన ఎన్నికల ప్రచారంలో భాగంగా గురువారం కొచ్చిలో నిర్వహించిన మీడియా సమావేశంలో విజయన్ మాట్లాడారు. మూడు రంగుల జెండాను వదులుకోవాలన్న సంఘ్ పరివార్ డిమాండ్‌ను అంగీకరిస్తున్నారా అని నిలదీశారు. వయనాడ్‌లో నామినేషన్ పత్రాల దాఖలుకు ముందు రాహుల్ గాంధీ రోడ్ షో నిర్వహించారు. ఈ రోడ్‌షోలో కాంగ్రెస్, యూడీఎఫ్ మిత్రపక్షమైన ఇండియన్ యూనియన్ ముస్లిం లీగ్ (ఐయూఎంఎల్) జెండాలు కనిపించకపోవడంపై ఆయన స్పందించారు. రోడ్‌షోలో ఐయూఎంఎల్ జెండాలు ప్రదర్శించకపోవడం ఆ పార్టీ పిరికితనం కాదా అని ప్రశ్నించారు. కాంగ్రెస్‌కు ఐయూఎంఎల్ ఓట్లు కావాలి కానీ ఆ పార్టీ జెండాలు అవసరం లేదా అని నిలదీశారు. మూడు రంగుల జెండా కోసం పోరాడిన స్వాతంత్ర్య సమర యోధులు, అమరవీరుల ప్రముఖ చరిత్రను కాంగ్రెస్ మర్చిపోయిందని విమర్శించారు. మూడు రంగుల జెండా ప్రజల గొంతుకకు నిదర్శమన్నారు. వేల కోట్ల రూపాయల కరువనూరు సహకార బ్యాంకు కుంభకోణంలో మరింత మంది సీపీఎం నేతలను ఇరికించే యోచనలో ఈడీ ఉందని విజయన్ మండిపడ్డారు. ఈడీ ఆరోపించినట్లుగా పార్టీకి బ్యాంకులో రహస్య ఖాతా లేదన్నారు. తమ పార్టీ నల్లధనం తీసుకోదని, దీంతో తమకు రహస్య ఖాతాల అవసరం లేదని చెప్పారు. ప్రజల నుండి పార్టీ అందుకున్న విరాళాలను ఆడిట్ చేసి ఆదాయపన్ను శాఖకు అందిస్తామన్నారు.

ఎమ్మెల్యేలూ...ప్రజల్లోకి వెళ్లండి

జైలు నుంచి కేజ్రీవాల్ సందేశం

న్యూదిల్లీ: మద్యం పాలసీ కుంభకోణం కేసులో దిల్లీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్ ప్రస్తుతం తీహార్ జైల్లో ఉన్న విషయం తెలిసిందే. ఈ క్రమంలో ఆయన జైలు నుంచి ఎమ్మెల్యేలందరికీ సందేశం పంపారు. ఆ సందేశాన్ని కేజ్రీవాల్ సతీమణి సునీతా కేజ్రీవాల్ గురువారం ఆప్ ఎమ్మెల్యేలకు వినిపించారు. ఈ మేరకు 'ఎక్స్' వేదికగా పోస్ట్ చేశారు. అరవింద్ కేజ్రీవాల్ మాట్లాడుతూ... 'నేను జైల్లో ఉన్నా ను కాబట్టి దిల్లీ ప్రజలు ఎలాంటి కష్టాలు పడకూడదు. ప్రతి ఎమ్మెల్యే ప్రతి రోజూ తమ ప్రాంతానికి వెళ్లి ప్రజల సమస్యలపై చర్చించి వాటిని పరిష్కరించాలి. ప్రజలకు నిరంతరం అందుబాటులో ఉంటూ వారికి ఎలాంటి సమస్యలు రానీయకుండా చూసుకోవాలి' అని కోరారు. కేవలం ప్రభుత్వ సంబంధిత సమస్యలను పరిష్కరించడం మాత్రమే కాకుండా, ప్రజలు ఎదుర్కొం టున్న ఇతర సమస్యలను కూడా పరిష్కరించేందుకు ప్రయత్నించాలని సూచించారు. 'దిల్లీలోని 2 కోట్ల మంది ప్రజలు నా కుటుంబం, నా కుటుంబంలో ఎవరూ ఏ కారణం చేతనైనా అసంతృప్తి చెం దకూడదు. దేవుడు ప్రతి ఒక్కరినీ ఆశీర్వదిస్తాడు, జై హింద్!' అన్నారు.

బెంగాల్‌పై మోదీ ప్రతీకారం

- నిధులు ఇవ్వకుండా కక్షసాధింపు
- ఓట్ల కోసమే రాష్ట్రానికి ప్రధాని
- అధికారం వచ్చేంత వరకే హామీలు
- ప్రజల సమస్యలు పట్టించుకోని వైనం: జైరాం రమేశ్ విమర్శ

న్యూదిల్లీ: బీజేపీ కేవలం అధికారం కోసమే ప్రాకులాడుతుందని, ప్రజల సంక్షేమంగానీ వారి సమస్యల పరిష్కారంగానీ పట్టించుకోదని కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి జైరాం రమేశ్ వ్యాఖ్యానించారు. ఓట్లు దండుకోవడం కోసం హామీల వర్షం కురిపిస్తుందని... అధికారం దక్కాక వాటిని ఏ మాత్రం పట్టించుకోదని విమర్శించారు. ఎన్నికలప్పుడు మాత్రమే ప్రధాని మోదీకి జనం గుర్తుకు వస్తారని ఎద్దేవాచేశారు. బీజేపీయేతర పార్టీలు అధికారంలో ఉన్న రాష్ట్రాలపై ముఖ్యంగా పశ్చిమ బెంగాల్‌పై మోదీ ప్రభుత్వం తీవ్రమైన ప్రతీకారం తీర్చుకుంటోందని విమర్శించారు. 2021లో కాషాయ పార్టీని బెంగాల్ ప్రజలు తిరస్కరించినందుకు ఈ కక్ష సాధింపు అని అన్నారు. అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ ఓడిపోయిన కొన్ని నెల్లోగా బెంగాల్‌కు ఎంజీఎన్ఆర్ఈజీఎస్ నిధులు పూర్తిగా నిలిచిపోయాయని, కేంద్రం నుంచి రాష్ట్రానికి రావాల్సిన బకాయి మొత్తం రూ.1.15 లక్షల కోట్లకు పెరిగిందని జైరాం రమేశ్ వెల్లడించారు. జల్ జీవన్ మిషన్, జాతీయ ఆరోగ్య మిషన్, ప్రధానమంత్రి గ్రామ సడక్ యోజన, ప్రధానమంత్రి ఆవాస్ యోజన వంటి గ్రామీణ సంక్షేమ పథకాలకూ నిధులను బీజేపీ ప్రభుత్వం నిలుపుదల చేసి దాని కుటిలబుద్ధిని ప్రదర్శించుకున్నదని వ్యాఖ్యానించారు. ఈ సమస్యను పరిష్కరించడంపై ప్రధాని దృష్టిపెట్టినట్టు రాష్ట్ర గవర్నర్ రెండు నెలల కిందట చెప్పారు కానీ చాలా ఏళ్లుగా చూపిన నిర్లక్ష్యానికి ఏం సమాధానం చెబుతారని నిలదీశారు.

కూచ్‌బెహార్‌లో ప్రధాని ర్యాలీ నిర్వహించనున్న క్రమంలో జైరాం రమేశ్ ఘాటు విమర్శలు చేశారు. మోదీ హయాంలో బెంగాల్ ప్రజలు తీవ్రస్థాయిలో ఇబ్బందులకు గురవుతున్నారని వ్యాఖ్యానించారు. ఎన్నికలప్పుడు అడగడానికి ఏ మాత్రం ఆలోచించరుగానీ రాష్ట్రానికి ఇవ్వాల్సినవి ఇవ్వడానికి మాత్రం విముఖత ఎందుకని ప్రశ్నించారు. ఓట్లు అడగడానికి మాత్రమే ప్రధాని బెంగాల్‌కు వెళతారని, 2021లో అసెంబ్లీ ఎన్నికలప్పుడు రికారు ్డస్థాయిలో 22 సార్లు రాష్ట్రంలో పర్యటించారన్నారు. తాజా పర్యటన సందర్భంగా బెంగాల్‌లో ప్రభుత్వ వైఫల్యాలకు వివరణను ప్రధాని ఇవ్వాలని జైరాం రమేశ్ 'ఎక్స్'లో డిమాండ్ చేశారు. అసెంబ్లీ ఎన్నికలప్పుడు రాష్ట్రానికి వచ్చిన మోదీకి మళ్లీ ఎన్నికలు వస్తే తప్ప బెంగాల్ గుర్తుకు రాలేదని ఎద్దేవా చేశారు. 'తన పార్టీ సమగ్రతకు ప్రతిరూపమని మోదీ నమ్మబలికే ప్రయత్నం చేస్తుంటారు కానీ బెంగాల్ పరిస్థితులు వేరొక కథ చెబుతున్నాయి' అని జైరాం రమేశ్ అన్నారు. నారద కుంభకోణాన్ని గుర్తుచేస్తూ 2017, ఏప్రిల్‌లో టీఎంసీ అప్పటి ఎంపీ సువేందు అధికారిపై సీబీఐ ఎఫ్ఐఆర్ దాఖలు చేయడం, ఆయనను విచారించేందుకు లోక్‌సభ స్పీకర్ అనుమతిని కోరడాన్ని ప్రస్తావించారు. 2020 డిసెంబరులో సువేందు అధికారి బీజేపీలో చేరడంతో లోక్‌సభ నుంచి అనుమతి కోసం సీబీఐ నిరీక్షిస్తూ ఉండిపోవాల్సి వచ్చిందని జైరాం రమేశ్ అన్నారు. అలాగే మరొక టీఎంసీ నేత తాపస్ రాయ్‌పై మనీలాండరింగ్ కేసు నమోదు కాగా ఈ ఏడాది జనవరిలో ఈడీ దాడి చేసిందని, ఆపై మూడు నెలలకు అంటే మార్చిలో రాయ్ కాషాయ కండువా కప్పుకున్నారని, ఈడీ విచారణ స్తంభించిపోయిందని తెలిపారు. ప్రస్తుత ఎన్నికల్లో కోల్‌కతా ఉత్తర్ లోక్‌సభ స్థానం నుంచి రాయ్ పోటీ చేయబోతున్నారని జైరాం రమేశ్ తెలిపారు. 'అవినీతిని పారద్రోలదాం' అని నిసిగ్గుగా నినాదాలిస్తూ, ప్రచారం చేస్తున్న మోదీ... ఆ నేతలపై సీబీఐ, ఈడీ చర్యలు ఎందుకు ఆగిపోయాయో చెప్పగలరా? పశ్చిమ బెంగాల్‌లో కాషాయ వాషింగ్ మెషిన్ పూర్తిస్థాయిలో పని చేస్తున్నప్పుడు తమ పార్టీ భిన్నమైనదిగా బీజేపీ ఎలా నటించగలుగుతోంది?' అని నిలదీశారు. గతేడాది గూర్ఖాలాండ్ వివాదానికి పరిష్కారం కోసం డిమాండ్ చేస్తూ డార్జిలింగ్‌లో పెద్దఎత్తున ఆందోళనలు జరగడాన్ని జైరాం రమేశ్ గుర్తుచేశారు.

హేమమాలినిపై అనుచిత వ్యాఖ్యలు

వివాదంలో కాంగ్రెస్ నేత

న్యూదిల్లీ: ఎంపీ హేమమాలినిపై కాంగ్రెస్ నేత రణ్‌దీప్ సూర్జేవాలా అభ్యంతరకర వ్యాఖ్యలు చేయడంపై బీజేపీ మండిపడింది. మహిళలను కించపర్చారంటూ ఒక వీడియోను పోస్టు చేసింది. కాంగ్రెస్ ఎంపీ తీవ్ర అభ్యంతరకర వ్యాఖ్యలు చేశారని, అవి హేమమాలినినే కాకుండా మహిళలందరినీ అవమానించేలా ఉన్నాయని, కొద్దిరోజుల క్రితం కూడా ఆ పార్టీకి చెందిన నాయకురాలు ఇదే తరహా వ్యాఖ్యలు చేశారని, ఇది రాహుల్ గాంధీ కాంగ్రెస్ అని బీజేపీ ప్రతినిధి అమిత్ మాలవీయ ఆరోపించారు. ఈ వివాదంపై బీజేపీ మండి అభ్యర్థి కంగనా రనౌత్ స్పందించారు. తాము ప్రేమ దుకాణాలు తెరిచామని వారు చెబుతున్నారు. కానీ వారు తెరిచింది ద్వేష దుకాణాలు. మహిళల పట్ల నీచమైన అభిప్రాయం కలిగిన కాంగ్రెస్ నేతలు... ఓటమి తప్పదనే నిరాశతో మరింత దిగజారుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. తనకు వ్యతిరేకంగా మాట్లాడమే వారి పని అంటూ హేమమాలిని వ్యాఖ్యానించారు. అయితే ఈ విమర్శలను కాంగ్రెస్ తోసిపుచ్చింది. ప్రసంగంలోని కొన్ని అంశాలను మాత్రమే బయటపెట్టి, వక్రీకరించారని విమర్శించింది. ముందు పూర్తి ప్రసంగం చూడండి. మేము హేమమాలినిని గౌరవిస్తాం. ఆమె ధర్మేంద్రను వివాహం చేసుకున్నారని చెప్పాను. ఆమె తమ ప్రాంత కోడలు. తనకు ఎవరినీ కించపరిచే ఉద్దేశం లేదని సూర్జేవాలా ఓ వీడియోను పోస్టు చేశారు. ఎవరైనా ప్రజలకు జవాబుదారీగా ఉండాలని పోస్టులో పేర్కొన్నారు. ఇటీవల కాంగ్రెస్ నేత సుప్రియా శ్రీనేత్... కంగనా రనౌత్‌ను ఉద్దేశించి పెట్టిన పోస్టు దుమారం రేపిన సంగతి తెలిసిందే. దాంతో ఆమెకు సొంత పార్టీ నుంచే షాక్ తగిలింది. కేంద్ర ఎన్నికల సంఘం (ఈసీ) కూడా షోకాజ్ నోటీసులు జారీ చేసింది.

ఎన్నికల వేళలో...

ఎన్నికల వేళలో ఎన్నెన్నో చిత్రాలు
విన రండయా బాబు కన రండయా
మాయాబజార్ మహిమలూ కన రండయా
జగదేక వీర గాధలూ విన రండయా
॥ఎన్నికల వేళలో॥

మోదీజీ మోసాలూ వేసేటి వేషాలూ
జగనన్న పాలనలో మాఫియా జాలలూ
బాబుగారి రాజకీయ జడుపు జ్వరం భయాలూ
పవరుస్టారు పవరుఫుల్లు పాలిటిక్సు వ్యూహాలూ
॥ఎన్నికల వేళలో॥

మందు సీసా చిందేస్తూ వచ్చేనయా
బిర్యానీ ఘుప్పు ఘుప్పు లొచ్చేనయా
ఉబ్బేస్తూ రంగునోట్లూ వచ్చేనయా
చీరలూ సారెలూ వంటింటీ సామానూ
॥ఎన్నికల వేళలో॥

ఓటు మీట నొక్కిందాకా నువ్వూ ఓడ మల్లయా
తీరా పోలింగూ అయ్యాకా బోడి మల్లయా
లోకం పోకడ లన్నీ వినరండయా
ఎన్నికలా తీరుతెన్ను చూడండయా!
॥ఎన్నికల వేళలో॥

-కే. శరచ్చంద్ర జ్యోతిశ్రీ

రాహుల్ ఆస్తి రూ.20 కోట్లు... అనీరాజాది రూ.1.61కోట్లు

తిరువనంతపురం: కేరళలోని వయనాడ్ నుంచి సీపీఐ అభ్యర్థి అనీరాజా, కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ పోటీకి సిద్ధమయ్యారు. ఇప్పటికే ఇద్దరు నాయకులు నామినేషన్లు సమర్పించారు. ఈ స్థానానికి ప్రస్తుతం రాహుల్ ప్రాతినిధ్యం వహిస్తున్న విషయం తెలిసిందే. ఎన్నికల అధికారులకు సమర్పించిన అఫిడవిట్ల ప్రకారం రాహుల్ ఆస్తి మొత్తం రూ.20.4కోట్లు కాగా అనీరాజా ఆస్తి రూ.72లక్షలని వెల్లడైంది. అనీరాజా తన చేతిలో రూ.10వేల నగదు, రూ.62వేల బ్యాంకు డిపాజిట్లు, రూ.25వేలు విలువ చేసే ఆభరణాలు, రూ.71లక్షల వారసత్వ ఆస్తి ఉన్నట్లు వెల్లడించారు. మొత్తం ఆస్తులు రూ.1.61 కోట్లు, చరాస్థి రూ.89లక్షలు, స్థిరాస్తి రూ.72 లక్షలు, అప్పులు లేవని తెలిపారు. అలాగే తన మొత్తం ఆస్తి విలువ రూ.20.4 కోట్లు కాగా చరాస్థి రూ.9.24 కోట్లు,

స్థిరాస్తి రూ.11.15 కోట్లు, అప్పు రూ.49.7 లక్షలు, 18 పెండింగ్ ఎఫ్ఐఆర్‌లు, ఒక పరువు నష్టం కేసు ఉన్నట్లు రాహుల్ గాంధీ ప్రకటించారు. కాగా 2019లో రాహుల్ ఆస్తి రూ.15.89 కోట్లుగా 2024 నాటికి ఆయన ఆస్తి అనేక రెట్లు పెరిగింది. కాగా, మార్చి 15 నాటికి తన వద్ద రూ.55 వేల నగదు, రెండు బ్యాంకు ఖాతాల్లో రూ.26,25,157 ఉన్నట్లు రాహుల్ వెల్లడించారు. ఎంపీగా వేతనం, అద్దెలు, బ్యాంకు వడ్డీ, బాండ్లు, డివిడెండ్లు, మ్యూచువల్ ఫండ్స్, షేర్లు నుంచి ఆదాయం వచ్చినట్లు తెలిపారు. ఈక్విటీలు, మ్యూచువల్ ఫండ్లు, సేవింగ్ ఖాతాలు, గోల్డ్ బాండ్లు విలువ రూ.9.24 కోట్లుగా పేర్కొన్నారు. వీటిలో ఈక్విటీ షేర్లు రూ.4.33 కోట్లు, మ్యూచువల్ ఫండ్లు రూ.3.81 కోట్లు కాగా వాణిజ్య భవనాలు, వ్యవసాయ, వ్యవసాయేతర భూములు సహా స్థిరాస్తులు 11.15 కోట్లుగా వివరించారు. ఇదిలావుంటే కేరళలోని మొత్తం 20 స్థానాలకు ఈనెల 26న రెండో దశలో భాగంగా పోలింగ్ జరగనుంది. నామినేషన్ గడువు గురువారంతో ముగిసింది.

పుస్తకాలు చదువుతూ...ఖైదీలకు దూరంగా...

తీహార్ జైలులో కేజ్రీవాల్ దినచర్య

న్యూదిల్లీ: దిల్లీ మద్యం విధానానికి సంబంధించిన కేసులో అరెస్టైన దిల్లీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్ తీహార్ జైల్లో ఓ చిన్న గదిలో విచారణ ఖైదీగా ఉన్నారు. జైలు ఉన్న ఆయన... ధ్యానం, యోగాతోపాటు పుస్తకాలు చదువుకుంటున్నట్లు విశ్వసనీయ వర్గాలు వెల్లడించాయి. రోజులో రెండుసార్లు ధ్యానం, యోగా చేస్తున్న కేజ్రీవాల్... ఎక్కువ సమయం పుస్తకాలతోనే గడపుతున్నట్లు తెలిపాయి. ఉదయం, సాయంత్రం గంటన్నరపాటు ఆయన యోగా, ధ్యానం చేస్తున్నారు. రామాయణం, భగవద్గీత, జర్నలిస్టు నీరజా చౌదరీ రాసిన 'హౌ ప్రైమ్ మినిస్టర్స్ డిసైడ్' పుస్తకాలు చదువుతూ సెల్‌లో ఉన్న ఛైర్‌పై కూర్చొని ఏదో రాసుకుంటున్నట్లు కనిపించింది. గదిలో ఉన్న టీవీలో 20 ఛానళ్లు వీక్షించే వీలున్నప్పటికీ దాన్ని చూసేందుకు ఆయన అంతగా ఇష్టపడటం లేదని జైలు వర్గాలు వెల్లడించాయి. జైలుకు వెళ్లిన మొదటిరోజు నీరసంగా కనిపించిన కేజ్రీవాల్‌కు మరుసటి రోజు చక్కెర స్థాయిలు సాధారణ స్థితికి వచ్చినట్లు పేర్కొన్నాయి. జైలు నిబంధనల ప్రకారం, అందరి ఖైదీల మాదిరిగానే కేజ్రీవాల్‌కు తన సెల్‌ను శుభ్రం చేసుకునేందుకుగాను ఒక చీపురు, బకెట్, చిన్న క్లాత్ అందించామని, న్యాయస్థానం ఆదేశాల మేరకు ఒక టేబుల్, కుర్చీ, ఎలక్ట్రిక్ కెటిల్ కూడా అందుబాటులో ఉంచామని జైలు అధికారులు తెలిపారు. సెల్‌లో అమర్చిన రెండు సీసీ కెమెరాలతో ఆయనను 24 గంటలూ పర్యవేక్షిస్తున్నామని, సెల్ బయట ఉన్న చిన్న లాబీలో నడిచేందుకు వెసులుబాటు ఉందని వెల్లడించారు. అయితే, భద్రతా కారణాల వల్ల తోటి ఖైదీలతో కలిసేందుకు ఆయనను అంగీకరించడం లేదని తెలుస్తోంది. వార్డు బయట సీఆర్‌పీఎఫ్, తమిళనాడు స్పెషల్ పోలీస్‌లతో కూడిన క్విక్ రియాక్షన్ టీమ్ నిరంతరం పర్యవేక్షిస్తున్నది. తన న్యాయవాదిని కలిసేందుకు వెళ్లే సమయంలో ఈ బృందం కేజ్రీవాల్‌కు తోడుగా ఉంటుంది.

స్కిల్ కేసులో చార్జిషీటు దాఖలు

చంద్రబాబు, అచ్చెన్నాయుడు, గంటా పాత్ర ఉన్నట్లు ఏసీబీ నిర్ధారణ

విశాలాంధ్ర బ్యూరో- అమరావతి: స్కిల్ డెవలప్‌మెంట్ కేసులో అవినీతి నిరోధక శాఖాధికారులు గురువారం విజయవాడ ఏసీబీ కోర్టులో చార్జిషీటు దాఖలు చేశారు.

చంద్రబాబు నాయుడు, కె.అచ్చెన్నాయుడు, గంటా శ్రీనివాసరావు, డాక్టర్ కె.లక్ష్మీనారాయణ తదితరుల పాత్ర ఉన్నట్లు చార్జిషీట్‌లో పొందుపరిచారు. యువతలో నైపుణ్యత పెంచేందుకు కేటాయించిన నిధులను చంద్రబాబు పక్కదారి పట్టించేందుకు కుట్ర పన్నారని పేర్కొన్నారు. ఈ కుట్రలో వీరి పాత్ర కూడా ఉందన్నారు. రూ.3,300 కోట్లకు పెంచి ఆ రేటుతో ఆమోదించారని చెప్పారు. అయితే ఈ స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్‌ల ఏర్పాటు చేయడానికి సీమెన్స్, డిజైన్‌టెక్‌లకు రూ.371 కోట్ల గ్రాంట్‌ను రాష్ట్ర ప్రభుత్వం ఇస్తున్నట్లు నాటి మంత్రి అచ్చెన్నాయుడు ఏకకాలంలో అవగాహన ఒప్పందానికి ఆమోదం తెలిపారన్నారు. చంద్రబాబు, అచ్చెన్నాయుడు రూ.371లో ఎక్కువ భాగాన్ని స్వాహా చేశారని వివరించారు. "సీమెన్స్" బ్రాండ్ పేరు ఉపయోగించి రూ.3,300 ఉప ప్రాజెక్ట్‌ను ఏర్పాటు చేసినట్లు తప్పుడు ప్రచారం చేశారు. ప్రభుత్వ ఖజానా నుంచి కోట్లాది రూపాయల సొమ్ము దుర్వినియోగమైంది. జీవో 4 స్ఫూర్తికి విరుద్ధంగా, సీమెన్స్, డిజైన్‌టెక్ అందించిన గ్రాంట్-ఇన్-ఎయిడ్‌కి అనులోమానుపాతంలో డబ్బును విడుదల చేయలేదు. పైగా చంద్రబాబు అన్నింటిని విడుదల చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ కుంభకోణం గురించి "విజిల్ బ్లోయర్" అవినీతి నిరోధక బ్యూరోకి నివేదించినప్పటికీ, 2018 జూన్‌లో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఎలాంటి చర్యలు చేపట్ట లేదు. అంతేకాకుండా ఈ ప్రాజెక్టుకు సంబంధించిన కొన్ని ముఖ్యమైన నోట్ ఫైల్స్ సచివాలయం నుంచి తొలగించబడ్డాయి. ఈ కేసులో ఎఫ్ఐఆర్‌ను రద్దు చేసేందుకు సుప్రీంకోర్టు నిరాకరించింది. ఛార్జిషీట్ నిర్ధారణల కాపీని ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్‌కు సమర్పించడం జరిగిందని ఆ చార్జీ షీట్‌లో ఏసీబీ అధికారులు పొందు పరిచారు.

ఒక్కశాతం నిజమున్నా సిగ్గుచేటు

సందేశ్‌ఖలి ఘటనలపై హైకోర్టు ఘాటు వ్యాఖ్యలు

పౌరుల భద్రతకు ప్రభుత్వానిదే బాధ్యతంటూ ఆగ్రహం

కోల్‌కతా: సందేశ్‌ఖలి ఘటనల్లో ఒక్కశాతం నిజమున్నా వంద శాతం సిగ్గుచేటైన విషయమని కలకత్తా హైకోర్టు వ్యాఖ్యానించింది. పశ్చిమ బెంగాల్‌లోని సందేశ్‌ఖలీ గ్రామంలో అధికార తృణమూల్ కాంగ్రెస్ (టీఎంసీ)కు చెందిన షాజహాన్ షేక్, అతడి అనుచరులు.. మహిళలపై అకృత్యాలకు పాల్పడటమే గాక, వారి భూములను బలవంతంగా లాక్కున్నట్లు వచ్చిన ఆరోపణలు దేశవ్యాప్తంగా కలకలం రేపిన సంగతి విదితమే. ఈ ఘటనలపై దాఖలైన పిటిషన్లపై విచారణ జరిపిన సందర్భంగా ప్రధాన న్యాయమూర్తి టీఎస్ శివజ్ఞానం నేతృత్వంలోని ధర్మాసనం టీఎంసీ ప్రభుత్వంపై ఆగ్రహం వ్యక్తం చేసింది. పౌరుల భద్రతకు ముప్పు ఏర్పడితే... అందుకు ప్రభుత్వానిదే పూర్తి బాధ్యత అని స్పష్టంచేసింది. ఈ వివాదంపై దర్యాప్తు జరిపించాలని దాఖలైన అఫిడవిట్‌లపై స్పందిస్తూ... 'అఫిడవిట్ లో పేర్కొన్న ఒక్క విషయం నిజమైనా, అందులో ఒక శాతం వాస్తవమున్నా అది 100శాతం సిగ్గుచేటు. అధికార పార్టీ, స్థానిక యంత్రాంగం అందుకు పూర్తి నైతిక బాధ్యత వహించాలి" అని ఘాటు వ్యాఖ్యలు చేసింది. షేక్ షాజహాన్ తరపు న్యాయవాదికి కూడా కోర్టు చీవాట్లు పెట్టింది. "55 రోజులు మీరు పరారీలో ఉన్నారు... దాగుడు మూతలు ఆడారు. ఆ తర్వాత మీరు అస్పష్టమైన వైఖరిని తీసుకున్నారు. కేవలం మీరు కళ్లు మూసుకుంటే ప్రపంచం చీకటిగా మారదు" అని ప్రధాన న్యాయమూర్తి అన్నారు. షాజహాన్ తరపు న్యాయవాది స్పందిస్తూ... 'బెయిల్ పిటిషన్ పెండింగ్‌లో ఉండగా... నేను పరారీలో ఉన్నట్లు చెప్పబడింది." నిందితుడు షాజహాన్ షేక్ 55 రోజుల పాటు షాజహాన్ పరారీలో ఉండడంపై కోర్టు అసహనం వ్యక్తంచేసింది. ఫిబ్రవరిలో పోలీసులు అతడిని అరెస్టు చేసిన సంగతి తెలిసిందే. చివరకు ఈ కేసు లో న్యాయస్థానం తీర్పును రిజర్వ్ చేసింది. మునుపటి విచారణలలో కోర్టు బెంగాల్ పోలీసులు పక్షపాతంగా వ్యవహరించారని పేర్కొంది. షేక్ షాజహాన్‌పై ఆరోపణలపై పారదర్శక విచారణ కోసం పిలుపునిచ్చింది. 'ఇంతకంటే మంచి కేసు మరొకటి ఉండదు... దానిని బదిలీ చేయవలసి ఉంటుంది సీబీఐ దర్యాప్తు చేయవలసి ఉంటుంది' అని తెలిపింది. ఇదిలాఉంటే, షాజహాన్ అకృత్యాలకు ఎదురొడ్డి నిలిచిన రేఖా పత్రా.. అక్కడి మహిళలు చేపట్టిన ఆందోళనలకు నాయకత్వం వహించారు. అతడి అనుచరుల బెదిరింపులకు లొంగకుండా ధైర్యంగా ముందుకొచ్చి పోలీసులకు ఫిర్యాదు చేయడమే గాక.. కోర్టులో వాంగ్మూలం ఇచ్చారు. ఆమెకు బెంగాల్‌లోని బసిర్‌హట్ స్థానం నుంచి బీజేపీ టికెట్ ఇచ్చిన సంగతి తెలిసిందే. సార్వత్రిక ఎన్నికల ముంగిట మమతాబెనర్జీకి సందేశ్‌ఖలీ వ్యవహారం ప్రతికూలంగా పరిణమించే అవకాశం ఉందని రాజకీయ విశ్లేషకులు అంచనా వేస్తున్నారు.

ఐఏఎఫ్ అపాచీ హెలికాప్టర్‌లో లోపం

లడాఖ్‌లో అత్యవసరంగా దించివేత

న్యూదిల్లీ: లడాఖ్‌లో నిర్వహిస్తున్న యుద్ధ శిక్షణలో అపశ్రుతి చోటుచేసుకొంది. వాయుసేనకు చెందిన అపాచీ అటాక్ హెలికాప్టర్ దెబ్బతింది. దీంతో అత్యవసరంగా దింపివేయాల్సి వచ్చింది. కఠిన భౌగోళిక పరిస్థితుల కారణంగా ఈ ప్రమాదం చోటుచేసుకున్నట్లు భారత వాయుసేన (ఐఏఎఫ్) తెలిపింది. కాగా ఇందులో ఉన్న ఇద్దరు పైలట్లు సురక్షితంగా బయటపడ్డారు. హెలికాప్టర్‌ను సమీపంలోని ఐఏఎఫ్ స్థావరానికి చేర్చారు. ఈ ఘటనకు గల కారణాలను కనుగొనేందుకు ఐఏఎఫ్ కోర్ట్ ఆఫ్ ఎంక్వైరీ చేపట్టింది. గత సంవత్సరం మేలో కూడా ఈ రకానికి చెందిన హెలికాప్టర్ మధ్యప్రదేశ్‌లోని భింద్ వద్ద అత్యవసరంగా ల్యాండ్ అయింది. అప్పట్లో సాంకేతిక లోపాన్ని గుర్తించడంతో పైలట్లు దీనిని అక్కడి పొలాల్లో అత్యవసరంగా దించేయగలిగారు. 2020లో కూడా హోషియార్‌పూర్‌లో ఒక హెలికాప్టర్ ఇలాగే ల్యాండ్ అయింది. ప్రపంచంలోనే అత్యుత్తమ అటాక్ హెలికాప్టర్‌గా అపాచీకి పేరుంది. వీటి కొనుగోలుకు 2015లో భారత్, అమెరికాతో ఒప్పందం చేసుకొంది. దీనివిలువ రూ.13,952 కోట్లు. మొత్తం 22 అత్యాధునిక అపాచీ యుద్ధ హెలికాప్టర్లు మన దళాల చేతికి వచ్చాయి. తాజాగా సైన్యం కూడా ఆరు అపాచీలను కొనడానికి ప్రయత్నాలు చేస్తోంది. దీనికోసం 2020లో రూ.5,691 కోట్లు విలువైన ఒప్పందం కుదిరింది. ఈ హెలికాప్టర్లను ఎగిరే యుద్ధ ట్యాంకులుగా యుద్ధ నిపుణులు పేర్కొంటారు.

సోనియా బాధితుడు రాహుల్: కంగన

న్యూదిల్లీ: కాంగ్రెస్ నేతలు సోనియాగాంధీ, రాహుల్ గాంధీపై బాలీవుడ్ నటి, మండి నియోజకవర్గ బీజేపీ అభ్యర్థి కంగనా రనౌత్ అనుచిత వ్యాఖ్యలు చేశారు.తన తల్లి ఆకాంక్షలకు రాహుల్ గాంధీ బాధితుడయ్యారని అన్నారు. ఓ జాతీయ మీడియాతో ఆమె మాట్లాడుతూ '3 ఇడియట్స్' సినిమాలో చూసినట్టు కుటుంబసభ్యుల వల్ల పిల్లలు ఇబ్బందిపడుతుంటారని, రాహుల్‌ది కూడా ఇదే పరిస్థితి అని, ఒత్తిడి లేకుండా వారి ఇష్టాలకు తగ్గట్టుగా సొంతంగా జీవించేందుకు రాహుల్, ప్రియాంకకు స్వేచ్ఛ ఉండాలని అన్నారు. రాహుల్ నటనలో ప్రయత్నించి ఉంటే.. మంచి నటుడు అయ్యుండేవారని వ్యంగ్యాస్త్రాలు సంధించారు. రాహుల్ వయసు 50 సంవత్సరాలు దాటినప్పటికీ.. ప్రతిసారీ యువనేతగా రీలాంచ్ అవుతుంటారన్నారు. ఆయన ఒత్తిడికి గురవుతున్నారని, ఒంటరితనంతో బాధ పడుతున్నారని తాను భావిస్తున్నట్లు చెప్పారు. కంగనా రనౌత్ ఓవైపు సినిమాల్లో నటిస్తూనే రాజకీయాల్లోకి అడుగుపెట్టారు. హిమాచల్ ప్రదేశ్‌లోని మండి లోక్‌సభ అభ్యర్థిగా బీజేపీ తరఫున ఆమె పోటీ చేస్తున్నారు. మోదీ పాలనపై తరచూ ప్రశంసలు కురిపిస్తుంటారు. తమ గురించి నిరంతరం ఆలోచించే నాయకుడు మోదీ రూపంలో తొలిసారి దొరికినట్లు మహిళలు భావిస్తున్నారని ఎన్నికల ప్రచారంలో చెప్పుకుంటున్నారు.

ఓటరు ఐడీ లేకుండానే ఓటు వేయొచ్చు

ప్రత్యామ్నాయ మార్గాలు సూచించిన ఈసీ

న్యూదిల్లీ: ఓటరు గుర్తింపుకార్డు లేకపోవడం ఓటు వేయడానికి ఎటువంటి అడ్డంకి కాబోదని ఎన్నికల సంఘం ప్రకటించింది. అర్హత ఉన్న ప్రతి ఒక్కరూ ఓటు వేసేందుకు ప్రత్యామ్నాయ మార్గాలను సూచించింది. అది ఎలాగో సామాజిక మాధ్యమం 'ఎక్స్' వేదికగా వివరాలు వెల్లడించింది. ఓటు వేసేందుకు ఓటరు ఐడీ కార్డు తప్పనిసరిగా ఉండాలా? లేనివారు ఏం చేయాలి? ఇలాంటి ప్రశ్నలకు ఎన్నికల సంఘం ఇప్పటికే స్పష్టత ఇచ్చింది. ఓటరు జాబితాలో పేరున్న వారంతా ఓటరు ఐడీ అందుబాటులో లేకున్నా, ఓటు వేయవచ్చని ఈసీ స్పష్టం చేసింది. ఓటు వేయడానికి ముందు పోలింగ్ కేంద్రంలో ఓటరు గుర్తింపు కార్డులను చూపించాల్సి ఉంటుంది. లేదంటే ఈ కింద తెలిపిన 12 ప్రత్యామ్నాయ ఫొటో గుర్తింపు కార్డుల్లో ఏదైనా ఒకటి చూపించి ఓటు వేయవచ్చు.

ఓటరు ఐడీ లేనివారు ఈ కింది వాటిలో ఏదైనా ఒకటి చూపించవచ్చు:

ఆధార్ కార్డు, డ్రైవింగ్ లైసెన్స్, పాన్ కార్డు, ఉపాధి హామీ కార్డు, పాస్ పోర్టు, బ్యాంక్ లేదా పోస్టాఫీస్ జారీ చేసిన ఫొటోతో కూడిన పాస్ బుక్, కార్మికశాఖ మంజూరు చేసిన హెల్త్ ఇన్సూరెన్స్ కార్డు, ఎన్‌పీఆర్ స్మార్ట్ కార్డ్, ఫొటోతో కూడిన పెన్షన్ పత్రం, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఉద్యోగులకు జారీ చేసిన సర్వీస్ ఐడీ కార్డులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీల అధికార గుర్తింపు కార్డులు, దివ్యాంగులకు జారీచేసిన ఐడీ కార్డుల్లో ఏదొకటి చూపించి ఓటు హక్కును వినియోగించుకోవచ్చు. ఇక ప్రవాసాంధ్రులు ఒరిజినల్ పాస్ పోర్టును పోలింగ్ సిబ్బందికి చూపించి ఓటును వినియోగించుకోవాల్సి ఉంటుంది.

ఓటరు జాబితాలో పేరు ఉందో లేదో తెలుసుకోవడం ఎలా?

ఒకవేళ ఓటరు జాబితాలో మీ పేరు ఉందో లేదో తెలుసుకోవాలంటే https://electoralsearch.eci.gov.in వెబ్‌సైట్‌లోకి వెళ్లి మీ వివరాలను ఎంటర్ చేసి చెక్ చేసుకోవచ్చు. ఒకవేళ మీ దగ్గర ఫిజికల్ ఓటరు ఐడీ కార్డు లేకపోయినా కంగారు పడాల్సిన అవసరం లేదు. ఇలాంటి వారి కోసం ఎన్నికల సంఘం మరో ఆప్షన్?తో భరోసా కల్పించింది. %జుజ వ-జ్యూ×జ% ద్వారా పౌరులు తమ ఓటరు ఐడీ కార్డు డిజిటల్ కాపీ పీడీఎఫ్?తో డౌన్?లోడ్ చేసుకోవచ్చు. మీరు దానిని డిజిలాకర్?కు అప్?లోడ్ కూడా చేసుకోవచ్చు. https://voters. eci.gov.in/login వెబ్ సైట్‌కు వెళ్లి ఓటరు కార్డు డిజిటల్ కాపీని ప్రింట్ తీసుకుని పోలింగ్ బూత్‌కు వెళ్లవచ్చు.

కాంగ్రెస్‌ను వీడిన

సంజయ్, గౌరవ్ వల్లభ్

న్యూదిల్లీ: ఉత్తర ముంబై మాజీ ఎంపీ సంజయ్ నిరుపమ్, పార్టీ అధికారిక ప్రతినిధి గౌరవ్ వల్లభ్ కాంగ్రెస్‌కు రాజీనామా చేశారు. గౌరవ్ వల్లభ్ గురువారం పార్టీకి రాజీనామా చేస్తున్నట్లు ప్రకటించారు. సంబంధిత లేఖను సామాజిక మాధ్యమం 'ఎక్స్'లో పోస్టు చేశారు. 'ప్రస్తుతం పార్టీ ఏ దిశకు వెళుతోందో కూడా తెలియడంలేదు. ఇది నాకు ఇబ్బందికరంగా మారింది. నేను సనాతనానికి వ్యతిరేకంగా నినాదాలు చేయలేను... సంపద సృష్టికర్తలను నిందించలేను. నేను పార్టీలో అన్ని పదవులు, ప్రాథమిక సభ్యత్వానికి రాజీనామా చేస్తున్నా' అని పేర్కొన్నారు. పార్టీ క్షేత్రస్థాయిలో బాగా దెబ్బతిందని రాజీనామా లేఖలో పేర్కొన్నారు. కార్యకర్తలకు నాయకులకు మధ్య అంతరాన్ని పూరించడం కష్టంగా మారిందన్నారు. కిందిస్థాయిలోని వారు తమ నాయకులకు నేరుగా సలహాలు ఇవ్వలేనప్పుడు ఎటువంటి సానుకూల మార్పు సాధ్యంకాదని తెలిపారు. గౌరవ్ 2023లో రాజస్థాన్ నుంచి ఎన్నికల బరిలో నిలిచి ఓటమి పాలయ్యారు.

రాజీనామా లేఖ చూశాకే పార్టీ చర్యలు తీసుకుంది: సంజయ్

మహారాష్ట్రలో శివసేన (ఉద్ధవ్) వర్గంతో సీట్ల సర్దుబాటుపై అసంతృప్తిగా ఉన్న సీనియర్ నేత సంజయ్ నిరుపమ్‌పై కాంగ్రెస్ పార్టీ నిన్న రాత్రి ఆరేళ్లపాటు బహిష్కరణ వేటు వేసింది. దీనిపై ఆయన స్పందిస్తూ... తాను పార్టీకి రాజీనామా లేఖను పంపిన తర్వాతే చర్యలు తీసుకున్నారని పేర్కొన్నారు. ఈ మేరకు తన రాజీనామా లేఖ ఈమెయిల్ కాపీ స్క్రీన్ షాట్‌ను ఆయన సామాజిక మాధ్యమం 'ఎక్స్'లో పోస్ట్ చేశారు. సంజయ్ గతంలో ఉత్తర ముంబై లోక్‌సభ స్థానం నుంచి ఎంపీగా విజయం సాధించారు. ఈ స్థానానికి శివసేన (ఉద్ధవ్) వర్గం అభ్యర్థిని ప్రకటించడంతో ఆయన రాష్ట్ర కాంగ్రెస్‌పై విమర్శలు మొదలుపెట్టారు. ముంబైలో ఆ పార్టీ చర్యలను ఆమోదిస్తూ పోతే... కాంగ్రెస్ దెబ్బతింటుందని హెచ్చరించారు. మరో వైపు హస్తం పార్టీ కూడా సంజయ్ పేరును స్టార్ ప్రచారకుల జాబితా నుంచి తొలగించింది.

చంద్రయాన్-3 విజయంతో బిలియనీర్ల జాబితాలోకి రమేశ్ కున్హికన్నన్

న్యూదిల్లీ: చంద్రయాన్-3 విజయంతో కర్నాటకకు చెందిన కేనెస్ టెక్నాలజీ వ్యవస్థాపకుడు రమేశ్ కున్హికన్నన్‌ను ఐశ్వర్యం వరించింది. ఫోర్బ్స్ విడుదల చేసిన తాజా బిలియనీర్ల జాబితాలో ఆయనకు చోటు దక్కింది. అంతరిక్ష రంగంలో సరికొత్త చరిత్రను లిఖిస్తూ గతేడాది భారత్ ప్రయోగించిన 'చంద్రయాన్-3, జాబిల్లి దక్షిణ ధ్రువంపై దిగ్విజయంగా దిగిన సంగతి తెలిసిందే. ఈ ఘనత సాధించిన తొలి దేశంగా భారత్ పేరు ప్రపంచమంతా మార్మోగింది. ఫోర్బ్స్ 2024 ప్రపంచ బిలియనీర్ల లిస్ట్ ను తాజాగా విడుదల చేశారు. ఇందులో భారత్ నుంచి 25 మంది తొలిసారిగా ఈ జాబితాలో చోటు దక్కించుకున్నారు. వీరిలో రమేశ్ ఒకరు. ఫోర్బ్స్ నివేదిక ప్రకారం ఆయన నికర సంపద విలువ 1.2 బిలియన్ డాలర్లుగా ఉంది. చంద్రయాన్-3 ప్రయోగం తర్వాత ఆయన సంపద విలువ భారీగా పెరిగిందట. రమేశ్ కున్హికన్నన్... మైసూరులోని నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇంజినీరింగ్‌లో (ఎలక్ట్రికల్) బ్యాచిలర్ డిగ్రీ పూర్తి చేశారు. 1988లో 'కేనెస్ టెక్నాలజీ' పేరుతో ఎలక్ట్రానిక్ పరికరాల ఉత్పత్తి సంస్థను ప్రారంభించారు. 1996లో ఆయన భార్య సవిత కంపెనీలో చేరారు. ప్రస్తుతం ఆమె సంస్థ ఛైర్‌పర్సన్‌గా ఉండగా రమేశ్ మేనేజింగ్ డైరెక్టర్‌గా వ్యవహరిస్తున్నారు. గతేడాది ఇస్రో ప్రయోగించిన చంద్రయాన్-3 మిషన్‌లోని రోవర్, ల్యాండర్‌కు విద్యుత్‌ను సరఫరా చేసే ఎలక్ట్రానిక్ సిస్టమ్స్‌ను కేనెస్ కంపెనీ అందించింది. ఆ ప్రయోగ విజయం తర్వాత స్టాక్ మార్కెట్లలో సంస్థ షేర్లు రాణించాయి. 2022 నవంబరులో లిస్ట్ అయిన విలువతో పోలిస్తే షేరు ధర దాదాపు మూడింతలు పెరిగింది. ఈ కంపెనీలో రమేశ్‌కు 64శాతం వాటాలున్నాయి. దీంతో ఆయన నికర సంపద ఒక్కసారిగా పెరిగి బిలియనీర్ల జాబితాలో చేరారు.

నాడు ప్రత్యర్థికి ఓటు వేయాలని కోరిన వాజ్‌పేయి?

న్యూదిల్లీ: దేశంలో ఎక్కడ చూసినా లోక్‌సభ ఎన్నికల సందడే కనిపిస్తోంది. ఎన్నికలు ప్రజాస్వామ్య పండుగలని అంటుంటారు. దేశంలో 1957లో జరిగిన రెండో లోక్‌సభ ఎన్నికలను ఇప్పటికీ ఏదోవిధంగా గుర్తుకు తెచ్చుకుంటారు. ఈ ఎన్నికల్లో పలు వింత వైనాలు చోటుచేసుకున్నాయి. నాడు జన్‌సంఘ్ నేతగా ఉన్న అటల్ బిహారీ వాజ్‌పేయి కాంగ్రెస్‌ను ఓడించేందుకు ఒక ప్లాన్ చేశారు. 1957లో మథుర, బల్‌రాంపూర్, లక్నో ఈ మూడు చోట్ల నుంచి పోటీ చేశారు. బలరాంపూర్ లోక్‌సభ స్థానం నుంచి గెలుపొందిన ఆయన పార్లమెంటుకు చేరుకున్నారు. తన 60 ఏళ్ల రాజకీయ జీవితంలో ఆయన ఐదుసార్లు ఎన్నికల్లో ఓటమిని ఎదుర్కొన్నారు. వాజ్‌పేయి తొలిసారిగా మథుర లోక్‌సభలో ఘోర పరాజయాన్ని చవిచూశారు. నాడు రాజా మహేంద్ర ప్రతాప్ సింగ్ స్వతంత్ర అభ్యర్థిగా ఎన్నికల్లో పోటీ చేశారు. ఆయన కారణంగానే వాజ్‌పేయి ఈ ఓటమిని చవిచూడాల్సి వచ్చింది. అయితే వాజ్‌పేయి ఈ ఓటమిని తనకు తానుగా ఆహ్వానించుకున్నారని రాజకీయవర్గాల్లో చెప్పుకుంటారు. ఈ ఎన్నికల్లో బహిరంగ సభలకు వెళ్లినప్పుడు తనకు కాకుండా తన ప్రత్యర్థి రాజా మహేంద్ర ప్రతాప్ సింగ్‌కు ఓటువేయాలని కోరేవారు. ఇలా తాను వెళ్లిన ప్రతీచోటా ప్రత్యర్థికి ఓటు వేయాలని కోరారట. ఎవరైనా అదేమిటని అడిగితే ఆయన తన లక్ష్యం ఎన్నికల్లో గెలవడం కాదని, కాంగ్రెస్ ఘోర పరాజయాన్ని నిర్ధారించడమేనని చెప్పుకొచ్చేవారు. నాటి లోక్‌సభ ఎన్నికల్లో స్వతంత్ర అభ్యర్థి రాజ మహేంద్ర ప్రతాప్ విజయం సాధించారు. ఆయనకు 95,202 ఓట్లు వచ్చాయి. కాంగ్రెస్ అభ్యర్థి దిగంబర్ సింగ్ 69,209 ఓట్లతో రెండో స్థానంలో నిలిచారు. జనసంఘ్‌కు చెందిన వాజ్‌పేయి నాలుగో స్థానంలో నిలిచారు. ఆయనకు కేవలం 10 శాతం ఓట్లు మాత్రమే వచ్చాయి.

విష సర్పాన్నైనా నమ్మొచ్చుగానీ బీజేపీని కాదు

దేశాన్ని సర్వనాశనం చేస్తున్న కాషాయ పార్టీ: మమత

కోల్‌కతా: విష సర్పాన్నైనా నమ్మవచ్చుగానీ కాషాయ క్యాంపును కాదని బెంగాల్ సీఎం, టీఎంసీ అధినేత్రి మమతా బెనర్జీ ఉద్ఘాటించారు. లోక్‌సభ ఎన్నికల ప్రవర్తనా నియమావళిని బీజేపీ అతిక్రమిస్తోందని ఆరోపించారు. మమత గురువారం కూచ్‌బెహార్ ర్యాలీలో మాట్లాడుతూ బీజేపీపై విరుచుకుపడ్డారు. కేంద్ర దర్యాప్తు సంస్థలు, బీఎస్ఎఫ్, సీఐఎస్ఎఫ్ కూడా బీజేపీ కనుసన్నల్లో పని చేస్తున్నాయని, వీటిపై ఎన్నికల సంఘం దృష్టి పెట్టాలని, అన్ని పార్టీలకు ఎన్నికల్లో సమాన అవకాశాలకు హామీనివ్వాలన్నారు. ఆవాస్ యోజనలో మళ్లీ పేర్లు నమోదు చేయడం ఎందుకు... దీని వెనుక బీజేపీ కుట్ర దాగివుందని వ్యాఖ్యానించారు. దేశాన్ని బీజేపీ సర్వనాశనం చేస్తోందని నిప్పులు చెరిగారు. కేంద్ర సంస్థల బెదిరింపులకు తలొగ్గమన్నారు. ఎన్నికలకు ముందు బీఎస్ఎఫ్ జవాన్లు మిమ్మల్ని వేధిస్తేగనుక పోలీసులకు ఫిర్యాదు చేయండంటూ కూచ్‌బెహార్ మహిళలకు మమత పిలుపునిచ్చారు. ఒక దేశం, ఒక పార్టీ సిద్ధాంతానికే బీజేపీ కట్టుబడిందన్నారు. నేరచరితుడికి హోం వ్యవహారాల శాఖ సహాయ మంత్రిగా నియమించడం దేశానికి సిగ్గుచేటని నితీశ్ ప్రమాణిక్‌నుద్దేశించి వ్యాఖ్యానించారు. బీజేపీ 'జుమ్లా' పార్టీ, సీఏఏపై అబద్ధాలు ప్రచారం చేస్తోందని దుయ్యబట్టారు. సీఏఏ ఉచ్చులో చిక్కుకోవద్దని ప్రజలకు హితవు పలికారు. సీఏఏ, ఎన్ఆర్‌సీని బెంగాల్‌లో అమలు కానివ్వబోమని హామీనిచ్చారు. దరఖాస్తు చేసుకుంటే విదేశీయులు అవుతారు జాగ్రత్త అంటూ ప్రజలను హెచ్చరించారు. బెంగాల్‌లో ఇండియా కూటమి లేదని, బీజేపీని ఓడించాలంటే కాంగ్రెస్‌కుగానీ సీపీఎంకుగానీ ఒక్క ఓటు వేయొద్దని రాష్ట్ర ప్రజలకు మమతా బెనర్జీ పిలుపునిచ్చారు.

సిలబస్ మార్పు, కొత్త పాఠ్య పుస్తకాలు

ఎన్‌సీఈఆర్టీ కీలక ప్రకటన

న్యూదిల్లీ: నూతన విద్యా సంవత్సరంలో సిలబస్ మార్పు, పాఠ్య పుస్తకాల విడుదలపై ఎన్‌సీఈఆర్టీ (నేషనల్ కౌన్సిల్ ఆఫ్ ఎడ్యుకేషనల్ రీసెర్చ్ అండ్ ట్రైనింగ్) కీలక ప్రకటన చేసింది. మూడు, ఆరు తరగతులకు మాత్రమే కొత్త సిలబస్‌తో పాఠ్య పుస్తకాలు విడుదల చేయనున్నట్లు తెలిపింది. మూడో తరగతి పుస్తకాలు ఏప్రిల్ చివరివారం, ఆరో తరగతి పుస్తకాలను మేలో విడుదలవుతాయని వెల్లడించింది. అలాగే ఒకటి, రెండు, ఏడు, ఎనిమిది, 10, 12 తరగతులకు సంబంధించి 2023-24 ఎడిషన్స్ పాఠ్య పుస్తకాలు 1.21 కోట్ల కాపీలు దేశవ్యాప్తంగా విడుదల చేసినట్లు తెలిపింది. మారిన కరికులమ్‌కు అనుగుణంగా ఆరో తరగతి విద్యార్థులను ప్రిపేర్ చేసేందుకు వీలుగా ఉపాధ్యాయుల కోసం ఎన్‌సీఈఆర్టీ పోర్టల్‌లో బ్రిడ్జ్ కోర్సు అందుబాటులో ఉందని తెలిపింది. ఈమేరకు 'ఎక్స్' వేదికగా ట్వీట్ చేసింది. "పాఠశాల విద్య కోసం నేషనల్ కరికులమ్ ఫ్రేమ్‌వర్క్ 2023ను అనుసరించి 2024-25 విద్యా సంవత్సరంలో మూడు, ఆరు తరగతులకు మాత్రమే ఎన్‌సీఈఆర్టీ కొత్త పాఠ్య పుస్తకాలను తీసుకొస్తోంది. మూడో తరగతి పాఠ్య పుస్తకాలు ఏప్రిల్ చివరి వారంలో, ఆరో తరగతి పాఠ్య పుస్తకాలు మే మధ్యలో విడుదల చేస్తాం. నాలుగు, ఐదు, తొమ్మిది, 11వ తరగతులకు బఫర్ స్టాక్ సిద్ధంగానే ఉంది. అన్ని పాఠ్య పుస్తకాల డిజిటల్ కాపీలు మా వెబ్‌సైట్‌తో పాటు దీక్ష, ఈ-పాఠశాల పోర్టల్, యాప్‌లలో ఉచితంగా లభిస్తాయి" అని ఎన్‌సీఈఆరీ పేర్కొంది. మరోవైపు ఆయా తరగతులకు సంబంధించి 27.58 లక్షల పుస్తకాలు విడుదలయ్యాయని... ఈ తరగతులకు కొత్తగా మరో 1.03 కోట్ల కాపీలను ప్రింటింగ్ కోసం ఆర్డర్ చేసినట్లు వెల్లడించింది. ఈ పుస్తకాలు మే 31 నాటికి అందుబాటులోకి రావొచ్చని తెలిపింది.

రంగంలోకి డ్రోన్‌లు.. పోలింగ్ బూత్‌ల్లో పటిష్ఠ నిఘా

డెహ్రాడూన్: లోక్‌సభ ఎన్నికలకు పటిష్ఠ నిఘా ఏర్పాటు చేస్తున్నారు ఉత్తరాఖండ్ పోలీసులు. మారుమూల ప్రాంతాల్లోని పోలింగ్ కేంద్రాలు, వాటి సమీప పరిసరాలపై ప్రత్యేక దృష్టి పెట్టనున్నారు. ఇక్కడ ఐదు లోక్‌సభ స్థానాలున్నాయి. అన్నింటికీ ఏప్రిల్ 19న మొదటి దశలో పోలింగ్ జరగనుంది. "2024 లోక్‌సభ సార్వత్రిక ఎన్నికలలో అత్యంత మారుమూల ప్రాంతాల్లోని పోలింగ్ స్టేషన్‌లు, పరిసర ప్రాంతాలను ఉత్తరాఖండ్ పోలీసులు డ్రోన్‌ల ద్వారా పర్యవేక్షిస్తారు" అని ఉత్తరాఖండ్ రాష్ట్ర ఎన్నికల సంఘం ఒక ప్రకటన ద్వారా తెలియజేసింది. ఉత్తరాఖండ్‌లోని క్లిష్ట భౌగోళిక పరిస్థితుల కారణంగా చాలా ప్రాంతాలలో సీసీటీవీ కెమెరాలు, నిఘా, ఫోటో, వీడియోగ్రఫీ వంటి వాటి కష్ట సాధ్యమని పేర్కొంది. ఇలాంటి మారుమూల ప్రాంతాల్లో డ్రోన్‌ల ద్వారా నిఘాను పర్యవేక్షించనున్నారు. ఈ డ్రోన్లు పంపిన ప్రత్యక్ష దృశ్యాలను స్కాన్ చేయడానికి రాష్ట్ర పోలీసులు తాత్కాలిక కంట్రోల్ రూమ్‌ను కూడా ప్రారంభించారు. "డ్రోన్ పంపిన చిత్రాలు, వీడియోలను ఎప్పకప్పుడు పర్యవేక్షిస్తూ అనుమానాస్పద వ్యక్తులు, వస్తువులు, కార్యకలాపాలు గుర్తించిన వెంటనే ఆ సమాచారం పోలీసు ప్రధాన కార్యాలయంలో ఉన్న ఎన్నికల కార్యకలాపాల కేంద్రానికి వెళ్తుంది" అని రాష్ట్ర ఎలక్షన్ కమిషన్ వివరించింది.

బెంగళూరుపై భారీ విమానం చక్కర్లు

బెంగళూరు: రెండ్రోజుల నుంచి బెంగళూరు నగరంలోని కొరమంగళ ప్రాంతంలో అతి తక్కువ ఎత్తులో ఓ బోయింగ్ విమానం తరచూ ప్రయాణించడం స్థానికులను భయాందోళనకు గురి చేస్తోంది. అక్కడే ఉన్న హిందూస్థాన్ ఏరోనాటిక్స్ లిమిటెడ్ ఎయిర్‌పోర్టుపై అది ఆరుసార్లు చక్కర్లు కొట్టి వెళ్లిపోతోంది. దీనికి సంబంధించిన వీడియోలు, ఫొటోలను స్థానికులు సామాజిక మాధ్యమం ఎక్స్‌లో పోస్టు చేశారు. ఫ్లైట్‌రాడార్24 వెబ్‌సైట్ ప్రకారం అది కే7067 నంబరు గల బోయింగ్ 777-337 విమానం. దానిని ప్రధాని, రాష్ట్రపతి వంటి వీవీఐపీలకు వినియోగిస్తుంటారు. కేంద్ర ప్రభుత్వం వద్ద ఇలాంటివి రెండు ఉన్నాయి. అది దిల్లీ నుంచి బెంగళూరు వచ్చి హాల్ విమానాశ్రయంపై ఆరు చుట్లు తిరిగినట్లు తేలింది. అది ఎక్కడా ల్యాండ్ అవ్వకుండానే తిరిగి దిల్లీ వెళ్లిపోయింది. ఇందిరానగర్‌పై కూడా ఇది చక్కర్లు కొట్టింది.

Printed & published by Edupuganti Nageswara Rao on behalf of Visalaandhra Vignana Samithi, Printed at Visalaandhra Press, Chandram Buildings, Machavaram, Vijayawada, Andhra Pradesh. Published at Visalaandhra Vignana Samithi, 33-22-2, Visalaandhra Road, Chuttugunta, Vijayawada - 520004, Andhra Pradesh. EDITOR : R.V. RAMARAO. RNI No. 1138/57, Postal: Regd. No.VJA: VJ/042/2024-26, Phones : Editorial :2430220, Manager : 2431301, Fax No. 0866 2431780, E-Mail : ap.visalaandhra@gmail.com